thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 157 కరీంనగర్ శుక్రవారం, 15 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## శాంతిని నెలకొల్పాలి: మోదీ

న్యూఢిల్లీ : ప్రధాని మోదీకి ఇరాన్ అధ్యక్షుడు పేజెష్కియాన్ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరువర్గాలు దౌత్య మార్గాలు, చర్చల ద్వారా పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పి, భద్రత, సుస్థిరతను స్థాపిం చాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడిపై ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విస్ఫోటనం అంచున ఉన్న ప్రాం తంలో ఉద్రిక్తతలను పెంచడం వల్ల అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పు వాటిల్లుతుందని అభిప్రాయపడ్డారు. మరో వైపు, అమెరి కా దాడుల నేపథ్యంలో ఫోర్డో, నటాంజ్, ఇస్ఫ హాన్ వద్ద ఎలాంటి రేడియేషన్ లీకేజీ లేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) చీఫ్ రాఫెల్ గ్రాసీ ప్రకటించారు. ఇరాన్‌పై అమెరికా దాడిని పాకిస్థాన్ కూడా ఖండించింది. తనను తాను రక్షించుకునే హక్కు ఇరాన్‌కు ఉందని స్పష్టం చేసింది.






## ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి

హైదరాబాద్: వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.

## రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తే.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు: ఎంపీ రఘునందన్‌రావు

హైదరాబాద్: దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం (రాజీవ్‌గాంధీ) ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తాం. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,



తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నాం. బెంగాల్‌లో డైమండ్ హార్బర్‌నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయి. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు.

బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండ దెబ్బ కొట్టి తిక్క తిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం" అని రఘునందన్‌రావు అన్నారు.





# ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి

హైదరాబాద్: వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.



# జిల్లాలకు అతిభారీ వర్ష సూచన

హైదరాబాద్: నేడు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు.

ఈ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.



# హత్యాచారం కేసులో నిందితుడికి ఉరిశిక్ష

నల్గొండ: మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో పాటు హత్యకు పాల్పడిన కేసులో నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు ఉరిశిక్ష విధించింది. 2013లో నిందితుడు మోహమ్మీ ముకల్లము, 12 ఏళ్ల బాలిక నల్గొండలోని ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేశాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరగగా, నేడు పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తుదితీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి ఉరి శిక్షతో పాటు రూ.1.10 లక్షల జరిమానాను విధించారు.

# ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ సోదాలు

హైదరాబాద్: ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ పరిమ్యాచ్ కేసులో హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఈడీ 17 చోట్ల సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌తో పాటు ముంబయి, సూరత్, ఢిల్లీ, నోయిడా, జైపూర్, మధురై, కాన్పూర్‌లలోను సోదాలు జరిగాయి. ఈసందర్భంగా పలు బ్యాంకు ఖాతాల్లోని రూ.110 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు ఈడీ అధికారులు తెలియజేశారు. డిజిటల్ డాక్యుమెంట్లు, మ్యూల్ ఖాతాల డెబిట్, క్రెడిట్ కార్డులు, డిజిటల్ పరికరాలను సైతం స్వాధీనం చేసుకొన్నామన్నారు. ముంబయి సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో పరిమ్యాచ్ డాట్ కామ్ పై నమోదైన కేసు ఆధారంగా మరో కేసు కూడా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు పెట్టుబడి పెట్టిన వారి నుంచి ఏడాదిలో రూ.3 వేల కోట్లు కాజేసినట్లు ఈడీ పేర్కొంది. మ్యూల్ ఖాతాల్లో నగదు ఉంచి తమిళనాడు మధురైలలో భారీగా నగదు విత్ డ్రా చేసినట్లు గుర్తించింది. హవాలా రూపంలో డబ్బును యూకేకి పంపి అక్కడ క్రిప్టో కరెన్సీగా మార్చినట్లు గుర్తించామని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

# భారీ వర్షాలు.. వణుకుతున్న భాగ్యనగరం..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాల కురుస్తున్న నేపథ్యంలో భాగ్యనగరం భయంతో వణుకుతోంది. వర్షాల ధాటికి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. జనజీవనం స్తంభించిపోయింది. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ.. సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. ఈ మేరకు అధికారులు మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ నేపథ్యంలో హిమాయత్ సాగర్ 10 గేట్లను అధికారులు తెరిచారు. దీంతో కుల్సుంపురా ప్రాంతంలోని మూసీ నది రోడ్డును వరదనీరు ముంచెత్తింది. వెంటనే అధికారులు రోడ్డును మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. అయితే గేట్లు ఓపెన్ చేయడంతో నీటితోపాటు పురుగులు, పాములు సైతం రోడ్లపైకి కొట్టుకువస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిమాయత్ సాగర్ నుంచి మూసీ నదిలోకి వరద నీరు వదలడంతో పురాణ పుల్ స్మశాన వాటికలోకి నీరు వచ్చి చేరింది. దీంతో అంత్యక్రియలకు విఘాతం చోటుచేసుకుంది. అయితే, తాజాగా మూసీ పరివాహక ప్రాంతాల్లో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు అధికారులు. హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తడంతో ఉగ్రరూపం దాల్చింది మూసి. దీంతో జియాగూడ, పురానా పూల్ రోడ్డు మార్గం పూర్తిగా నీట మునిగింది. చాదర్ ఘాట్, శంకర్ నగర్ బస్తీలలో మూసీ వరదనీరు ఇళ్లలోకి చేరింది. దీంతో అధికారులు అక్కడి ప్రజలను ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, బేగంబజార్ మార్కెట్‌లోని సంతోషిమాత దేవాలయం సమీపంలో ఉన్న 100 సంవత్సరాల పురాతన భవనం గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇవాళ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ పురాతన భవనంలో గత 20 సంవత్సరాలుగా ఎవరూ నివాసం ఉండడం లేదు. ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అయితే ప్రమాదం జరిగినప్పుడు పరిసర ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు భవన శిథిలాలను తొలగిస్తున్నారు. అదేవిధంగా గోషామాల్ నియోజవర్గంలో పురాతన భవనాల్లో వ్యాపారాలు చేస్తున్న వారిని వెంటనే దుకాణాలను ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేశారు



# సీఎం యోగిపై ప్రశంసలు.. ఎమ్మెల్యే పూజా పాల్‌పై వేటు

మాఫియా ఆగడాలపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై ఎస్పీ ఎమ్మెల్యే పూజా పాల్ ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం కాస్త స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే గంటల వ్యవధిలోనే ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆమెపై చర్యలకు ఉపక్రమించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ పూజా పాల్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. తక్షణమే ఇది అమల్లోకి వస్తుందని ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీలో 'విజన్ డాక్యుమెంట్ 2047'పై 24 గంటల పాటు సుదీర్ఘ చర్చ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్పీ ఎమ్మెల్యే పూజా పాల్ మాట్లాడుతూ.. తన భర్త (బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రాజు పాల్) హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీక్ అహ్మద్ ఆగడాలపై చర్యలు తీసుకున్న యోగి ప్రభుత్వం.. తనతోపాటు అనేక మంది మహిళా బాధితులకు న్యాయం చేసిందన్నారు. అతీక్ వంటి నేరగాళ్లపై తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. నేరాల అదుపు కోసం తీసుకుంటున్న చర్యలపై రాష్ట్రం మొత్తం ముఖ్యమంత్రి వైపే చూస్తోందన్నారు. అయితే.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడ్డారని, ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ పార్టీకి నష్టం చేకూర్చారని పేర్కొంటూ అఖిలేశ్ యాదవ్ ఆమెపై వేటు వేశారు. యూపీలో 2005లో బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్యకు గురికావడం అప్పట్లో సంచలనం రేపింది. పూజా పాల్‌తో వివాహమైన 10 రోజులకే ఆయన హత్యకు గురయ్యారు. నాటి ఉప ఎన్నికల్లో రాజుపాల్ చేతిలో ఓటమి పాలైన అష్రాఫ్ అహ్మద్.. తన సోదరుడు అతీక్ సాయంతో ఈ దారుణానికి పాల్పడినట్లు ఆరోపణ లు వచ్చాయి. గ్యాంగ్‌స్టర్ నుంచి రాజకీయ నేతగా ఎదిగిన అతీక్ అహ్మద్ గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగానూ పనిచేశాడు. ఆ తర్వాత వేర్వేరు కేసుల్లో అతీక్, అష్రాఫ్‌లు దోషులుగా తేలారు. 2023 ఏప్రిల్‌లో ఓ కేసు విచారణ సందర్భంగా వైద్య పరీక్షల కోసం తరలిస్తున్న సమయం లో జర్నలిస్టుల్లా వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతీక్, అష్రాఫ్‌లను తుపాకులతో కాల్చి చంపారు.

# రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తే.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు: ఎంపీ రఘునందన్‌రావు



హైదరాబాద్: దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం (రాజీవ్‌గాంధీ) ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తాం. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నాం. బెంగాల్‌లో డైమండ్ హార్బర్‌నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయి. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండ దెబ్బ కొట్టి తిక్క తిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం" అని రఘునందన్‌రావు అన్నారు.

# కానిస్టేబుళ్లకు దూరవిద్య.. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పోలీసుశాఖ మధ్య ఒప్పందం

హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలంగాణ పోలీసుశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దూరవిద్య విధానంలో కానిస్టేబుళ్లు డిగ్రీ చదివేందుకు వీలుగా యూనివర్సిటీ, పోలీసు అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను డీజీపీ జితేందర్, వర్సిటీ ఉన్నతాధికారులు మార్చుకున్నారు. డిగ్రీ పూర్తికాని కానిస్టేబుళ్లు, ఏఎస్పైలకు దూరవిద్య విధానం అమలు చేయనున్నారు. కానిస్టేబుళ్లకు కోర్సు మెటీరియల్, స్టడీ సెంటర్ యాక్సెస్ ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు.





# మంజీరాకు వరద ముప్పు.. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం మూసివేత

**మెదక్ జిల్లా ఏడుపాయల వన దుర్గామాత ఆలయాన్ని అర్చకులు, అధికారులు మూసివేశారు. భారీ వర్షాల కారణంగా వరదనీరు పోటెత్తడంతో అధికారులు సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అమ్మవారి ఆలయం ఎదుట మంజీరా నదికి ఏ క్షణాన అయిన వరద ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంది. దీంతో ముందు జాగ్రత్తగా వన దుర్గామాత ఆలయాన్ని మూసివేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు.**



# యాత్రా మార్గంలో ఘోరం.. 32 మంది మృతి

శ్రీనగర్, ఆగస్ట్ 14: జమ్మూకాశ్మీర్ కిష్టావర్ జిల్లా పద్దార్ సబ్ డివిజన్ పరిధిలోని చిషోటీ గ్రామ పరిసర ప్రాంతంలో గురువారం మేఘ విస్ఫోటనం సంభవించింది. ఆ క్రమంలో 32 మంది మరణించారు. 75 మంది తీవ్రంగా గాయపడ్డారు. మాచైల్ మాతా యాత్ర మార్గంలో ఈ గ్రామం ఉండడంతో మృతుల సంఖ్య మరింతగా పెరగవచ్చని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం ఆ ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. ఇక క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి జిల్లా యంత్రాంగం తరలించింది. మేఘ విస్ఫోటనం అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై గవర్నర్, సీఎంలతో కేంద్ర మంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భద్రతా దళాలు, పోలీసులు సంయుక్తంగా ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు.

అయితే ఈ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కిష్టావర్ డిప్యూటీ కమిషనర్ పంకజ్ కుమార్ శర్మ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. భారీ వరద కారణంగా 12 మంది మరణించడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అలాగే సహాయక చర్యలు తీసుకోవాలంటూ పౌర, పోలీస్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులకు గవర్నర్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 157 కరీంనగర్ శుక్రవారం, 15 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## శాంతిని నెలకొల్పాలి: మోదీ

న్యూఢిల్లీ : ప్రధాని మోదీకి ఇరాన్ అధ్యక్షుడు పేజెష్కియాన్ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరువర్గాలు దౌత్య మార్గాలు, చర్చల ద్వారా పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పి, భద్రత, సుస్థిరతను స్థాపిం చాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడిపై ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విస్ఫోటనం అంచున ఉన్న ప్రాం తంలో ఉద్రిక్తతలను పెంచడం వల్ల అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పు వాటిల్లుతుందని అభిప్రాయపడ్డారు. మరో వైపు, అమెరి కా దాడుల నేపథ్యంలో ఫోర్డో, నటాంజ్, ఇస్ఫ హాన్ వద్ద ఎలాంటి రేడియేషన్ లీకేజీ లేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) చీఫ్ రాఫెల్ గ్రాసీ ప్రకటించారు. ఇరాన్‌పై అమెరికా దాడిని పాకిస్థాన్ కూడా ఖండించింది. తనను తాను రక్షించుకునే హక్కు ఇరాన్‌కు ఉందని స్పష్టం చేసింది.

# కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు బిగ్ షాక్




## తొలగించిన 65 లక్షల ఓటర్ల జాబితాను బహిర్గతం చేయండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై మరోసారి సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం ఏదైతే ఓటర్లను తొలగించామని చెప్పిందో.. ఆ 65లక్షలకు పైగా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో వారిని ఎందుకు తొలగించారో పేర్కొంటూ వివరణతో కూడిన ఆ లిస్టును పబ్లిక్‌లోకి తీసుకురావాలని పేర్కొంది ధర్మాసనం. ఈ అంశానికి సంబంధించి గురువారం(ఆగస్టు 14వ తేదీ) విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. 22 లక్షల మందిని చనిపోయారన్న కారణంతో తొలగించడాన్ని సైతం? ప్రశ్నించింది. బూత్ లెవెల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. పౌరుల హక్కు రాజకీయ పార్టీలపై ఆధారపడటం మాకు ఇష్టం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'భారత ఎన్నికల కమిషన్ వాదనలను మేము పూర్తిగా విన్నాం. విచారణ సమయంలో, ఈ క్రింది దశలను అంగీకరించారు. 2025 జాబితాలో పేర్లు కనిపించినప్పటికీ, తాజాగా జాబితాలో చేర్చబడని 65 లక్షల మంది ఓటర్ల జాబితాను జిల్లా స్థాయి వెబ్‌సైట్‌లలో ప్రదర్శించాలి' అని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. కాగా, బీహార్లో ఎన్నికల సంఘం హడావుడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణను ప్రతి పక్షాలు తప్పుబడుతున్నాయి. మరోవైపు ఈ జాబితా సవరణలోని లోపాలు ప్రతీ రోజూ బయటపెడుతూనే ఉన్నాయి. వీటిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయ. మరొకవైపు ఈసీ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, అనర్హులైన ఓటర్లను తొలగిస్తూ, ఓటర్ల జాబితాను శుద్ధి చేసేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు వివరణ ఇస్తూ వస్తోంది.. అయితే ప్రతిపక్షాలు ఈ ఓటర్లు జాబితా సవరణ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఇంతలో లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మహారాష్ట్ర, కర్నాటకలలో ఓటర్ల జాబితాలో ఓట్ల చోరీని ఆధారాలతో సహా బయటపెట్టడంతో పాటు బీహార్ లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపైనా పలు విమర్శలు గుప్పిస్తున్నారు.




## తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభించింది. ఆర్డినెన్స్ 3కి గవర్నర్ ఆమోదం లభించడంతో న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

ఈ ఆర్డినెన్స్ ద్వారా సంగారెడ్డి జిల్లాలో ఇంద్రీశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు సైతం ఓటుహక్కు కల్పించేలా తెలంగాణ మున్సిపల్ చట్టంలోని సెక్షన్–20కి సవరణ చేశారు.

# పరిషత్ ఎన్నికలపై పార్టీల కసరత్తు

## ప్రతి స్థానమూ దక్కించుకునేలా కాంగ్రెస్ వ్యూహం




హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు రాజకీయపార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. స్థానిక ఎన్నికల నిర్వహణ ఖాయంగా ఉంటుందనే సంకేతాలతో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ ఈ దిశగా కార్యాచరణ మొదలుపెట్టాయి. వామపక్ష పార్టీల నాయకులు సైతం అవకాశమున్నచోట బరిలో దిగేందుకు ప్రయత్నిస్తుండగా, బీఆర్ఎస్ నాయకులు సైతం రిజర్వేషన్లు ఖరారయితే పోటీపడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికల పోరుకు రాజకీయపార్టీలు, నాయకులు రంగం సిద్ధం చేసుకుంటుండడంతో క్షేత్రస్థాయిలో సందడి మొదలైంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ స్థానిక సంస్థల్లోనూ విజయబావుటా ఎగురవేయడమే ఏకైక లక్ష్యంగా కార్యాచరణ చేపట్టింది. ఓ వైపు ఇప్పటికే సంస్థాగత ఎన్నికల ప్రక్రియను సీరియ్‌సగా కొనసాగిస్తున్న ఆ పార్టీ ఉమ్మడి జిల్లాలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ పట్టుని నిరూపించుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో వంద శాతం విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా గురిపెట్టారు. తమతమ నియోజకవర్గాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఏ రిజర్వేషన్ వస్తే ఎవరికి అవకాశమివ్వాలి....? బలమైన నాయకులకు అవకాశమివ్వలేకపోతే వారికి ఎలా నచ్చజెప్పాలనే అంశంలో ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు కేడర్‌లో చర్చ సాగుతోంది. పార్టీకి, నాయకత్వానికి విధేయతగా ఉంటూ వచ్చిన నాయకులు, యువతకు ఈసారి అవకాశాలు దక్కుతాయని అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యేలు సూచించిన వారికే అభ్యర్థిత్వాలు దక్కనుండడంతో ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులు వారిని ప్రస న్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మండలంలో, ఎంపీటీసీ స్థానం పరిధిలో తమ మద్దతుదారులతో కలిసి ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రుల ను కలుస్తూ వారి దృష్టిలో పడే ప్రయత్నాలు చేస్తున్నారు.

**పోటీకి సై అంటోన్న ప్రతిపక్షాలు..** స్థానిక ఎన్నికల్లో పోటీచేసి సత్తా చాటేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ సైతం సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస‌తో స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తుపై అధిష్ఠానంనుంచి స్పష్టత వస్తే దానికనుగుణంగా పోటీచేసే అంశంపై కార్యాచరణ రూపొందించుకునేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధమవుతుండగా, సీపీఎం తమకు పట్టున్న స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది. ఆయా స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న నాయకులు ఇప్పటికే స్థానిక సమస్యలపైనా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు సైతం స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీకి పార్టీ నాయకత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వం ఎన్నికల ప్రకటన విడుదల చేసిన తక్షణమే అభ్యర్థుల ఎంపికచేసి ప్రచారంలోకి దిగుతామని ఆపార్టీ నేతలు చెబుతున్నారు. రిజర్వేషన్లు తేలితే అభ్యర్థుల ఎంపిక చేపట్టేందుకు పార్టీనేతలు సిద్ధంగా ఉన్నారు.

**రంగం సిద్ధం చేసుకుంటున్న నేతలు ..** పార్టీల నుంచి పోటీ చేయాలనుకుంటున్న స్థానిక నాయకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలే కీలక పాత్ర వహించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన బీజేపీ అదే తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే జిల్లాస్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించింది. త్వరలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో వర్క్‌షాపులు నిర్ణయించి స్థానిక సంస్థల ఎన్నికల్లో తీసుకోవాల్సిన ఎజెండాను ఖరారు చేస్తున్నారు. ఏ రిజర్వేషన్ వస్తే ఏ స్థానంలో ఎవరిని నిలబెట్టాలనే విషయంలోనూ పార్టీ ఆరా తీస్తుంది. ప్రతి స్థానం నుంచి ముగ్గురి పేర్లను పరిశీలించి అభ్యర్థిని ఎంపికచేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్షాలు సైతం స్థానిక ఎన్నికల్లో బలంగా పోటీపడాలని భావిస్తుండడంతో స్థానిక సమరం రసవత్తరంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కొత్త రేషన్ కార్డుదారులకు గుడ్‌న్యూస్..!

## బియ్యం పంపిణీ ఎప్పుడంటే?




హైదరాబాద్ : వచ్చే నెల అంటే సెప్టెంబర్ నుంచి రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయనున్నారు. కొత్తగా రేషన్ కార్డులు వచ్చిన వారికి కూడా బియ్యం అందజేయనున్నారు.

ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన కోటా మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా త్వరలో కోటా మంజూరు చేయనుంది.

ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో పెట్టుకొని జూన్‌లో ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

దీంతో జూలై, ఆగస్టు నెలల్లో బియ్యం ఇవ్వలేదు. మూడు నెలలు ముగియడంతో ఇక సెప్టెంబర్ నుంచి బియ్యం పంపిణీ చేయనున్నారు. అయితే ఈ సారి కొత్త రేషన్ కార్డులతోపాటు పాత రేషన్ కార్డుల్లో కొత్తగా మెంబర్లుగా యాడ్ అయిన వారికి కూడా బియ్యం పంపిణీ చేయనున్నారు.

**96,060 కొత్త కార్డులకు బియ్యం..** ప్రతినెలా డైనమిక్ కీ రిజిస్ట్రర్ (డీకేఆర్) జనరేట్ చేస్తారు. ఈ రిజిస్ట్రర్ జనరేట్ చేసే సమయానికి ఎన్ని కార్డులు ఉంటే అన్ని కార్డులకు బియ్యం కోటా అలాట్ చేస్తారు. ఏప్రిల్? 25న డైనమిక్ కీ రిజిస్టర్ జనరేట్ చేసిన నాటికి పెరిగిన రేషన్ కార్డులకు, యాడ్ అయిన మెంబర్లకు మూడు నెలల బియ్యం పంపిణీ చేశారు. ఏప్రిల్ 2025 నాటికి ఉమ్మడి జిల్లాలో 10,17,023 కార్డులు ఉండగా, మేలో లబ్ధిదారులకు బియ్యం అందించారు. మే 25 నాటికి 10,29,230 రేషన్ కార్డులకు చేరగా, జూన్‌లో వారందరికీ మూడు నెలల కోటా బియ్యం అందించారు. ఆ తర్వాత మే 25 నుంచి ఆగస్టు 9 వరకు కొత్తగా 96,060 కార్డులు మంజూరు చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య 11,25,290కు చేరింది. ఈ రేషన్ కార్డుల్లో మొత్తంగా 34,05,671 మంది మెంబర్లుగా ఉన్నారు. వీరందరికీ 20,434 టన్నుల బియ్యం అందించనున్నారు.

# చురకలు

## సంపాదకీయం

### టారిఫ్ వివాదాల నడుమ మోడీ అమెరికా పర్యటన కథేంటి?

ఇండియా–అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఇటీవల కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ టారిఫ్ వివాదాల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వచ్చే నెల అమెరికా పర్యటనకు సన్నద్ధమవుతున్నారని ఢిల్లీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించగలదని, అలాగే భవిష్యత్తులో వాణిజ్య సంబంధాలను మెరుగుపరచగలదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


**– వాణిజ్య ఉద్రిక్తతలకు కారణాలు.....** భారత్ – అమెరికా మధ్య సుంకాల వివాదం ఇటీవల ముదిరింది. అమెరికా ప్రభుత్వం భారతీయ దిగుమతులపై కఠినమైన టారిఫ్‌లను విధించ డం ఈ ఉద్రిక్తతలకు ప్రధాన కారణం. గతంలో ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాయి. అయితే, ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఈ సంబంధాలను దెబ్బతీశా యి. దీనికి అదనంగా భారతదేశం రష్యాతో కొనసాగిస్తున్న సంబంధాలు కూడా అమెరికా ప్రభుత్వ ఆగ్రహానికి కారణమయ్యాయి. ఈ అంశాలన్నీ వాణిజ్య ఉద్రిక్తతలకు దారితీశాయి.

**మోడీ పర్యటన షెడ్యూల్ – అంచనాలు...** ప్రధాని కార్యాలయ వర్గాల ప్రకారం, మోడీ సెప్టెంబర్ చివరి వారంలో అమెరికాలో జరిగే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొ ననున్నారు. ఈ పర్యటనలో ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. అయితే ఈ సమావేశం జరగడం ఇరు దేశాల మధ్య జరగనున్న ఉన్నత స్థాయి వాణిజ్య చర్చల ఫలితంపై ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది. ఈ చర్చలు విజయవంతమైతే, ఇరు దేశాల నాయకుల సమావేశం వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించవచ్చు.

**–పుల్వామా – ఇతర అంశాలు...** ఈ మధ్యకా లంలో జరిగిన కొన్ని సంఘటనలు కూడా ఇరు దేశాల మధ్య సంబంధాలను ప్రభావితం చేశాయి. పుల్వామా దాడి అనంతరం భారత్ – పాకిస్తాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణను తాను సాధించానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను భారత ప్రభుత్వం ఖండించడం ఒక ఉదాహరణ. ఈ సంఘటన కూడా సంబంధా లపై ప్రతికూల ప్రభావం చూపింది. అంతర్జాతీ య అంశాలను పరిశీలిస్తే, ఆగస్టు 15న ట్రంప్ – రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరగనున్న సమావేశం ఫలితం కూడా మోడీ పర్యటనపై ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ రాజకీయాల్లో జరిగే పరిణామాలు కూడా ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపుతాయి.

**పర్యటన యొక్క ప్రాముఖ్యత...** ఈ వాణిజ్య ఉద్రిక్తతల నడుమ, ఇరు దేశాల శక్తివంతమైన నాయకులైన మోడీ – ట్రంప్ సమావేశం చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావే శం ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న విభేదాలు తగ్గి, వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయని విశ్లేషకులు ఆశిస్తున్నారు. ఇది ఈ ఏడాది మోడీకి రెండో అమెరికా పర్యటన. ఫిబ్రవరిలో ఆయన ట్రంప్‌ను కలిసిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో మోడీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సహా ఇతర అంతర్జాతీయ నాయ కులను కూడా కలిసే అవకాశం ఉంది. ఈ సమావేశాల ద్వారా భారతదేశం తన అంత ర్జాతీయ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవచ్చని భావిస్తున్నారు.

# దేశ తొలి స్వాతంత్ర్య వేడుకల్లో మహాత్ముడు ఎందుకు పాల్గొనలేదు



రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పాలన నుంచి, శతాబ్దపు స్వాతంత్ర్య పోరాటాల ద్వారా భారతావని స్వేచ్ఛావాయువులు పొందిన సందర్భం భారతీయులంతా అవధులు దాటిన ఆనందం అనుభవించిన సమయం. దేశాన్నంతటినీ ఏకదాటిపైకి తెచ్చి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించిన విషయం అందరూ అంగీకరించే సత్యం. స్వాతంత్ర్యం సాధించి, జరుపుకున్న తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఘట్టం భరత జాతికి అపూర్వ, అనిర్వచనీయ జ్ఞాపకం. 1947 ఆగస్టు 15 నాటి అలాంటి ముఖ్యాతి ముఖ్య మహోత్సవ వేడుకల సందర్భానికి జాతిపిత ఎందుకు దూరంగా ఉన్నారు. ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ– ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితేనే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశ మంతా సంబరాలు జరుపు కుంటుంటే..గాంధీ మాత్రం సంబరాలకు బహు దూరంగా, ఢిల్లీకి దూరంగా ఉండడం విశేషం. 1946లో మతోన్మాదం ప్రారంభం కాగానే గాంధీ బెంగాల్, బీహార్ తదితర ప్రభావిత ప్రాంతాలు పర్యటించారు. దెబ్బై ఐదు పైబడి వయసు ఉన్న గాంధీ కాలి నడకన, తిరుగుతూ హిందువులను, ముస్లింలను కలిసి, సమావేశాలలో ప్రసంగించి పరిస్థితులను చక్కబెట్టే ప్రయత్నం చేశారు. మరోసారి ఆగస్ట్ 1947 మొదట్లో ఢిల్లీ వదిలి, కలకత్తాలోని ముస్లింల ఆధిక్యత గల బెలియాఘాట్ చేరుకొని, ప్రహరీలు లేని పాడుబడిన భవనంలో అక్కడే నివసించారు. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్దఎత్తున సంభవించిన వలసలవల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ – పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలిసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. ఏ హింసనైతే నివారించటానికి అంత సహనంతో అహింస, సత్యాగ్రహం ఆయుధాలతో పోరాటాన్ని ముందుకు తీసుకొని వెళ్లారో, అదే జగ గూడని హింస పేట్రేగడంతో గాంధీజీ దిగులు చెందారు.పలు పత్రికలు ఆయన సందేశం కోసం అడిగినప్పటికీ తిరస్కరించారు. అయితే 15 ఆగస్ట్ 1947న గాంధీ ఉపవాసం ఉంటూ, ప్రార్థన చేసుకొనుటకు నిర్ణయించు కున్నారు. ఆగస్టు 15న భారతదేశానికి స్వతంత్రం వస్తుందనే విషయం పక్కాగా తెలియగానే జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్ భాయి పటేల్ మహాత్మా గాంధీకి లేఖ రాశారు. అందులో "ఆగస్టు 15 మన మొదటి స్వతంత్ర దినోత్సవం అవుతుంది. మీరు జాతిపిత. ఇందులో పాల్గొని మీ ఆశీస్సులు అందించండి" అని కోరారు. గాంధీ ఆ లేఖకు సమాధానం ఇచ్చారు. అందులో "కలకత్తాలోని హిందూ – ముస్లింలు ఒకరి ప్రాణాలు ఒకరు తీసుకుంటున్నప్పుడు నేను సంబరాలు జరుపుకోడానికి ఎలా రాగలను. ఈ ఘర్షణలు ఆపడానికి నేను నా ప్రాణాలైనా ఇస్తా" అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ తన చారిత్రక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ఆగస్టు 14న అర్ధరాత్రి వైస్రాయ్ లాంజ్ (ప్రస్తుత రాష్ట్రపతి భవన్) నుంచి ఇచ్చారు. నెహ్రూ అప్పటికి ఇంకా ప్రధానమంత్రి కాలేదు. ఆయన ప్రసంగాన్ని ప్రపంచమంతా విన్నది. కానీ, గాంధీ ఆరోజు 9 గంటలకే నిద్రపోయారు. మహాత్మాగాంధీ స్వతంత్రం లభించిన రోజున ఢిల్లీకి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బెంగాల్ లోని నోవాఖాలీలో ఉన్నారు. అక్కడ ఆయన హిందూ, ముస్లిం మధ్య మత ఘర్షణలను అడ్డుకోవడానికి నిరాహారదీక్ష చేస్తూ ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# భారత జాతీయ పతాక తయారీ, నిబంధనలు



భారత జాతీయ పతాకం, దీర్ఘ చతురస్రాకారంలో కాషాయం, తెలుపు, పచ్చ రంగులు సమ నిష్పత్తిలో త్రివర్ణంగా ఉంటూ మధ్యలో 24 ఆకులు కలిగిన నేవీ బ్లూ రంగులో ఉండే చక్రమైన అశోక చక్రంతో ఉంటుంది. 1947 జూలై 22న భారత రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రస్తుతం ఉన్న రూపంలో ఆమోదం పొంది, 1947 ఆగస్టు 15న భారత డొమినియన్‌కు అధికారిక పతాకంగా ఆమోదం పొందింది. తర్వాత క్రమేపీ భారత గణతంత్రానికి అధికారిక పతాకంగా స్వీకరించారు. 1951లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బి.ఐ.ఎస్.) జాతీయ పతాకానికి కొన్ని నిర్దేశకాలను రూపొందించింది. ఈ నిర్దేశకాలను మన దేశంలో అమల్లోకి వచ్చిన మెట్రిక్ మానానికి సరిపోయేటట్లు 1964లో ఒకసారి, 1968 ఆగస్టు 17న మరొక సారి సవరించారు. పతాక పరిమాణం, రంగులు, వాడే బట్టకు వర్తించే ఈ నిర్దేశకాలు చాలా కచ్చితమైనవి. వీటి ఉల్లంఘన శిక్షార్హమైన నేరం. పతాక కొలతలు మి.మీ. లలో...6300 ఐ 4200బీ 3600 ఐ 2400బీ 2700 ఐ 1800బీ 1800 ఐ 1200బీ 1350 ఐ 900బీ 900 ఐ 600బీ 450 ఐ 300బీ 225 ఐ 150బీ 150 ఐ 100గా నిర్ణయించారు. పతాకం తయారీలో ఖాదీ లేక చేనేత వస్త్రాన్ని మాత్రమే వాడాలి. ఖాదీలో నూలు, పట్టు, ఉన్ని బట్టలను మాత్రమే వాడుతారు. జెండాలో రెండు రకాల ఖాదీని వాడుతారు: జెండా రూపానికి ఖాదీ–బంటింగ్, జెండాను కఱ్ఱకు తగిలించడానికి అవసరమయ్యే బట్టకు ఖాదీ–డక్. ఖాదీ–డక్ ప్రత్యేకమైన %ఎవఅస్త్రవ% (పసుపు పచ్చ–బ్రౌన్ కలిసిన రంగు) రంగులో ఉంటుంది. సాంప్రదాయిక నేతలో రెండు పోగులను వాడేచోట ఖాదీ–డక్ లో మూడు పోగులను వాడుతారు. ఇది చాలా అరుదైన నేత. దేశం మొత్తమ్మీద ఈ రకమైన నేతపని తెలిసినవాళ్ళు పదిమంది కంటే ఎక్కువ లేరు. ఇంకా చదరపు సెంటీ మీటరుకు కచ్చితంగా 150 పోగులు ఉండాలని, కుట్టుకు నాలుగు పోగులు ఉండాలని, ఒక చదరపు అడుగు గుడ్డ కచ్చితంగా 205 గ్రాములుండాలని నిర్దేశకాలు ఉన్నాయి. జాతీయపతాకాలను ఉత్పత్తిచేయడానికి అవసరమైన ఖాదీ బట్ట ఉత్తర కర్ణాటకలోని ధార్వాడ్, బాగల్కోట్ జిల్లాల్లోని రెండు చేనేత యూనిట్ల నుంచి వస్తుంది. ప్రస్తుతం దేశంలో జాతీయ పతాకాలను తయారు చేయడానికి ప్రభుత్వ అనుమతి గల ఒకే ఒక్క సంస్థ హుబ్లీలో ఉంది. జాతీయ పతాకాలను ఉత్పత్తి చేయడానికి అనుమతి ఇచ్చే అధికారం ఖాదీ డెవలప్‌మెంట్ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ కు ఉన్నప్పటికీ ఆ అనుమతిని రద్దు చేసే అధికారం బి.ఐ.ఎస్.కు ఉంది. నేసిన బట్టను పరీక్ష నిమిత్తం బి.ఐ.ఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు పంపిస్తారు. తిరిగొచ్చిన తర్వాత బ్లీచింగు చేసి రంగులద్ది, మధ్యలో అశోకచక్రాన్ని స్క్రీన్ ప్రింటింగు గానీ, స్టెన్సిల్ గానీ, ఎంబ్రాయిడరీ గానీ చేస్తారు. చక్రం రెండు వైపులా ఒకేచోట స్పష్టంగా కనిపించాలి. జెండాపై వేసిన రంగులను బి.ఐ.ఎస్. పరీక్షించిన తర్వాతే పతాకాలను అమ్మటానికి అనుమతిస్తారు. మన దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు నాలుగు కోట్ల జెండాలు అమ్ముడు పోతాయి. దేశంలోనే అతిపెద్ద పతాకం (6.3 ఐ 4.2 మీ) మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన మంత్రాలయ భవనం మీద ఎగురుతుంది. 2002కు ముందు జాతీయ సెలవు దినాల్లో తప్ప మిగతా సమయాల్లో జాతీయ పతాకాన్ని ప్రజలు ఎగరేయడానికి అనుమతించేవారు కాదు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు మాత్రమే ఆ అధికారముండేది. ఈ నిబంధనను తొలగించాలని కోరుతూ నవీన్ జిందాల్ అనే పారిశ్రామికవేత్త ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశాడు. జిందాల్ తన కార్యాలయ భవంతి మీద జాతీయ పతాకాన్ని ఎగురవేయగా అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుని, ఆయన్ను ప్రాసిక్యూట్ చేస్తామని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా జాతీయ పతాకాన్ని ఎగరేయడం పౌరుడిగా తన హక్కని, దేశం పట్ల తన ప్రేమను ప్రకటించుకునే మార్గమని జిందాల్ వాదించాడు. ఆ కేసు సుప్రీమ్ కోర్టుకు వెళ్ళింది. సుప్రీమ్‌కోర్టు ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని వేయమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర మంత్రిమండలి పతాకం గౌరవానికి భంగం కలగని రీతిలో ఎవరైనా జాతీయ పతాకాన్ని ఎగరేయవచ్చని అనుమతిస్తూ జాతీయపతాక నియమావళిని సవరించింది. భారత జెండా కోడ్, జాతీయ చిహ్నాలకు సంబంధించిన ఇతర చట్టాలు జెండా వాడుకకు వర్తిస్తాయి. మొదట్లో ఈ కోడ్ భారత స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ దినోత్సవాల సందర్భాలలో తప్ప మిగతా రోజుల్లో సాధారణ పౌరులు జెండాను వాడడం నిషేధించింది. 2002లో నవీన్ జిందాల్ అభ్యర్థన పరిశీలిస్తూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సాధారణ పౌరులు జెండాను వాడుకునేందుకు వీలుగా కోడ్‌ను సవరించమని భారత ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దాన్ని అనుసరించి భారతీయ కేంద్ర మంత్రివర్గం కోడ్‌ను పరిమితంగా వాడేందుకు సాధారణ పౌరులకు వీలునిస్తూ సవరించింది. 2005లో మరోసారి కోడ్‌ను సవరించి కొన్ని రకాల దుస్తుల మీద ఉపయోగించడం సహా మరికొన్ని అదనపు వాడుకలను అనుమతించారు. జెండాను ఎగురవేయడం, ఇతర జాతీయ, సాధారణ జెండాలతో కలిపి భారత జాతీయ పతాకాన్ని వాడేప్పుడు అనుసరించాల్సిన విధానాలకు ఆ కోడ్ వర్తిస్తుంది. ఈ సవరణ 2002 జనవరి 26 న అమల్లోకి వచ్చింది. జాతీయపతాక నియమావళి అనేది చట్టం కానప్పటికీ, ఆ నియమావళి లోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీమ్‌కోర్టు యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో పేర్కొంది. జాతీయ పతాకాన్ని ఎగిరేసే హక్కు సంపూర్ణ హక్కు కాదు. పరిమితులతో కూడిన హక్కు. దీన్ని భారతరాజ్యాంగంలోని 51ఎ ఆర్టికల్ లోని ప్రాథమిక విధులతో కలిపి అన్వయించ వలసి ఉంటుంది. వాస్తవంగా జెండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కూడా యూనిఫారాలు, బట్టలు, ఇతర వస్త్రాలపై జెండా వినియోగాన్ని ఒప్పుకోదు. జూలై 2005 లో, భారతదేశం ప్రభుత్వం కొన్ని రకాల వినియోగాన్ని అనుమతించటానికి సవరించారు. సవరించిన కోడ్ ప్రకారంలో దుస్తులలో జెండా వాడటం నిషేధిస్తుంది. పిల్లో కవర్స్, చేతి రుమాలు లేదా ఇతర వస్త్రాలు పై ఎంబ్రాయిడరీ డిజైన్స్ నిషేధిస్తుంది. దెబ్బతిన్న జెండాలు లేదా పాడయి పోయిన జండాలు నాశనము చేయడానికి ఒక ప్రత్యేక పద్దతి ఉంది. పాడయిన లేదా చిరిగి పోయిన జెండాలను పక్కన పడేయ్యటం లేదా అగౌరవంగా నాశనం చేయకూడదు. అలాంటి వాటిని కాల్చడము /తగులబెట్టడం లేదా భూమిలో పాతిపెట్టడం చేయాలి. లేదా జెండా గౌరవాన్ని కాపాడే మరే ఇతర పద్ధతి ద్వారా మాత్రమే వాటిని నాశనము చేయాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# బహుముఖ ప్రజ్ఞాశాలి బాడిగ నరసింహారావు - ఆగస్టు 15... బాలబంధు బాడిగ వెంకట నరసింహారావు జయంతి



ఒకటిన్నర శతాబ్దాల తెలుగు నాటక రంగ చరిత్రలో ప్రత్యేక స్థానం పొందింది గుడివాడ నాటక రంగం. పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక నాటకాల ప్రదర్శనలకు కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచింది. ఎందరో నటులు, నటీమణులు, సంగీత విద్వాంసులు, నృత్యకారులు, రచయితలు, చిత్రకారులు, జానపద కళాకారులు, నాటక సంస్థలు, డ్రామా డ్రెస్ కంపెనీలు, వివిధ వాయిద్య కారులతో సుసంపన్న మయింది. వెండితెరకు తళుకు లీనిన తారలను , నేపథ్య సంగీతానికీ, గానానికి అజరా మరమైన స్వరాన్ని అలంక రించింది గుడివాడ. బివి స్వగ్రామం కౌతవరం అయినా, గుడివాడ లో స్థిర నివాసం ఏర్పర చుకొని కళాకారునిగా ప్రసిద్ధి కెక్కారు బి.వి.నరసింహారావుగా లబ్ధ ప్రతిష్ఠులయిన బాడిగ వెంకట నరసింహారావు. 1913 ఆగస్టు 15న కృష్ణాజిల్లా కౌతరం గ్రామంలో జన్మించిన బి.వి. వందల సంఖ్యలో బాలగేయాలు రాశారు. కథలూ, నాటికలు, గేయ నాటికలు, బాల సాహిత్యంపై అనేక వ్యాసాలు రాశారు. బాల సాహిత్యం తయారు చేయడమేగాక, ఆడి, పాడి ప్రచారం చేశారు. బాడిగ వెంకట నరసింహా రావు (ఆగస్టు 15, 1913 – జనవరి 6, 1994) బాలబంధు బిరుదాంకితుడు, ప్రముఖ కవి, సాహితీ వేత్త, బాల సాహిత్య కారుడు, నటుడు, నాట్యా చార్యుడు, చిత్రకారుడు, బాల గేయ రచయితగా గుడివాడ పేరును దేశమంతటా చాటిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రంగస్థలం మీద స్త్రీ వేషధారణ చేయటంలో అందెవేసిన చేయి. వెండి తెర వేల్పులు... అక్కినేని నాగేశ్వర్ రావు కు ఆడవేషాలు వేసే కాలంలో అభినయంలో ఆయన శిక్షణ ఇచ్చారు. మహా నటి సావిత్రిని నృత్యంలో తీర్చి దిద్దారు. అభినయం, సంగీతం, చిత్రలేఖనం పుట్టుకతో ప్రాప్తించాయి. తోటి పిల్లలతో కలసి ఆవూ పులి, హరిశ్చంద్ర, ధ్రువ, మొదలయిన చిన్న నాటకాలు వేయడంతో ప్రారంభమయినది బి.వి. రంగస్థల జీవితం. కాకినాడ ఆంధ్ర సేవా సంఘంలో కస్తూరి శివరావు, రేలంగి వెంకట్రామయ్య ఆయనకు సహ ధ్యాయులుగాఉండేవారు. గయోపా ఖ్యానం లోని కృష్ణార్జునుల సంవా దాన్ని పరబ్రహ్మ శాస్త్రి వేయించారు. ఇందులో అర్జునుడుగా బి.వి నటించారు. గజేంద్ర మోక్షం కథా గీతాన్ని ఆనంద భైరవి రాగాన్ని, ఆది తాళంలో నేర్చు కున్నారు. కూచిపూడి భాగవతుల యక్ష గానాలు, దేవదాసి నృత్యం, చూచిందే తడవుగా అభినయించేవారు. కిలాంబికృష్ణమాచార్యులు వద్ద ఆనార్యుల నాట్య శిక్షణ తీసు కున్నారు బివి. తులాభారం లో సత్యభామ, రుక్మాంగదలో మోహిని, చింతామణిలో చింతా మణి, పాత్రాభినయాన్ని క్షుణ్ణంగా అభ్యసించి ప్రదర్శించారు. 1940లో మద్రాసు ఆంధ్ర సంఘం లో బి.వి సరసన సలీం గా బందా కనక లింగేశ్వర రావు నటించారు. స్థానం నరసింహారావు, బళ్ళారి రాఘవ, సిఎస్ఆర్ , నగరాజారావు, కస్తూరి శివరావు, రేలంగి వెంకట్రా మయ్య, మొదలయిన గొప్ప నటులతో కలసి ఎన్నో స్త్రీ పాత్రలలో నటించారు. క్షణం లో చీర సింగారించి కోవటం ఆయనకే సొంతం. సినీ నటి సావిత్రికి నృత్యంలో, అక్కినేనికి ఆడవేషాలు వేసే కాలంలో అభినయంలో శిక్షణ ఇచ్చారు. ఆంధ్ర జాలరి సంప త్కుమార్ వీరి ప్రశిష్యులు. అంతర్జాతీయ ఖ్యాతి పొందిన కోరాడ నరసింహా రావు బి. వి.కి ఏకలవ్య శిష్యులు. కల్వపల్లి, ముక్కాల, ఆయంపూడి పురం, బొమ్మిడి, వేగాయమ్మ పేట, సంస్థానాలలో జానపద నాట్యం చేసారు. బందరు టౌన్ హాల్ లో మునిమాణిక్యం నరసింహారావు బి.వి. నాట్య ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఆనాటి ప్రదర్శనకు చిత్రకారుడు, రచయిత అడవి బాపిరాజు వ్యాఖ్యాత. బి.వి. నాట్యం తిలకించిన కవి సామ్రాట్ విశ్వనాథ ఆయన నాట్యానికి 'భావనాట్యం' అని పేరు పెట్టారు. 1942లో పాలకొల్లులో బి.వి. నాట్యాన్ని తిలకించిన అదిభట్ల నారాయణ దాసు మనసు పుల కించి అమాంతంగా రంగస్థలం మీదికి దుమికి ఆశువుగా పద్యం చెప్పి ఆశీర్వదించారు. 1944లో బందరు నాటక కళా పరిషత్తు లో స్థానం నరసింహారావు, బి.వి నాట్యానికి ముగ్ధులై బంగారు పతక మిచ్చారు. బి.వి. ఏకబిగిన మూడు గంటల ప్రదర్శన ఇచ్చే వారు. దాదాపు 30 ఏళ్లపాటు నాట్య రంగానికి బి.వి. విశేషసేవ చేశారు. జానపదాలకు నాట్యాభి నయం కూర్చారు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, నండూరి వంటి కవుల గీతాలకు నృత్యాన్ని కూర్చారు. బాలరసాలు, బాలల పాటలు, ఆవు – హరి శ్చంద్ర, విరిసిన పూలు, నా కథలు, ప్రియదర్శి, బాలతనం, చిన్నారి లోకం, పూల బాలలు, ఋతువాణి వంటి 17 పుస్తకాలు రచించారు. బి.వి. తనకు చలం రాసిన లేఖలను పుస్తకంగా వెలువరించారు. 1958 నుండి నాట్య ప్రదర్శనలు ఇవ్వటం ఆపేసి బాల రచయితగా మారి పేరు ప్రఖ్యాతులు గాంచారు. సామాన్య కుటుంబం నుండి బహు ముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగిన బివి 1968లో ఉద్యోగ విరమణ చేసి గుడివాడలో స్థిర నివాసం ఏర్పరచు కొని వివిధ రకాల సేవలు అందిస్తూ, శేష జీవితాన్ని గడిపారు. పిల్లల కోసం ఎన్నో రచనలు చేసి 'బాల బంధు' గా సత్కరించ బడ్డారు. ఆయన రచించిన పాల బడి పాటలు'కు 1958లో జాతీయ బహుమతి పొందింది. 1975లో ప్రపంచ తెలుగు మహా సభలలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ 'బాలబంధు' బిరుదాన్ని వారికి ప్రసాదించింది. 'భారత కళా నిధి' గా బిరుదు పొందిన బివి, తమ సన్నిహితులు, ఆప్త మిత్రులు గుడిపాటి వెంకట చలం శత జయంతి సభకు అధ్యక్షత వహిం చేందుకు విజయవాడ పుస్తక మహోత్సవానికి వెళ్లి సభలో ప్రసంగిస్తూ, గుండె పోటుకు గురై,1994 జనవరి 6న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## తెలంగాణ మలి ఉద్యమంలో తొలి ఆత్మత్యాగి శ్రీకాంతచారి - ఆగస్టు 15...శ్రీకాంతచారి జయంతి



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. శ్రీకాంతచారి (ఆగష్టు 15, 1986 – డిసెంబర్ 3, 2009) మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమర వీరుడు. నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు వెంకటచారి, శంకరమ్మ దంపతుల పెద్ద కుమారుడుగా సాధారణ కుటుంబంలో 1986 సంవత్సరంలో స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు15) రోజున జన్మించాడు శ్రీకాంతచారి. తండ్రి వెంకటచారి వ్యవసాయంతో పాటు వృత్తి పనులు చేస్తుంటాడు. రవీంద్రాచారి అనే తమ్ముడు ఉన్నాడు. శ్రీకాంతచారి ఆడుతూ పాడుతూ చలాకీగా ఉండేవాడు. సమాజసేవలో ముందుండేవాడు. ఎవరు సాయం కోరినా కాదనేవాడు కాదు. తాను దాచుకున్న డబ్బును పేదలు, స్నేహితుల కోసం ఖర్చు చేసేవాడు. స్థానికంగానే ప్రాథమిక విద్యను పూర్తిచేసిన శ్రీకాంత్ మోత్కూరు, నకిరేకల్ గ్రామాల్లో అభ్యసించాడు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లిన శ్రీకాంత చారి తొలుత బీజేపీ లో ఆ తరువాత టీఆర్ఎస్ లో క్రియాశీలక కార్యకర్తగా, విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్రను పోషించాడు. తెలంగాణ ఉద్యమ కార్యక్రమాలను ముందుండి నడిపేవాడు. సెలవుల్లో ఇంటికి వెళ్లినా.. తెలంగాణ ధ్యాసే. తెలంగాణ ఉద్యమ సంబంధిత పాటలు పాడుతూ తెలంగాణ నినాదాలు చేస్తూ కవితలు రాస్తూ ఉండేవాడు. తెలంగాణ అతడి ఊతపదమైంది. ఈ క్రమంలో తెలంగాణ కోసం టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన అమరణదీక్ష శ్రీకాంత్‌లో ఉద్యమావేశాన్ని నింపింది. తెలంగాణ ఉద్యమ కారులపై ప్రభుత్వం దమనకాండ, అరెస్టులను చూసి శ్రీకాంత్ తట్టు కోలేక పోయాడు. ఆ ఉద్వేగంతో, కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో తన ఆత్మ త్యాగం తర్వాతైనా మొండి ప్రభుత్వంలో చలనం తీసుకు రావాలని కోరుతూ ఆత్మాహుతికి యత్నించాడు. 2009 నవంబరు 29న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా జరిగిన ధర్నాలో ఒంటిమీద పెట్రోల్ పోసుకుని నిప్పంటించు కున్నాడు. ఉద్యమ జ్వాలను రగిల్చి అగ్నికి ఆహుతి అవుతూ జై తెలంగాణ అంటూ నినదించాడు. నీవైనా న్యాయం చేయమంటూ అంబేద్కర్ విగ్రహాన్ని వేడుకున్నాడు. కాలిన గాయాలతో కామినేని, యశోద, ఉస్మానియాతో పాటు చివరకు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 3, 2009 న రాత్రి 10.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచాడు. ఐదు రోజుల పాటు మత్యువుతో పోరాడుతూ కూడా తెలంగాణ స్మరణ చేశాడు. బతికితే తెలంగాణ కోసం మళ్లీ చావడానికైనా సిద్ధమన్నాడు. ఎగిసే మంటల్లో బూడిదవుతుంటే టీవీల్లో చూసిన నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల గుండెలు రగిలాయి. ప్రతి ఒక్కరూ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యేలా శ్రీకాంతచారి ఉద్యమజ్వాల రగిలించాడు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి అమరుడైన శ్రీకాంతచారి తెలంగాణ ప్రజలందరి గుండెల్లో త్యాగానికి ప్రతి రూపంగా శాశ్వతంగా నిలిచిపోయాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## ఆధునిక తెలుగు సాహిత్యానికి నూతన దిశ దిశా నిర్దేశం చేసిన ద్వివేదుల విశాలాక్షి

## ఆగస్టు 15... ద్వివేదుల విశాలాక్షి జయంతి



తెలుగు సాహిత్యంలో ఒక ప్రతిభా వంతురాలుగా గుర్తింపు పొందిన ద్వివేదుల విశాలాక్షి రచనలు తెలుగు సాహిత్యాన్ని కొత్త దిశలో నడిపించాయి. సామాజిక అంశాలు, స్త్రీ పాత్రల స్థానం, మరియు మనస్తత్వ పరిశీలనలపై ఆధారపడిన ఈ రచనలు సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ పాఠకులను ఆలోచింప జేస్తాయి. విశాలాక్షి రచనలు కేవలం వ్యక్తుల జీవితాలను మాత్రమే కాకుండా, సమాజంలోని వివిధ సమస్యలను కూడా ప్రతిబింబిస్తాయి. ఆమె రచనలు సమాజంలోని అసమానతలు, కుల వ్యవస్థ, స్త్రీల అణచివేత వంటి అంశాలపై ప్రశ్నించేలా చేస్తాయి. ద్వివేదుల విశాలాక్షి 1929 ఆగస్టు 15న ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయ నగరంలో జన్మించారు. ఆమె విద్యాభ్యాసం విజయ నగరం లోనే జరిగింది. కథలు, నవలలు, వ్యాసాలు, రేడియో నాటికలు, సామాజిక అంశాలపై సాహిత్య రచనలు చేశారు. విశాలాక్షి గారి భాషా శైలి చాలా సరళమైనది, అయినప్పటికీ అది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఆమె భావాలను చాలా సున్నితంగా, సహజంగా వ్యక్తపరుస్తారు. విశాలాక్షి గారి రచనలు సమాజంలోని వివిధ అంశాలను ప్రతిబింబించడమే కాకుండా, సమాజ సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తాయి. ఆధునిక తెలుగు సాహిత్యానికి ఒక కొత్త దిశను చూపించడంలో ఆమె రచనలు ముఖ్య పాత్ర పోషించాయి. ఆమె తన రచనల్లో కథా నాయికలను సాహసవంతురాళ్ళుగా, స్వతంత్ర భావన కలిగిన వారిగా, తమ వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు పోరాడే వారిగా సృష్టించారు. ద్వివేదుల విశాలాక్షి సాహిత్య ప్రస్థానం తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టించారు. ఆమె రచనల్లో 13 నవలలు, 3 కథా సంపుటాలు ఉన్నాయి. ఆమె కథా నాయికలు సాధారణంగా స్వతంత్రంగా ఆలోచించే, సమాజ పరిస్థితులను ఎదుర్కొనే స్త్రీలుగా ఉంటారు. ఆమె రచనల్లో కుటుంబ బంధాలు, స్త్రీ–పురుష సంబంధాలు, సామాజిక అసమానతలు వంటి అంశాలు ప్రధానంగా ప్రతిబింబిస్తాయి. సమాజంలోని వివిధ అంశాలను ఈ రచనల్లో ప్రతిబింబిస్తూ, ఆమె సమకాలీన సమస్యలను పాఠకుల ముందుకు తెచ్చారు. ఆమె రచనలు అనేక ఇతర భాషల్లోకి అనువదించ బడ్డాయి, తెలుగు సాహిత్యాన్ని మరింత విస్తరింప జేశాయి. విశాలాక్షి గారి రచనలు అనేకమంది యువ రచయితలను ప్రభావితం చేశాయి. ఆమె తరువాత వచ్చిన రచయితలు ఆమె వేసిన బాటలోనే ప్రయాణిస్తూ తెలుగు సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేశారు. ఆమె రచనలు అనేక ఇతర భాషల్లోకి అనువదించ బడడం తెలుగు సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. ఆమె ఆంధ్రప్రభ దీపావళి నవలల పోటీలో "వైకుంఠపాళి" నవలతో మొదటి బహుమతి పొందారు. గృహలక్ష్మీ, స్వర్ణ కంకణం, అడవి బాపిరాజు అవార్డు, తెలుగు విశ్వ విద్యాలయం నుంచి డి.లిట్ పట్టా, రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ జ్యేష్ఠ సాహితీ అవార్డు వంటి అనేక పురస్కారాలు ఆమె సాహిత్య కృషికి గుర్తింపుగా లభించాయి. 2014 నవంబరు 7న విశాఖపట్నంలో ఆమె మరణించారు. తెలుగు సాహిత్య చరిత్రలో ద్వివేదుల రచనలు, ఆలోచనలు, సాహిత్య కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తాయి. ఆమె మరణించినప్పటికీ, ఆమె రచనలు ఆమెను పాఠకుల హృదయాలలో ఎల్లప్పుడూ జీవించి ఉంచుతున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**


## నాటక రంగానికి జీవితం అంకితం చేసిన శేఖర్ బాబు - ఆగస్టు 15...పందిళ్ళ శేఖర్‌బాబు జయంతి



పందిళ్ళ శేఖర్‌బాబు (ఆగష్టు 15, 1961 – ఏప్రిల్ 24, 2015) రంగస్థల (పౌరాణిక) నటుడు, దర్శకుడు, నిర్వాహకుడు. ఆయన 1961, ఆగష్టు 15 వ తేదీన వరంగల్ జిల్లా, ధర్మసాగర్లో రాజయ్యశాస్త్రి, సుచేత దంపతులకు జన్మించారు. బాల్యమంతా ధర్మసాగరంలోనే గడించింది. హనుమకొండలో ఇంటర్మీడియట్ చదివారు. అనంతరం దేవాదాయ ధర్మదాయ శాఖలో ఉద్యోగిగా చేరడం, కార్యనిర్వహణధికారిగా ఉన్నతస్థానం సాధించడం అన్ని వరంగల్ లోనే జరిగాయి. అంతటితో ఆగకుండా కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ చదివి, ఆ తరువాత ఎల్.ఎల్.బి. చేశారు. పందిళ్ళ శేఖర్‌బాబు తన 12వ ఏట 1973లో ఆత్మహత్య సాంఘిక నాటికలో సన్యాసి రాజు పాత్రతో రంగ ప్రవేశం చేసారు. తొలి ప్రయత్నంలోనే బహుమతుల (ద్వితీయ ఉత్తమ నాటిక, ఉత్తమ నటుడు) ను అందుకున్నారు. నాటక ప్రవేశం సాంఘిక నాటిక ద్వారా జరిగినా ఈయనకు పేరు తెచ్చినవి మాత్రం పౌరాణికాలు. 1997వ సంవత్సరం మార్చి 1న ఈయన పౌరాణిక నాటక రంగంలోకి అడుగు పెట్టారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో, శ్రీకృష్ణ పాత్రలో ప్రేక్షకులను అలరించారు. రవీంద్రభారతి, తెలుగు విశ్వ విద్యాలయం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైద్రాబాద్), మహతి (తిరుపతి), హనుమంతరాయ గ్రంథాలయం, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల కళావేదిక (విజయవాడ), శ్రీ వేంకటేశ్వర విజ్ఞానకేంద్రం (గుంటూరు) మొదలైన ప్రముఖ వేదికలపై, ఇతర ప్రాంతాల్లో దాదాపు 500 నాటక ప్రదర్శనల్లో నటించారు. శ్రీకృష్ణ రాయబారంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, దుర్యోధనుడిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడిగా, నారదుడిగా, శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడిగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడిగా,గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, అక్రూరుడిగా, నారదుడిగా,లవకుశలో రాముడిగా,యయాతిలో యయాతిగా,చింతామణిలో బిల్వ మంగళుడిగా, భవానీ శంకరుడిగా, బభ్రువాహనలో అర్జునుడిగా, అన్నమయ్యగా నటించారు. 1998లో తెలుగు పద్యాన్ని బ్రతికించండి– పద్యనాటక మనుగడకు సహకరించండి అనే నినాదంతో 'తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్'ను స్థాపించారు. ఈ సంస్థ, ఒకవైపు ప్రసిద్ధమైన నాటకాలను ప్రదర్శిస్తూ, మరోకవైపు ఎంతో సమర్థవంతంగా నాటక పోటీలను నిర్వహిస్తూ వచ్చింది. రాష్ట్రంలోని ఎన్నో పట్టణాలలో ఎన్నో ప్రదర్శనల్ని దిగ్విజయంగా ప్రదర్శించి, ప్రేక్షకుల్ని పరవశింప జేసింది తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్. 2007లో 'శ్రీకృష్ణరాయబారం' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ పద్యపఠనం విభాగాలలో రెండు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2011లో 'యయాతి' నాటకానికి ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ పాత్రోచిత నటుడు విభాగాలలో మూడు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2012లో యయాతి' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం విభాగాలలో రెండు గరుడ అవార్డులు, 'బభ్రువాహన' పద్య నాటికకు తృతీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ పాత్రోచితనటి విభాగాలలో మూడు గరుడ అవార్డులు లభించడంలో ఆయన కృషి ఎంతో ఉంది. నటులకు ప్రోత్సాహాన్నిచ్చి, వివిధ పరిషత్తులతోపాటు, ప్రముఖ వేదికలపై నాటకాల నిర్వాహణ, దర్శకత్వ బాధ్యతల నిర్వాహణ గావించారు. 2008 నుండి 'వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక' అధ్యక్షునిగా, ప్రతి యేటా క్రమంతప్పకుండా నాటిక పోటీలను నిర్వహించారు. 'రంగస్థల కళాకారుల క్రెడిట్ సొసైటీ'ని నిర్వహిస్తూ, తద్వారా వచ్చే లాభాలు, వడ్డీల నుండి 50 శాతం 'ఐక్యవేదిక'కు కేటాయించి, సంస్థకు ఆర్థికంగా పరిపుష్టం గావించారు. న్యాయ నిర్ణేతగా ఆయన నిర్ణయం నిష్పాక్షికమైనది. రాగద్వేషాలకు తావీయకుండా, ప్రతిభకు పట్టంకట్టడంలో ఆయనది అందెవేసిన చేయి. అందుకే రాష్ట్రంలోని ఎన్నో పరిషత్తులు నాటక పోటీలకు గుణనిర్ణేతగా ఆయయను ఆహ్వానించి గౌరవిస్తున్నాయి. 2008లో రాజమండ్రి లో జరిగిన నంది నాటకోత్సవాలకు పౌరాణిక నాటక విభాగంలో ప్రాథమిక న్యాయ నిర్ణేతగా 2009, 2011 సంవత్సరంలో అభినయ పరిషత్ వారు నిర్వహించే హనుమ అవార్డుల పోటీల పౌరాణిక నాటక విభాగంలో న్యాయ నిర్ణేతగా, 2012లో రవీంద్రభారతిలో జరిగిన పి.ఎం.కె.ఎం. సాంఘీక నాటకపోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. శేఖర్ బాబు నిర్విరామ కృషికి, దీక్షాదక్షతలను గుర్తించిన అనేక సంస్థలు ఆయనకు నటశేఖర, పౌరాణిక నట సార్వభౌమ, పౌరాణిక విద్వన్మణి, మెగా సిటిజన్, శ్రీపాద నాటక కళాపరిషత్ వారి పురస్కారం, పద్యనాటక కళాధురీణ వంటి బిరుదులనిచ్చి సత్కారం చేశాయి. 2000 సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీ నుండి 11వ తేదీవరకు 7రోజుల పాటు వరుసగా ఒకే వేదికపై శ్రీకృష్ణ రాయబారం, లవకుశ, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి, గయో పాఖ్యానం, శ్రీరామాంజనేయ యుద్ధం నాటకాలను 'పద్య నాటక సప్తాహం' పేరిట, ఏడు రోజులు వరుసగా ప్రదర్శించి, ప్రధాన పాత్రలను ధరించారు. 2011లో మరలా 'పద్యనాటక సప్తకం ' నిర్వహించి స్వీయ దర్శకత్వంలో 7 నాటకాలను, వారానికొకటి చొప్పున ప్రదర్శించి, ప్రధాన పాత్రలు ధరించి, నిర్వాహణ వ్యయం 3 లక్షలు భరించారు. 2012లో తొలి తెలుగు సినీ రచయిత, 'పరబ్రహ్మ పరమేశ్వర' ప్రార్థనా గీత రచయిత చందాల కేశవదాసు 136వ జయంతి ఉత్సవం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం (హైద్రాబాద్) లో నిర్వహించారు. 2010లో అజో–విభో ఫౌండేషన్ వారు వరంగల్ లో నిర్వహించిన, 'సాహితీమూర్తి పురస్కారం' డా. నల్లాన్ చక్రవర్తుల రఘునాథ చార్యులకు ప్రదానం చేసిన కార్యక్రమాన్ని కలిసి నిర్వహించారు. అనారోగ్య కారణాల వల్ల హైదరాబాద్ లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 24, 2015 న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# నేటి తరానికి ఆదర్శం... కొండా వెంకటప్పయ్య వ్యక్తిత్వం


## ఆగస్టు 15... కొండా వెంకటప్పయ్య వర్ధంతి




ఆయన విలువలతో కూడిన నిబద్ధ త కలిగిన రాజకీయ నాయకుడు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ముకొన్న దయా హృదయుడు. స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ఆద్యుడు, దేశభక్త బిరుదాంకి తుడు. ఆయనే నిస్వార్థానికి నిలు వెత్తు రూపం కొండా వెంకటప్పయ్య. దృఢ సంకల్పం, నిర్మలమైన ప్రవర్తన, అసమాన ధైర్యం, నిశ్చల మైన దీక్షా దక్షత, అరమరకలేని అమాయకత్వం, నిరాడంబర వ్యక్తిత్వం కలగలిపినదే కొండా వెంకటప్పయ్య జీవితం. శ్రోత్రియ కుటుంబంలో జన్మించినా, సనాతన సాంప్రదాయాల పరిధిని అతిక్రమిం చిన భిన్న మనస్తత్వం ఆయనది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకత్వం నెరపిన నాయక త్వం ఆయనది. కృష్ణా పత్రికను స్థాపించి తెల్లదొరలపై అక్షర అస్త్ర శస్త్రాలను సంధించిన అక్షర యో ధుడు. గాంధీకే దేశ రాజకీయాల లోకి రాక ముందే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా న్యాయవాద వృత్తిని విడనాడి న త్యాగధనుడు. స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు నెలలలో, 1947 డిసెంబరులో కొండా వెంకటప్ప య్య ...స్వాతంత్ర్యం తరువాత పెచ్చుపెరిగిన అవినీతి గురించి మహాత్మా గాంధీకి వ్రాసిన లేఖను బట్టి ఆయన తపన అర్థం అవుతుంది. "మనం మన స్ఫూర్తిగా కోరుకొన్న స్వరాజ్యం అనే ఒకే ఒక లక్ష్యం ప్రజలను మీ వెంట నడిపించింది. ఇప్పుడు ఆ గమ్యం చేరుకోగానే ఈ స్వాతంత్ర్య యోధులలో నీతి నియమాలు అంతరించి పోయాయి. రోజురోజుకూ పరిస్థితి దిగజారి పోతోంది. ప్రజలు కాంగ్రెసును దూషిస్తున్నారు. బ్రిటిషు రాజ్యమే మేలంటున్నారు. ఇప్పుడు స్వతంత్ర దేశంలో కాంగ్రెసు అవినీతికి ఆలవాలమై పోతున్నది. వారిని అదుపు చేయాల్సిన పోలీసు వ్యవస్థ కాంగ్రెసువారి కట్టడి లో ఉండి పోయింది. పైసా ఆదాయం లేని వారు ఇప్పుడు మహా రాజుల లాగా పెద్దపెద్ద కార్లలో తిరుగుతున్నారు. కాంగ్రెసు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తరచూ జోక్యం చేసుకోవడం వలన జిల్లా కలెక్టరులూ, రెవిన్యూ అధికారులూ తమ విధులను సక్రమంగా నిర్వర్తిం చ లేక పోతున్నారు. ఈ పైరవీ కారుల ప్రభావం దుష్ప్రచారం, భయంతో నిజాయితీగల వారు తమ పదవులలో ఉండే పరిస్థితి లేదు." విదేశీ పాలకుల దాస్య శృంఖలాల నుండి విముక్తి కలిగి, స్వతంత్ర భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న అనంతరం కేవలం , నాలుగు మాసాలకే 1947 డిసెం బర్‌లో కాంగ్రెస్ నేతల స్వార్థ చింతన గురించి గాంధీజీకి రాసిన లేఖలోని వ్యథా భరిత హృదయంలో నుండి వచ్చిన బాధతో నిండిన వాక్యాలివి. దీన్ని బట్టి ఆయన నీతి నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థ భావన గురించి స్పష్టం అవుతుంది. కొండా వెంకటప్పయ్య (ఫిబ్రవరి 22, 1866 – ఆగష్టు 15, 1949) 1866, ఫిబ్రవరి 22 న పాత గుంటూరులో జన్మించాడు. ప్రాథమిక విద్య గుంటూరు మిషన్ స్కూలులో, ఉన్నత విద్య మద్రాసు క్రైస్తవ కళాశాలలో పూర్తిచేసి తరువాత బి.ఎల్. పట్టా పొంది, బందరులో న్యాయ వాద వృత్తిని చేపట్టాడు. ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలో, జాతిని చైతన్య వంతం చేయడానికి వెంకటప్పయ్య 1902లో వాసు నారాయణరావుతో కలసి కృష్ణా పత్రిక ప్రచురణను ప్రారంభించాడు. 1905 వరకు ఆయనే ఆ పత్రికను నడిపి, గుంటూరులో స్థిరపడగానే దాని సంపాదకత్వ బాధ్యతలను ముట్నూరు కృష్ణారావుకు అప్పగించాడు. న్యాయవాద వృత్తిలో వెంక టప్పయ్య ధనార్జన గురించి ఆయన పట్టించుకోనే లేదు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ముకొన్నాడు. 1912 మే నెలలో కృష్ణా గుంటూరు జిల్లా రాజకీయ మహాసభ నిడద వోలులో జరిగింది. ఆ సభలోనే కొండా వెంకటప్పయ్య సలహాపై ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలగు యువకులు 11 తెలుగు జిల్లాలతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే విషయంలో మంతనా లు జరిపారు. 1913లో అదే స్థాయి లో మహాసభ బాపట్లలో జరిగింది. కొండా వెంకటప్పయ్య సలహా మేరకు మొదటి ఆంధ్ర మహాసభ (ఆంధ్ర) బి.ఎస్.శర్మ అధ్యక్షతన జరిగింది. దేశవ్యాప్త ప్రచారం కోసం ఏర్పడిన బృందంలో కొండా వెంకట ప్పయ్యదే ప్రధాన పాత్ర. నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు ఆయనే అధ్యక్షుడిగా ఉండి ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి నిర్దిష్ట కార్యక్రమం రూపొందించాడు. 1917లో రాజ్యాంగ సంస్కరణల విషయమై పరిశీలనలు జరపడానికి మాంటేగ్ – చమ్స్?ఫర్డ్ ప్రతినిధి వర్గాన్ని ప్రభుత్వం నియమించింది. సదరు ప్రతినిధి వర్గం మద్రాసుకు వచ్చిన. సందర్భంలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన అవసరాన్ని. నొక్కి చెప్పిన ఆంధ్ర ప్రతినిధులలో కొండా వెంకటప్పయ్య ముఖ్యుడు. 1918లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ ఏర్పడింది. రాష్ట్ర సాధనలో ఇది తొలివిజయం కాగా, రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి తొలి కార్య దర్శి వెంకటప్పయ్యే. ఆ రోజుల్లో కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లా లు కలసిన నియోజక వర్గం నుంచి పోటీ చేసి కొండా వెంకటప్పయ్య మద్రాసు కౌన్సిలుకు ఎన్నిక య్యాడు. సహాయ నిరాకరణో ద్యమం కొనసాగించడానికి వీలుగా కాంగ్రెసు పార్టీ తన సభ్యుల రాజీనామా కోరగానే కొండా శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. తర్వాత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడై భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడయ్యాడు. 1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు బెజవాడలో జరిగగా, మహాత్ముని ఆంధ్ర పర్యటన వెంకటప్పయ్య ఆధ్వర్యంలోనే జరిగింది. వేలాది రూపాయల విరాళాలుగా స్వీకరించి స్వరాజ్య నిధికి సమర్పించాడు. పెదనంది పాడు పన్నుల నిరాకరణోద్యంలో పాల్గొన్నందుకు ఆయన మొదటి సారి జైలు శిక్ష అనుభవించాడు. 1923లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన దేశబంధు చిత్తరంజన్ దాస్ రాజీనామా వల్ల వెంకటప్పయ్యను అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి అయ్యా డు. గాంధీజీ తలపెట్టిన ప్రతి ఉద్యమానికి ఆంధ్రలో కొండా వెంక టప్పయ్యే ఆ రోజుల్లో నాయకత్వం వహించేవాడు. ఆంధ్ర ఖద్దరుకు యావద్దేశ ప్రచారం లభించడానికి కొండా వెంకటప్పయ్య కృషి ప్రధాన మైనది. 1933లో మహాత్ముడు ఆంధ్రలో హరిజన యాత్ర చేపట్టి, అనేక గ్రామాలలో హరిజనుల దేవాలయ ప్రవేశం చేయించాడు. భార్య మృత్యు ఒడిలో ఉన్నప్పటికీ కొండా వెంకటప్పయ్య హరిజన సేవలో నిమగ్నుడై తిరుగుతున్నాడని మహాత్మాగాంధీచేత కొనియాడ బడినాడు. 1929లో సైమన్ కమిషన్ రాక సందర్భంలో, 1930లో ఉప్పు సత్యాగ్రహంలో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు కొండా వెంకటప్పయ్య జైలు శిక్షలు అనుభవిం చాడు. 1937లో జరిగిన ఎన్నికల్లో అతను మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యాడు. భాషా ప్రాతిపదికన మద్రాసు రాష్ట్రాన్ని ఆంధ్ర, తమిళ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలుగా విభజించాలని కొండా వెంకటప్పయ్య శాసన సభలో ప్రవేశ పెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా నెగ్గింది. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో 1920 నుండి 1949లో మరణించే వరకు ఆంధ్ర దేశమే తానుగా వ్యవహరించి ఆంధ్రుల అభిమానానికి పాత్రుడైన గొప్ప వ్యక్తి వెంకటప్పయ్య. ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సభకు కూడా అధ్యక్షుడిగా పని చేశాడు. అఖిల భారత చరఖా సంఘానికి జీవిత కాలం సభ్యుడిగా ఉన్నాడు. గ్రంథాలయోద్యమానికి తోడ్పడ్డాడు. దేశ, రాష్ట్ర రాజకీయాలలో, కాంగ్రెస్ పార్టీ లో తమకంటూ ప్రత్యేక స్థానం ఉన్న కొండా, స్వార్థ రాజకీయ నాయకుల మూలంగా తన ప్రతిభకు, త్యాగానికి సముచిత స్థానం పొందలేక పోయాడు. కొండా వెంకటప్పయ్య 1949 ఆగష్టు 15 న దేశ స్వాతంత్ర్య దినాన లోకాన్ని ఈ వదిలి వెళ్లాడు. ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శం కావాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## మహాత్ముని ఆంతరంగికుడు మహదేవ్ దేశాయ్ - ఆగస్టు 15...మహదేవ్ దేశాయ్ వర్ధంతి



జాతిపిత మహాత్మాగాంధీ సేవ కోసం సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి మహదేవ్ దేశాయ్. నిజానికి గాంధీకి ఆంతరంగికుడు. ఆయన లేకుండా మహాత్ముని జీవితం గురించి సంపూర్ణంగా తెలిసేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన మహాత్మా గాంధీ వ్యక్తిగత కార్యదర్శి. గాంధీకి సంబంధించిన ప్రతి విషయం స్వయంగా దేశాయే చూసేవారు. మహదేవ్ దేశాయ్ (1 జనవరి 1892%–% 15 ఆగష్టు 1942) 1892 జనవరి 1 న గుజరాత్ లోని సూరత్ జిల్లాలో సారస్ అనే గ్రామం లో ఉపాధ్యాయుడైన హరిభాయి, జన్మాబెన్ దంపతులకు జన్మించా రు.13 సంవత్సరాల వయసులో మహాదేవ్ దుర్గాబెన్ ను వివాహ మాడారు. ఆయన సూరత్ ఉన్నత పాఠశాల, ముంబయిలోని ఎల్ఫిన్ స్టోన్ కాలేజిలో చదివారు. ఆయన బి.ఎ పట్టభద్రుడు. మహదేవ్ దేశాయ్ మొదటిసారి 1915 లో గాంధీని కలిసారు. దేశాయ్ 1917లో సబర్మతీ ఆశ్రమంలో ఆయన భార్య దుర్గాబెన్‌తో పాటు చేరారు. ఆ సంవత్సరం చంపారన్ ఉద్యమం జరిగింది. ఆయన డిసెంబర్ 13,1917 నుండి ఆగష్టు 14,1942 వరకు ఆయన మరణించే తేదీ ముందురోజు వరకు ఒక డైరీని నిర్వహించారు. దానిలో ఆయనకు మహాత్మాగాంధీ సాన్ని హిత్యం గురించి వ్రాసారు. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 1919లో అరెస్టు చేసినపుడు గాంధీజీ తన వారసునిగా దేశాయ్ ని ప్రకటిం చారు. దేశాయ్ మొదటిసారి 1921 లో అరెస్టు కాబడి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించారు. ఆయన 25 సంవత్సరాలపాటు గాంధీజీకి వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్నారు. గాంధీజీ కంటే ముందే వేకువ జామున లేచేవారు. గాంధీతో నిరంతరం గడపేవారు. ఆరోజు జరిగిన విషయలను డైరీలో నమోదు చేసేవారు. అన్నీ తానే అయి చూసేవారు. 1920 లో మోతీలాల్ నెహ్రూ తన వార్తా పత్రిక ప్రింటింగ్ ప్రెస్‌ను బ్రిటీష్ ప్రభుత్వం జప్తు చేసిన తరువాత చేతితో వ్రాసిన సైక్లోస్టైల్ వార్తా పత్రికను బయటకు తీసుకు రావడం ద్వారా దేశాయ్ సంచలనాన్ని సృష్టించారు దేశాయ్. 1921 లో దేశాయ్‌ను తన రచనలకు ఒక సంవత్సరం కఠిన మైన జైలు శిక్ష విధించారు. దేశాయ్ 1924 లో నవజీవన్ సంపాద కుడిగా బాధ్యతలు స్వీకరించారు. 1925 నుండి గాంధీ ఆత్మకథ, యంగ్ ఇండియాలో దాని సీరియల్ ప్రచురణ కోసం ఆంగ్లం లోకి అను వాదం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం ఆయన సత్యాగ్రహ ఆశ్రమ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ అయ్యారు. సర్దార్ పటేల్‌తో కలిసి బార్డోలి సత్యా గ్రహంలో పాల్గొన్నారు. గుజరాతీ లో సత్యాగ్రహ చరిత్రను వ్రాసారు. దీనిని ఆంగ్లంలోకి ది స్టోరీ ఆఫ్ బార్డోలిగా అనువదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. గాంధీతో పాటు మిరాబెన్, దేవదాస్ గాంధీ, ప్యారేలాల్ లతో కలిసి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. కింగ్ జార్జ్ %ఎ% ను కలిసేందుకు గాంధీతో పాటు వెళ్ళిన ఏకైక వ్యక్తి ఆయన. 1932 లో దేశాయ్‌ను మళ్లీ అరెస్టు చేసి గాంధీ, సర్దార్ పటేల్‌తో కలిసి జైలుకు పంపారు. 1933 లో జైలులో ఉన్న ఈ సమయంలోనే ఆయన "గీత ప్రకారం గాంధీ" పుస్తకాన్ని రాశారు. దేశాయ్ 1939 లో రాక్‌కోట్, మైసూర్ రాచరిక రాష్ట్రాలలో ప్రజల ఉద్యమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. దేశాయ్ చివరి జైలు శిక్ష 1942 ఆగస్టు 8 నాటి క్విట్ ఇండియా ప్రకటన తరువాత జరిగింది. ఆయన 1942 ఆగస్టు 9 ఉదయం అరెస్టు చేయబడ్డారు. ఆరు రోజుల తరువాత ఆగష్టు 15 1942న గుండె పోటుతో మరణించే వరకు గాంధీతో పాటు అగాఖాన్ ప్యాలెస్‌లో ఉన్నారు. గాంధీజీ స్వయంగా దేశాయ్ భౌతిక కాయానికి స్నానం చేయించారు. ఆగాఖాన్ పాలెస్ మైదానంలో ఆయనను దహనం చేసారు. ఆ ప్రదేశంలో ప్రస్తుతం ఆయన సమాధి ఉంది. భారత త పాలా శాఖ దేశాయ్ గౌరవార్థం 1983లో తపాలా బిళ్ళపై ఆయన బొమ్మను ముద్రించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# నిర్వాసిత గ్రామం.. అడ్డంకులు దూరం

పెద్దపల్లి : సహజ వనరుల తరలింపులో ఉక్కిరిబిక్కిరవుతున్న నిర్వాసిత గ్రామాలకు ఇక మంచి రోజులు రానున్నాయి. కొన్నేళ్లుగా ఖనిజాభివృద్ధి నిధులు(డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ఫండ్) ఇతర జిల్లాల్లో ఖర్చు చేయడంతో నిర్వాసితులు సమస్యలతో సతమతమయ్యారు. ఇక సొంత జిల్లాలోనే ఆ నిధులు ఖర్చు చేసుకోవాలని ఆదేశాలు రావడం ఊరటనిస్తోంది. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి మంత్రి ఛైర్మన్‌గా వ్యవహరించగా ప్రస్తుతం కలెక్టర్ పర్యవేక్షణలో మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చించనున్నారు. దీనికి సంబంధించి అయిదేళ్ల అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**సమస్యలు అనేకం**

పరిశ్రమల నిర్వహణతో ప్రభావిత గ్రామాల్లో కనీస వసతులు కరవయ్యాయి.గుంతలు, దుమ్ము, ధూళితో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. తాగునీటి పథకాలు చెడిపోతున్నాయి. చాలామంది శ్వాసకోశ, చర్మ, గుండె సంబంధిత వ్యాధులతో అనారోగ్యాలకు గురవుతున్నారు.

**ఏటా రూ.50 కోట్లు**

జిల్లాలో రామగుండం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో బొగ్గు ఉ



త్పత్తి అవుతోంది. పాలకుర్తిలో సున్నపురాయి, ధర్మారం, సుల్తానాబాద్, రామగిరి, పాలకుర్తి మండలాల్లో బిల్డింగ్ స్టోన్, రోడ్డు మెటల్, సుల్తానాబాద్, ధర్మారంలో కలర్ గ్రానైట్ క్వారీలు నిర్వహిస్తున్నారు. సింగరేణి, కేశోరామ్, ఇతర పరిశ్రమల నిర్వహణతో ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ యోజనలో సీనరేజ్ నిధుల్లో 30 శాతంతో ఏటా రూ.50 కోట్లు డీఎంఎఫ్‌టీ వాటా జమ అవుతున్నాయి. వీటిని నిర్వాసిత గ్రామాలకు 70 శాతం, జిల్లాలో ఇతర ప్రాంతాలకు 30 శాతం కేటాయించాల్సి ఉంది. గతంలో జిల్లాకు నేరుగా ఉండగా కొన్నేళ్లుగా ప్రభుత్వానికి జమ చేయడంతో నిధులను ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. ఇటీవల కేంద్రం సొంత జిల్లాకే ఖర్చు చేయాలని ఆదేశాలివ్వడం తోపాటు కలెక్టర్లకు కీలక బాధ్యతలు ఇచ్చారు.

**అయిదేళ్ల ప్రణాళికలు**


జిల్లాలో 2019 నుంచి డీఎంఎఫ్‌టీ నిధులు సుమారు రూ.600 కోట్లు విడుదల కావాలి. నిధుల మంజూరులో జాప్యంతో పనులు అసంపూర్తిగా వదిలేశారు. జిల్లాకే ఆ నిధులు కేటాయించడంతో పాత పెండింగ్ పనులకు మోక్షం కలగనుంది. కొత్తగా వచ్చే అయిదేళ్లలో అవసరమైన విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రతిపాదిస్తున్నారు.

# వంట.. తంటా

మల్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారుకు వంట గదులులేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదుల్లో, మరికొన్ని చోట్ల ఆరు బయట చెట్లకింద కట్టెల పొయ్యిపైనే వండుతున్నారు. దీంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోంది. మధ్యాహ్న భోజనం తయారు చేసి వడ్డించే కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు, బిల్లులు మంజూరు కాకపోవడం కూడా ఇబ్బందిగా మారింది. వంట మనిషికి, సహాయకునికి నెలనెలా రూ.1000 చొప్పున చెల్లిస్తున్నారు. జూన్, జులై నెలలకు సంబంధించిన వేతనాలు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. వంట సామగ్రి బిల్లులు చెల్లింపులు కూడా సక్రమంగా జరగక కార్మికులపై ఆర్థికభారం పడుతోంది.

**ఆరు పాఠశాలలకు వంట గదుల మంజూరు**

మల్యాల మండలం పోతారం, మల్యాల ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులను ఉపయోగించటం వల్ల గోడలు పొగతో నల్లబారాయి. మల్యాల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మూడేళ్ల క్రితం వంట గది నిర్మించినా చిన్నగా ఉందన్న కారణంతో వినియోగించడం లేదు. తరగతి గదిలో వంట చేస్తున్నారు. నూకపల్లి ఆదర్శ పాఠశాల ఆవరణలోని చెట్టు కింద వంట చేయటంతో వర్షం పడితే ఇబ్బందిగా



ఉందని కార్మికులు వాపోతున్నారు. ఓబులాపూర్, పోతారం, తాటిపల్లి, మల్యాల వడ్డెర కాలనీ, మల్యాల బాలుర ప్రాథమిక పాఠశాలలకు, నూకపల్లి ఆదర్శ పాఠశాలకు వంట గదులు మంజూరైనట్లు ఎంఈవో జయసింహారావు తెలిపారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో పెద్ద వంట గది నిర్మించటానికి రూ.10లక్షలు, మిగిలిన పాఠశాలలకు రూ.5 లక్షల చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు.

**బిల్లుల చెల్లింపులో జాప్యం**

కార్మికులు ప్రతి నెలా కొనుగోలు చేసే పప్పులు, కూరగాయలు, నూనె, ఉప్పు, కారం తదితర సామగ్రికి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే కార్మికులకు జూన్ వరకు బిల్లులు అందాయి. 9, 10 తరగతి విద్యార్థులకు సంబంధించిన ఏజెన్సీలకు 6 నెలల బిల్లులు రావాల్సి ఉందని ఎంఈవో చెప్పారు. ప్రతి నెల దాదాపు రూ.70 వేల వరకు వంట సామగ్రి బిల్లులు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నామని.. మంజూరు కాగానే కార్మికులకు అందజేస్తామని వివరించారు.

# క్యారక్టర్ ఆర్టిస్టుగా మారిన మిస్టర్ హైదరాబాద్ - ఆగస్టు 15... నటుడు శ్రీహరి జయంతి

శ్రీహరి (ఆగష్టు 15, 1964 – అక్టోబరు 9, 2013) తెలుగు సినిమా నటుడు. ప్రతినాయకునిగా తెలుగు తెరకు పరిచయమై తరువాత నాయకుడిగా ప్రసిద్ధి పొందిన నటుడు. శ్రీహరి మంచి వ్యక్తిత్వం కలిగిన నటుడు, సాయం కోసం తన దగ్గరకు వెళ్లిన వారికి లేదు అనకుండా సాయం చేసే గుణం కలిగిన మనిషి. శ్రీహరి తాత రఘుముద్రి అప్పలస్వామికి ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామానికి వలస వచ్చారు. వీరిలో నాలుగవ కుమారుడు శ్రీహరి తండ్రి సత్యన్నారాయణ, తల్లి సత్యవతి. 1964 ఆగస్టు 15న జన్మించాడు. రోడ్డు పక్కన చిన్న పాక వేసుకొని సైకిలు షాపు, సోడాలు అమ్మి జీవనం సాగించారు. శ్రీహరికి శ్రీనివాసరావు, శ్రీధర్ అన్నదమ్ములు. శ్రీహరి ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణ జిల్లా విజయవాడ సమీపంలో జన్మించారు. 1977 లో యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీహరి ఏడవ తరగతి ఉత్తీర్ణుడు అయినాడు. ఆయన తల్లిదండ్రులు గుడివాడకు చెందినవారు కాగా, తరువాత గ్రామంలోని అరెకరం భూమిని అమ్ముకొని హైదరాబాదుకు మకాం మార్చారు. అలా ఆయన చిన్నతనంలోనే బాలానగర్లో స్థిరపడ్డారు. స్టంట్ ఫైటర్‌గా శ్రీహరి కెరీర్‌ను ప్రారంభించాడు. ఆయన జిమ్నాస్టిక్స్‌లో అథ్లెట్ కూడా. సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మరియు రైల్వే ఆఫీసర్ వంటి ఉద్యోగాలు లభించాయి, కాని ఆయన నటనా వృత్తిని కొనసాగించ దానికి ఆసక్తి చూపినందున ఆయన ఆ అఫర్లను తిరస్కరించాడు. ఏటా యలమర్రు గంగానమ్మ జాతరకు శ్రీహరి తప్పనిసరిగా వెళ్ళేవాడు. యుక్తవయసు నుండే శారీరక ధారుడ్యంపై ఎంతో ఆసక్తి కలిగి వుండేవాడు. ఉదయం చదువుకుంటూ, సాయంత్రం శోభన థియేటర్ ఎదురుగా ఉన్న అన్న శ్రీనివాసరావు షెడ్డులో మెకానిక్ గా పనిచేస్తూ ఖాళీ దొరికిన సమయంలో సినిమాలు శోభన థియేటర్ లో చూసేవాడు. హైదరాబాద్ లో నిర్వహించిన అనేక శారీరక ధారుడ్య పోటీలలో పాల్గొని 'మిస్టర్ హైదరాబాద్'గా ఏడుసార్లు అవార్డును సొంతం చేసుకున్నాడు. విశ్వ విద్యాలయం తరఫున రెండు సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని, బహుమతులు గెలుచు కున్నాడు. ఏషియన్ గేమ్స్ లో భారతదేశం తరఫున ఆడాలనే కోరిక ఉన్నా అది తీరలేదు.1986లో సినిమాలోకి స్టంట్ మాస్టర్‌గా కెరీర్ మొదలు పెట్టిన శ్రీహరి, అంచెలంచెలుగా నటుడిగా ఎదిగారు. 1989లో తమిళ సినిమా మా పిళ్ళై, తెలుగు 'ధర్మక్షేత్రం' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసిన ఆయన విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హీరోగా, నిర్మాతగా వివిధ రకాలుగా రాణించాడు. పోలీస్ చిత్రంతో హీరోగా ఆయనకు మంచి పేరు లభించింది. హీరోగా చేసిన మొదటి చిత్రం 'పోలీస్' అయితే.. హీరోగా చేసిన చివరి చిత్రం 'పోలీస్ గేమ్' కావడం విశేషం. క్యారెక్టర్ ఆర్టిస్టుగా చివరి చిత్రం తుఫాన్. 28 చిత్రాల్లో హీరోగా నటించాడు. రియల్ స్టార్‌గా ఖ్యాతి గడించారు. ఆయన దాదాపు వంద చిత్రాల్లో నటించాడు. జిమ్నాస్టిక్స్‌లో రాష్ట్ర స్థాయి చాంపియన్ అయిన శ్రీహరి అథ్లెట్ కావాలను కున్నాడు. జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌లో పాల్గొనాల్సి ఉన్నా....సినిమాలపై మక్కువతో ఈ రంగంవైపు అడుగులు వేసాడు. దాసరి దర్శకత్వంలో వచ్చిన 'బ్రహ్మ నాయుడు'లో ఆయనకు తెలుగు సినిమాలో నటించడానికి అవకాశం దక్కింది. తాజ్ మహల్ చిత్రంలో పూర్తిస్థాయి విలన్ పాత్రలో కనిపించాడు. 2000వ సంవత్సరంలో వచ్చిన 'పోలీస్' చిత్రం ద్వారా హీరోగా పరిచయం అయ్యాడు. గణపతి, అయోధ్య రామయ్య, శ్రీశైలం, భద్రాచలం, హనుమంతు, విజయ రామరాజు చిత్రాల్లో హీరోగా నటించారు. హీరోగా చేస్తూనే క్యారెక్టర్ ఆర్టిస్టుగా నువ్వొస్తానంటే నేనొద్దంటానా, బృందావనం, ఢీ, కింగ్, మగధీర, తుఫాన్ చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చు కున్నాడు. పృథ్వీపుత్రుడు సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన శ్రీహరి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరోగా ఎన్నో సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను మెప్పించాడు. రామ్ చరణ్ హీరోగా నటించిన మగధీరలో షేర్ ఖాన్ పాత్రతో అందరినీ



ఆకట్టుకున్న శ్రీహరి, ఇటీవల రామ్ చరణ్ హీరోగా నటించిన తుఫాన్, రఫ్ (2014) సినిమాల్లో నటించాడు. సినిమాల్లో "తెలంగాణ యాస"కు గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చిన నటుడు శ్రీహరి. ఢీ, కింగ్, డాన్ శీను, బృందావనం, తుఫాన్ వంటి చిత్రాలలో ఆయన పలికించిన సంభాషణలు తెలంగాణ యాసలో ఉన్న సౌందర్యాన్ని ఆవిష్క రించాయి. నిజ జీవితంలో హైదరాబాదీ తెలంగాణ యాసలో ఆయన సంభాషణ అందరినీ ఆకట్టుకునేలా సాగేది. శ్రీహరి 1991 లో డిస్కో శాంతిగా ప్రసిద్ది చెందిన దక్షిణ భారత నటి శాంతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె అక్షర. నాలుగు నెలలకే కుమార్తె అకాల మరణం చెందగా, తన కూతురు అక్షర పేరుతో ఫౌండేషన్ నెలకొల్పి, మేడ్చల్ పరిధిలోని నాలుగు గ్రామాలను దత్తత తీసుకొని అక్కడి ప్రజలకు మినరల్ వాటర్ ను అందించడంతో పాటు గ్రామంలో అనేక మౌలిక సదుపాయాల సాధనకు కృషి చేశాడు. తమ గ్రామానికి చెందిన శ్రీహరి రాష్ట్ర స్థాయికి ఎదిగి గ్రామం పేరును నలుదిశలా చాటినందుకు గర్వంగా యలమర్రు గ్రామ ప్రముఖులు 1989 సంవత్సరంలో శ్రీహరిని హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ప్రభుదేవా దర్శకత్వంలో తెరకెక్కుతున్న "రాంబో రాజ్‌కుమార్" సినిమా షూటింగ్ నిమిత్తం ముంబై వెళ్లిన శ్రీహరి, అక్కడ తీవ్ర అస్వస్థతకు గురవడంతో వెంటనే లీలావతి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్టోబరు 9, 2013 న కాలేయ సంబంధ వ్యాధి వలన ముంబై లో కన్నుమూసాడు. 2005 లో నువ్వొస్తానంటే నేనొద్దంటానా చిత్రానికి ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారం అందు కున్నాడు. ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ సహాయ నటుడి అవార్డు (తెలుగు) – నువ్వొస్తానంటే నేనొద్దంటానా (2005)టీ ఉత్తమ విలన్ గా నంది అవార్డు – తాజ్ మహల్ (1995)టీ నంది స్పెషల్ జ్యూరీ అవార్డు – శ్రీ రాములయ్య (1998)టీ నంది స్పెషల్ జ్యూరీ అవార్డు – పోలీస్ , రామ సక్కనోడు (1999)టీ నంది స్పెషల్ జ్యూరీ అవార్డు – విజయ రామరాజు (2000)టీ ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు – నువ్వొస్తానంటే నేనొద్దంటానాకు (2005) లభించాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# తెలుగు పత్రికా రంగంలో ఆంధ్రప్రభది ప్రత్యేక స్థానం




**ఆగస్టు 15, 1938 ఆంధ్రప్రభ ఆవిర్భావ దినం -**

**ఎనిమిదిన్నర దశాబ్దాల ఆంధ్రప్రభ ప్రస్థానం**

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఆంధ్రప్రభ ఒక శాశ్వత చిహ్నం. 1938 ఆగస్టు 15న స్వాతంత్ర్యోద్యమ జ్వాలలతో రగులుతున్న మద్రాసు నగరంలో రామనాథ్ గోయెంకా దూరదృష్టితో ఆవిర్భవించిన ఈ దినపత్రిక, తెలుగు పాఠకులకు విశ్వసనీయ వార్తలతో పాటు ప్రజాస్వామ్య విలువలను నిత్యం పోషించిన వేదికగా నిలిచింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రణ మొదలై తొలి సంపాదకుడిగా ఖాసా సుబ్బారావు బాధ్యతలు చేపట్టారు. అనంతరం న్యాపతి నారాయణమూర్తి స్వల్పకాలం సంపాదకత్వం వహించగా, 1942లో బాధ్యతలు స్వీకరించిన నార్ల వెంకటేశ్వరరావు పదిహేడేళ్ల ధృఢమైన సారథ్యంతో పత్రికకు స్వర్ణయుగాన్ని తీసుకువచ్చారు. తరువాత నీలంరాజు వెంకటశేషయ్య, పండితారాధ్యుల నాగేశ్వరరావు, పొత్తూరి వెంకటేశ్వరరావు, విద్వాన్ విశ్వం, వాకాటి పాండురంగారావు వంటి ప్రతిభావంతుల సంపాదకత్వంలో ఆంధ్రప్రభ తన గౌరవాన్ని, విలువలను నిలబెట్టుకుంది. స్వాతంత్ర్య సంగ్రామ దశలో బ్రిటిష్ పాలన అమలు చేసిన పత్రికా ఆంక్షలను ధైర్యంగా ఎదుర్కొంటూ దేశభక్తి వ్యాసాలు, నేతల ప్రసంగాలు, ప్రజా కదలికల వార్తలను నిబద్ధతతో ప్రచురిస్తూ తెలుగు ప్రజాభిప్రాయానికి దిశానిర్దేశం చేసింది. అప్పటి పరిస్థితుల్లో ప్రతిరోజూ 8%-%12 పేజీల పరిమాణంలో వెలువడిన పత్రిక 1940ల చివరలో యాభై వేలకుపైగా పాఠక వర్గాన్ని సొంతం చేసుకోవడం ఆ కాలపు తెలుగు పత్రికలలో విశేష ఘట్టం. స్వాతంత్ర్యం అనంతరం ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన ప్రజా ఉద్యమాల నేపథ్యంలో కూడా ఆంధ్రప్రభ సమాజ మనోభావాలను ప్రతిబింబిస్తూ సమతుల ధోరణితో ముందడుగు వేసింది. 1959 వరకు మద్రాసు నుంచే ప్రచురణ కొనసాగగా, 1960లో ఆంధ్రప్రభ దాని రెండవ ఎడిషన్‌ను విజయవాడలో ప్రారంభించింది. 1960ల తొలి దశకంలో చిత్తూరు నుంచి కొద్దికాలం ఎడిషన్ వెలువడి, 1966లో అది బెంగళూరుకు తరలించబడింది. 1977లో హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభమై తెలంగాణ పాఠక వర్గానికి మరింత చేరువ కాగా, 1985లో %శ్రీ% విస్తరణకు ప్రతిస్పందనగా విశాఖపట్నంలో మరొక ఎడిషన్ మొదలైంది. 1960 నాటికి విజయవాడ, చిత్తూరు ఎడిషన్‌లతో పత్రిక సర్క్యులేషన్ 53,000కు చేరుకోవడం, దశాబ్దం తర్వాత విజయవాడ, బెంగళూరు ఎడిషన్‌లతో అది 1,16,000కు పెరగడం ఆంధ్రప్రభ యొక్క పాఠక విశ్వాసాన్ని అద్దం పట్టే గణాంకాలు. విశ్లేషణాత్మక, మేధోపరమైన శైలి, తీక్షణ స్వరాన్ని ఆంధ్రప్రభ మెరుగు పరుచుకుంది. 1975 ఎమర్జెన్సీ కాలంలో స్వేచ్ఛపై ఆంక్షల నడుమ కూడా ప్రత్యామ్నాయ రూపకలనతో ప్రజా చైతన్యాన్ని మేల్కొలిపే బాధ్యతను నిర్వర్తించింది. 1980లలో ఆఫ్సెట్ ప్రింటింగ్, రంగు ముద్రణ ప్రవేశంతో దృశ్యరూప కథనం (ఫోటో జర్నలిజం)కు విశాల విస్తృతి లభించగా, 1990ల కంప్యూటరైజేషన్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్ పేజీ రూపకల్పనలో నూతన నైపుణ్యాన్ని అందించింది. 2000లో వెబ్‌సైట్, ఈ%-%పేపర్ ఆవిష్కరణతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు పాఠకుల చెంతకు తక్షణ ప్రాప్తి కలగగా, 2010 తర్వాత సామాజిక మాధ్యమాలు, మొబైల్ యాప్‌లతో డిజిటల్ విస్తృతి పెరిగింది. 2020లో కోవిడ్ మహమ్మారి కారణంగా ముద్రిత పత్రిక పంపిణీ అంతరాయానికి గురైన వేళ డిజిటల్ పాఠక వర్గం దాదాపు అరవై శాతం పెరిగి పత్రిక యొక్క అనువర్తిత్వాన్ని, సాంకేతిక చాతుర్యాన్ని చాటింది. ప్రస్తుతం ఆంధ్రప్రభ పలు ఎడిషన్లతో ప్రతిరోజూ లక్షల్లో పాఠకులను చేరుకుంటోంది. సంపాదకీయ స్వరం విషయానికి వస్తే నిజనిర్ధారణ, ప్రజా సమస్యలపై నిర్భయ ప్రతిధ్వని, భాషా శైలిలో సునిశితత్వం మూడు మూలాధారాలు ఇప్పటికీ పత్రిక ఆత్మను నిర్వచిస్తున్నాయి. రోజువారీ వార్తా ప్రవాహానికి తోడు పాఠక ఆసక్తులను అర్థం చేసుకుంటూ వారాంత ప్రణాళికను పత్రిక శాస్త్రీయంగా రూపకల్పన చేసింది. 'సాహితీ గవాక్షం', 'చింతన', 'జీవితం' 'కులసం', యువత ధ్యాసను దృష్టిలో పెట్టుకుని 'యువ' పేజీ ద్వారా అవకాశాలు, అధ్యయన మార్గదర్శకాలు, వ్యక్తిత్వ వికాస అంశాలను, 'చిత్రప్రభ'తో సినిమా, దృశ్యసాంస్కృతిక రంగాల లోతైన కథనాలు, ఇంటర్వ్యూలు, విశ్లేషణలు, పిల్లల కోసం వినోదం%-%జ్ఞానం కలబోతగా 'బాల ప్రభ'తో పాటు 'చింతన' పేజీ సమగ్ర దృష్టికోణాన్ని పెంపొందిస్తుండటీ ఆదివారం విశ్రాంతి పఠనానికి అనువుగా 32 పేజీల మినీ వీక్లీ సమాహారంతో విశేష కథనాలు, ఫీచర్లు, సాహిత్య సవ్వడులు, సుదీర్ఘ ఇంటర్వ్యూలను ఒకే చోట అందిస్తుంది. ఈ క్రమబద్ధ ప్రణాళిక పాఠక వర్గాల విభిన్న అవసరాలను తీర్చడమే కాక పత్రికకు విశేష ఆత్మీయతను కల్పిస్తోంది. ఆంధ్రప్రభ విజయం కేవలం ఎడిషన్ల విస్తారం లేదా సర్క్యులేషన్ గణాంకాల పరిమితిలో మాత్రమే కాదు.టీ అది తెలుగు సమాజ చైతన్యంలో ప్రసారమైన ఒక నిఘాన్నిర నాడి. వార్తలను వాస్తవనిష్ఠగా అందించడం, అభిప్రాయాలను బాధ్యతాయుతంగా తైలీకరించడం, భాషను శుద్ధంగా కానీ సజీవంగా మలచడంతో ఈ మూడు లక్షణాలు పత్రికను పాఠకులకు ఇష్టపడేపత్రికగా తీర్చిదిద్దాయి. మద్రాసులో వెలిగిన ఆ చిన్న దీపం విజయవాడకు, బెంగళూరుకు, హైదరాబాద్‌కు మార్గదర్శకంగా దీపావళిగా వ్యాపించి నేడు డిజిటల్ విశ్వంలోనూ అదే వెలుగును విరజిమ్ముతోంది. ఎనిమిదిన్నర దశాబ్దాల పైగా సుదీర్ఘ యాత్రలో ఆంధ్రప్రభ కేవలం వార్తాపత్రికగా కాక, తెలుగువారి ఆలోచనా ప్రస్థానానికి మార్గసూచి, సమాజ ప్రతిబింబానికి అద్దం, ప్రజాస్వామ్య విలువల కాపరిగా నిలిచి ఉండటీ 1938 ఆగస్టు 15న ప్రారంభమైన ఆ సంకల్పజ్వాల ఈ రోజూ అదే ఉత్సాహం, అదే నిబద్ధతతో పాఠక హృదయాలను ప్రకాశింపజేస్తూనే ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# యువ చైతన్యం.. సమాజ ప్రగతికి ఇంధనం

వెల్గటూరు: సమాజ ప్రగతికి యువ చైతన్యమే కీలకం. యువ శక్తిని యువజన సంఘాలతో అనుసంధానం చేస్తూ నిర్మాణాత్మక కార్యకలాపాలకు మళ్లిస్తే విలువలతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజం ఆవిష్కృతం అవుతుంది. యువతను ఏకతాటిపైకి తెచ్చి సమాజ సేవలో భాగస్వాములను చేయడానికి నెహ్రూ యువ కేంద్రాలు (ఎన్‌వైకే), యువజన సర్వీసుల శాఖ ఏర్పడ్డాయి. ఇవి సంఘాలకు మార్గనిర్దేశనం చేస్తుంటాయి. ఈ రెండు సంస్థలతో మమేకమై పని చేసిన నాయకులు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. నేడు 'అంతర్జాతీయ యువజన దినోత్సవం' సందర్భంగా సమాజ ప్రగతిలో యువజన సంఘాల పాత్రపై ప్రత్యేక కథనం.

**'మై భారత్-మేరా యువ భారత్'**

యువజన సంఘాలు, ఎన్‌వైకేలకు మధ్య వాలంటీర్లు వారధిగా వ్యవహరిస్తారు. 2023 మార్చి వరకు వీరి భాగస్వామ్యంతో సేవలు కొనసాగించారు. 2014లో పలు శాఖల పునరుద్ధరణలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఏర్పాటైంది. 2016లో జిల్లాల పునర్విభజన తర్వాత యువజన సర్వీసుల శాఖ సంక్షేమ, క్రీడా సంస్థలో విలీనం చేశారు. రెండేళ్లుగా వాలంటీర్ల నియామక ప్రక్రియ లేకపోవడంతో సమన్వయ లోపం తలెత్తుతోంది. ప్రస్తుతం జిల్లా స్థాయిలో జిల్లా యువజన, క్రీడాధికారి



(డీవైఎస్‌వో) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఎన్‌వైకే ప్రస్తుతం 15-29 ఏళ్ల మధ్య వయస్సులు లక్ష్యంగా 2024-25 నుంచి ఇది 'మై భారత్-మేరా యువ భారత్'గా మారింది.

**వాలంటీర్లను నియమిస్తే ప్రయోజనం..**

పంచాయతీ సమితి (బ్లాక్)ల వారీగా ఉమ్మడి జిల్లాలో 14 బ్లాక్‌లలో ఎన్‌వైకేలకు అనుబంధంగా వేలాది యువజన సంఘాలు శ్రమదానం, రక్తదానం, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన, మొక్కలు నాటడం, గ్రామీణ క్రీడల నిర్వహణ, చైతన్య సదస్సులు విరివిగా నిర్వహించారు. రెండేళ్లుగా ఇవన్నీ మరుగున పడటంతో యువతలో నిస్తేజం అలుముకుంది. కొత్త జిల్లాల వారీగా వాలంటీర్ల నియామకం చేపడితే లక్ష్యం నెరవేరే అవకాశాలున్నాయి.

**ఈ ఏడాది సామాజిక అంశం ఇలా..**

1999లో చేసిన తీర్మానం మేరకు 2000 ఆగస్టు 12 నుంచి ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఏటా ఒక్కో సామాజిక అంశాన్ని తీసుకుని ఆయా దేశాల్లో నిర్వహిస్తోంది. ఈ ఏడాది కెన్యాలో 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు-స్థానిక యువత చర్యలు' అంశంపై చర్చించనుంది.

**అంతర్జాతీయ వేదికలపై మనోళ్ల ప్రతిభ**

జిల్లాకు చెందిన యువజన సంఘాల ప్రతినిధులు రేండ్ల కళింగ శేఖర్, ఎ.కిరణ్‌కుమార్, ఈదునూరి శంకర్, ఆలువాల విష్ణు, కొండా రవి జాతీయ స్థాయిలో ఉత్తమ యువజన అవార్డులను అందుకున్నారు. శేఖర్ 'ఫిష్ ఫర్ వరల్డ్ యూత్'లో భాగంగా పలు దేశాల యువజన వేదికల్లో భాగస్వాములయ్యారు. కిరణ్‌కుమార్ 'ఇండో-చైనా యూత్ ఎక్స్ఛేంజ్' మలేషియా, సింగపూర్ దేశాల్లో పాల్గొన్నారు.

**యువజన సంఘాల నుంచి రాజకీయ ఉద్దండులు**

యువజన సంఘాల కార్యక్రమాల ద్వారా ఎన్‌వైకే, యువజన సర్వీసుల శాఖకు అనుబంధంగా సేవలందించిన పలువురు ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. యువజన, మహిళా, అంబేడ్కర్ సంఘాల ద్వారా యువ నాయకత్వ లక్షణాలు, నిబద్ధతతో పనిచేసి ఉన్నత స్థానంలో నిలిచారు. వీరిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, టి.సంతోష్‌కుమార్, గుజ్జుల రామకృష్ణారెడ్డి, రసమయి బాలకిషన్, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్ ఉన్నారు. వీరితోపాటు రాజకీయ పార్టీల్లో పొలసాని సుగుణాకర్‌రావు, నేరెళ్ల శారదలాంటి వారు రాణిస్తున్నారు. ఎన్‌వైకేల ద్వారా సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా ఎన్నికైన వారు ఎందరో ఉన్నారు.

# ఇంకెన్ని ప్రాణాలు పోవాలి!

గంగాధర: ఇటీవల కొత్తపల్లి సమీపంలో కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో కారులో ఉన్న మరొకరు సైతం మృతి చెందారు. పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ ఒక్క సంఘటనే కాదు కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక రూపంలో మృత్యువు ముంచుకొస్తుంది.

**గుర్తించిన ప్రమాద స్థలాలివే**

కొత్తపల్లి పరిధిలోని రేకుర్తి వంతెన, రామాలయం మలుపు, కొత్తపల్లి-వెలిచాల క్రాస్ రోడ్డు, కొత్తపల్లి ఎస్సారెస్పీ కాలువ.. రామడుగు మండలం దేశరాజ్‌పల్లి, వెదిర బస్టాండ్ సమీపంలోని రెండు వంతెనల వద్ద.. గంగాధర మండలం హిమ్మత్‌నగర్ క్రాస్‌రోడ్డు, కురిక్యాల వంతెన.. కొడిమ్యాల మండలం పూడూర్-ఆరెపల్లి మలుపు, నమిలికొండ శివారులోని రైల్వే ట్రాక్.. మల్యాల మండలం రాజారం వంతెన.. కొండగట్టు-బల్వంతాపూర్ క్రాస్‌రోడ్డు, అభయాంజనేయస్వామి గుడి మలుపు వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు.

**ఇంకా భూసేకరణ దశలోనే..**

కరీంనగర్-జగిత్యాల రహదారి విస్తరణ పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జగిత్యాల జిల్లాలో భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. 245.94 హెక్టార్లు అవసరమని గుర్తించి గతంలో 124 ఎకరాలు సేకరించారు. కరీంనగర్, వెదిర, గంగాధర, జగిత్యాల సమీపంలో 4 నుంచి 5 కి.మీ మేర బైపాస్‌లు ఏర్పాటు కానున్నాయి.

# ఇల్లు సరే.. ఇదేం సర్వే!

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సమయంలో సర్వేలు నిర్వహించి రెండు విడతలుగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇప్పటికే ఇళ్లు మంజూరు కాని నిరుపేదలు కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరో వైపు కేంద్రం 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' కింద ఇళ్ల లబ్ధిదారుల వివరాలు పూర్తి స్థాయిలో సేకరించి పంపాలని ఆదేశించింది. దీంతో గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది మళ్లీ గ్రామాలకు పరుగులు తీస్తున్నారు.

**ప్రధానమంత్రి ఆవాస్ యోజన..**

కేంద్ర ప్రభుత్వం కూడా ఇళ్లు లేని నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామాలకు పట్టణాలకు ఇళ్లను మంజూరు చేస్తోంది. అయిదేళ్ల వరకు ఏటా ఇళ్ల మంజూరుకు వీలుగా.. దరఖాస్తు చేసిన అర్హులు, ఇల్లు లేని నిరుపేదల వివరాలను సేకరించి ఆవాస్ ప్లస్ యాప్‌లో పొందుపర్చాలని ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సర్వే చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఆదేశంతో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మళ్లీ సర్వే మొదలుపెట్టారు. ఆధార్ కార్డుతోపాటు ఆదాయ ధ్రువీకరణ, బ్యాంకు ఖాతా, సొంత ఇల్లు ఉందా లేదా? అనే వివరాలతోపాటు పేరు, ఊరు మండలం ముఖచిత్ర ధ్రువీకరణ తదితర



అనేక వివరాలను సేకరించి యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు పేదల నుంచి దరఖాస్తులు సేకరించింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యమిచ్చింది. మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టు కింద అన్ని మండలాల్లో ఒక్కో గ్రామంలో, రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసింది. కరీంనగర్ నియోజకవర్గం మినహా అన్ని చోట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

**నమోదు తర్వాత..**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద సర్వే పూర్తి చేసి వివరాలను పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. తర్వాత ఆ ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో ఈ నిర్మాణాలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా సర్వే కొనసాగుతోందని, ఎప్పటికప్పుడు వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నామని త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో వివరాలు..

ఎల్-1 జాబితా అర్హులు : 48,609

సర్వే జరిగినవి : 17,432

సర్వే జరగాల్సినవి : 31,175

# మొక్కల లెక్కలు పక్కానా?

కరీంనగర్: గుంతలు పెద్దఎత్తున తీస్తున్న దాఖలాలు లేవు.. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగుల హడావుడి లేదు.. ఇళ్లకు పంపిణీ చేస్తున్నామని చెబుతున్నా జనం తీసుకెళ్లడం కనిపించడం లేదు.. కానీ వన మహోత్సవంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 62.42 లక్షల మొక్కలు నాటామని.. 35.01 లక్షల మొక్కలు ఇళ్లకు పంపిణీ చేశామని వివిధ శాఖల నివేదికల్లో ఉంది.. నెలన్నర రోజులుగా ఈ కార్యక్రమం సాగుతుండగా పూర్తి స్థాయి వర్షాలు లేకున్నా.. ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద లక్ష్యాన్ని పూర్తి చేశారా.. లెక్కలతో మమ అనిపిస్తున్నారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి..

**శాఖల వారీగా లక్ష్యాలు..**

ఉమ్మడి జిల్లాలో 2025వ సంవత్సరంలో 1.38 కోట్ల మొక్కల్ని నాటి సంరక్షించాలని నిర్ణయించారు. ఇందులో అన్ని శాఖలు భాగస్వాములవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉన్నా.. అన్ని విభాగాలు మొక్కలను నాటామని రోజువారీగా లెక్కలు చూపిస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి ప్రధాన శాఖల్లోనూ అరకొరగా కొన్ని మొక్కలు నాటి ఆర్భాటం చేస్తున్నారే తప్ప.. ప్రత్యేక శ్రద్ధతో నిరంతరం కార్యక్రమాన్ని కొనసాగించిన దాఖలాలు లేవు. అయినా ఇప్పటి వరకు



70 శాతానికిపైగా పురోగతి సాధించినట్లు అధికారిక లెక్కలున్నాయి.

ఇదీ తీరు..

**ఇప్పటి వరకు 97.43 లక్షల మొక్కలు నాటారని నివేదికల్లో ఉంది.**

ఇంటికి అయిదు మొక్కల చొప్పున పంపిణీ చేస్తున్నామని చెప్పినా అందరికీ అందలేదు.

కరీంనగర్ జిల్లాలో డీఆర్డీఏకు 17 లక్షల మొక్కల లక్ష్యం ఉండగా ఇప్పటికే 20 లక్షలు నాటినట్లు రికార్డుల్లో నమోదైంది.

క్షేత్రస్థాయి పరిశీలనేది?

ఆయా శాఖలు రోజూవారీగా చెప్పిన వివరాల్ని కలెక్టరేట్‌లలో నమోదు చేసుకుంటున్నారు. కానీ ఇవి క్షేత్రస్థాయిలో పక్కాగా నాటారా? లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షించడం లేదు. ఎలాగైనా నాటి ఉంటారనే ధీమాతో ఉన్నతాధికారులు ఉండగా.. వచ్చి పరిశీలిస్తారా? అని ఆయా శాఖలు నిర్లక్ష్యం చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల మాత్రం రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌ను చేపట్టారు. వందల సంఖ్యలో మొక్కలు నాటిన కొన్ని శాఖలు వేలల్లో చూపిస్తున్నాయి. పక్కాగా పర్యవేక్షణ లేకపోవడం.. కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోకపోవడంతో వన మహోత్సవం నామమాత్రపు వ్యవహారంగానే మారిపోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కలెక్టర్లు చొరవ తీసుకుని ఆయా శాఖల నివేదికల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటే మొక్కల పెంపకం ఆశయం సరైన దిశగా సాగనుంది.

# నిధులు పోగేద్దాం.. వసతులు కల్పిద్దాం



హైదరాబాద్: భారీగా విస్తరిస్తున్న మహా నగరంలో మౌలిక వసతుల కల్పన పెద్ద సవాలే. ముఖ్యంగా నిధులు సమీకరణ చాలా అవసరం. బల్దియా, హెచ్‌ఎండీఏ, జలమండలి, ఇతర విభాగాల ద్వారా ఏటా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరులాంటి వసతులు కల్పిస్తున్నా ఎటూ చాలడం లేదు. రోడ్లు, వరద నీటి నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. ప్రజా రవాణా ఇబ్బందులు సరేసరి. ఈ క్రమంలో నగరాభివృద్ధికి అర్బన్ ట్రాన్స్‌పోర్టు ఫండ్ (యూటీఎఫ్)ను ఏర్పాటుచేయాలని హెచ్‌ఎండీఏ ఇప్పటికే నిర్ణయించింది. కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ)లో భాగంగా ఈ ప్రత్యేక నిధిని తీసుకురానున్నారు. ఈ అంశం ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉంది. త్వరలో రూపం దాల్చే అవకాశముందని హెచ్‌ఎండీఏకు చెందిన ఓ అధికారి తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రధాన నగరాల్లో ఈ విధానం అమల్లో ఉంది. కొన్ని రకాల సెస్సులను వసూలుచేసి అలా పోగైన నిధిని ఆయా నగరాల్లో ప్రజల సౌకర్యాలకు వినియోగిస్తారు. ఈ నిధితో కొరత తీరనుందని చెబుతున్నారు. విధి విధానాలను ఖరారుపై హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఉమ్టా) ఇప్పటికే అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది.

**వెసులుబాటు ఇలా..**

ప్రజలపై ప్రత్యక్షంగా భారం పడకుండా నిధులు సమకూర్చనున్నారు. కొత్త వాహనాలకు చెల్లించే రిజిస్ట్రేషన్ ఛార్జీల్లో కొంత సెస్ కింద ఈ యూటీఎఫ్‌కు మళ్లించే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై వచ్చే వివిధ సెస్సుల్లో కొంత ఈ నిధికి చేర్చనున్నారు.

హెచ్‌ఎండీఏ పరిధిలో చేపట్టే ప్రతి ప్రాజెక్టులో 1.25 శాతం డెవలప్‌మెంట్ ఛార్జీల కింద ఆ సంస్థకు చెల్లించాలనే నిబంధన హెచ్‌ఎండీఏ చట్టంలో ఉంది. ప్రస్తుతం ఇది అమలు కావడంలేదు. భవిష్యత్తులో ఇలా వచ్చే నిధులు అర్బన్ ట్రాన్స్‌ఫోర్టు ఫండ్ (యూటీఎఫ్) కింద జమ చేసే అవకాశముంది. ఖాళీ స్థలాలపై కొంత సెస్ కింద వసూలుచేసి ఈ ఫండ్‌లో చేర్చనున్నారు. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా సాగే కొన్ని ప్రాంతాలను ఎంపికచేసి వాటిని సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ)గా గుర్తించనున్నారు. పీక్ అవర్‌లో ఆ ప్రాంతాలకు సొంత వాహనాలతో వెళ్లాలంటే కొంత సెస్ చెల్లించాలి. ఉదాహరణకు నగరంలో అమీర్‌పేట, సికింద్రాబాద్, ఆబిడ్స్, మాదాపూర్, గచ్చిబౌలిలాంటి బిజీ సెంటర్లను సీబీడీలుగా మార్చి అక్కడ.. ప్రైవేటు వాహనాల నుంచి కొంత సెస్ వసూలుచేసే యోచన ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని ఓ అధికారి తెలిపారు.

# గస్తీ కాస్తారు.. ఆట కట్టిస్తారు



సిరిసిల్ల : జిల్లాలో నిత్యం ఎప్పుడో ఒక్కచోట మహిళలపై ఎవరో ఒక్కరు వేధింపులకు గురి చేస్తూనే ఉన్నారు. కొందరు యువతులు, మహిళలు ధైర్యంగా ప్రతిఘటిస్తుండగా మరికొందరు ఎవరికీ చెప్పుకోలేక బాధపడుతున్నారు. అలాంటి వారికి షీ టీం అండగా ఉండి రక్షణ కల్పిస్తోంది.

**అవగాహన కల్పిస్తూ..**

ఒక్క ఫోన్‌కాల్‌తో షీ టీం సభ్యులు రంగంలోకి దిగి ఆకతాయిల ఆగడాలను అడ్డుకుంటూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. యువతుల పట్ల వెకిలి చేష్టలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్న పోకిరీల ఆట కట్టిస్తున్నారు. షీ టీం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మహిళలకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. విద్యాసంస్థలు, కళాశాలలు, మహిళలు పనిచేసే ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ మహిళా చట్టాలు, పోక్సో, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, తదితర అంశాలపై గురించి అవగాహన కల్పిస్తున్నారు. వేధింపులకు గురైతే ఎవరిని సంప్రదించాలి.. దాడులు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలపై విద్యార్థినులకు, మహిళలకు అవగాహన కల్పిస్తూనే, బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

**దోషులు తప్పించుకోలేరు..**

జిల్లా వ్యాప్తంగా పోకిరీల బెడద ఉన్న దాదాపు 94 హాట్‌స్పాట్‌లను గుర్తించారు. ఈ ప్రదేశాల్లో షీ టీం సభ్యులు మఫ్టీలో నిఘా పెడుతున్నారు. మహిళలు, యువతులు వేధింపులకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే వారిని పట్టుకొని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వారిలో మార్పు రాకపోతే కేసులు నమోదు చేస్తున్నారు. తరచూ నేరాలు జరిగే ప్రదేశాలైన విద్యాసంస్థలు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో మఫ్టీలో గస్తీ కాస్తున్నారు.

**18 ఎఫ్ఐఆర్‌లు నమోదు**

జిల్లా షీ టీంలో ఇద్దరు ఎస్సైలు, ముగ్గురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 300పైగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గత ఏడు నెలల నుంచి ఇప్పటి వరకు 18 ఎఫ్ఐఆర్ నమోదు కాగా 33 వరకు పెట్టీ కేసులు నమోదయ్యాయి. దాదాపు 22 మందికిపైగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. **వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు**

మహేష్ బి.గితె, జిల్లా ఎస్పీ

మహిళలు, యువతులకు భరోసా కల్పించేందుకు జిల్లాలో షీ టీం పని చేస్తోంది. ఎవరైనా వేధింపులకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటాం. మహిళలు, యువతులు ఎవరైనా ఇబ్బందులు పెడితే ముందుకు వచ్చి నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. ఈవ్ టీజింగ్‌కి పాల్పడితే వెంటనే షీ టీం నంబర్ 87126 56425కు ఫోన్ చేయాలి.

# విలీన గ్రామం.. అభివృద్ధికి దూరం



సిరిసిల్ల : సిరిసిల్ల పురపాలికలో విలీనమైన చంద్రంపేటకు వెళ్లే రోడ్డు ఇది. ఇప్పటికీ మట్టి రోడ్డే ఉండటంతో వర్షాలు కురిసినప్పుడు ఇక్కడి ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. రోడ్డంతా బురదగా మారి రాకపోకలు సాగించడానికి వీలే లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు.

సిరిసిల్ల పట్టణం జిల్లా కేంద్రం అయినా తరువాత చుట్టుపక్కల గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అభివృద్ధి పనులకు, ఇతర సదుపాయాల కల్పనకు నిధుల మంజూరు తప్పనిసరి. లక్షలకుపైగా జనాభా ఉంటేనే ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ కింద సదుపాయాలు సమకూరుతాయి. ఈ క్రమంలో కేంద్రం నుంచి నిధులను సమకూర్చుకోవడం కోసం సిరిసిల్ల పట్టణంలో 80 వేల పైచిలుకు ఉన్న జనాభాను లక్షకుపైగా పెంచాలని నిర్ణయించారు. పట్టణ శివారు ప్రాంతాలైన రగుడు, చంద్రంపేట, పెద్దబోనాల, చిన్నబోనాల, పెద్దూరు, సర్దాపూర్, జగ్గారావుపల్లె గ్రామాలను 2018లో సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనం చేశారు. పట్టణంలో గతంలో 33 వార్డులు ఉండగా ఏడు విలీన గ్రామాలను పట్టణంలో కలపడంతో వార్డుల సంఖ్య 39కి చేరింది. విలీన గ్రామాల్లో ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆశించిన స్థానికులు.. ప్రస్తుతం కనీస మౌలిక సదుపాయాలు సమకూరడం లేదని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి విలీన గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**కొన్ని ప్రధాన సమస్యలిలా..**

ఏడు విలీన గ్రామాల్లో నేటికీ కొన్నిచోట్ల విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడం లేదు. రాత్రి సమయంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శ్మశాన వాటికలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. పెద్దూరులోని రెండు పడక గదుల సముదాయంలోని వారు మరణిస్తే దాదాపు 4 కిలోమీటర్ల దూరంలోని సిరిసిల్ల పట్టణానికి తీసుకురావాల్సి వస్తోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఫలితంగా స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు.

విలీన గ్రామాల్లో ఇప్పటి వరకు మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటోంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

# వాహనదారులపై ఆర్థిక భారం

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రవాణా శాఖ సేవా రుసుములను పెంచింది. గతంతో పోలిస్తే రెట్టింపు చేస్తూ గత నెల 22న జీఓ నం.51 విడుదల చేసింది. ఈ ఉత్తర్వులను తక్షణమే జిల్లా కార్యాలయాల్లో అమల్లోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించిన ఆర్టీఏ సర్వర్‌లో మార్పులు చేశారు. నాటి నుంచి ఖమ్మం జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో పెంచిన సేవా రుసుములతో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో రవాణా శాఖకు ఆదాయం, వాహనదారులపై ఆర్థిక భారం పెరిగింది.

**పెరిగిన ఆదాయం**

జిల్లాలోని ఖమ్మం, వైరా, సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రతి రోజూ సరాసరి 300 వరకు దరఖాస్తులు వస్తున్నాయి. రవాణా శాఖ సేవా రుసుం పెంపు నిర్ణయంతో జిల్లా రవాణా శాఖకు గత 20రోజులుగా ఆదాయం పెరిగింది. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్సు, లెర్నింగ్ లైసెన్సు, వాహనాల రిజిస్ట్రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందే. సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఆర్టీఏ కార్యాలయాలకు వచ్చేవారికి సేవా రుసుము ఆన్‌లైన్ ఫీజు మాత్రమే పడుతుంది. ఏజెంట్ల ద్వారా సేవలు పొందితే మరింత భారం తప్పడం లేదు. రవాణా శాఖ అధికారులు పెరిగిన రుసుముల వివరాలను కార్యాలయం నోటీసు బోర్డుపై పేర్కొన్నారు.

జిల్లాలో గత అయిదేళ్లలో డ్రైవింగ్ లైసెన్సులు: 6,868

ఒక రోజుకు స్లాట్ల కేటాయింపులు ఇలా..

డ్రైవింగ్ లైసెన్సులు: 64,

లెర్నింగ్: 64,

వాహన రిజిస్ట్రేషన్లు: 60



దరఖాస్తు ఛార్జీల పెంపు

రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించి నూతన వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్, లెర్నింగ్ లైసెన్సులు, పర్మిట్, సామర్థ్య పరీక్షలతోపాటు ఇతర సేవలపై అదనపు ఛార్జీలతో పాటు పన్నులను సైతం పెంచింది. వాహనం ఇన్‌వాయిస్ ధర ప్రకారం నూతన వాహనాల రిజిస్ట్రేషన్ పన్నులు పెంచారు. గతంలో రూ.50 మాత్రమే ఉండగా.. రూ.500లోపు పన్నుకు రూ.50, రూ.500కన్నా ఎక్కువ ఉంటే రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు.

లెర్నింగ్ లైసెన్సు పరిమితి ఆర్నెల్లు కాగా గతంలో రూ.100 సేవా రుసుము ఉండగా.. ప్రస్తుతం రూ.200 చేశారు.

డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించిన పీవీసీ, స్మార్ట్ కార్డుల సేవా రుసుం అయిదేళ్ల కాలపరిమితికి లైట్ మోటారు వాహనం(ఎల్ఎంవీ) రూ.200 నుంచి రూ.300కు, 20ఏళ్ల లోపు నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు రూ.300 నుంచి రూ.400కు పెంచారు.

వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి పీవీసీ, స్మార్ట్ కార్డులకు నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు 0.5శాతం, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు 0.1శాతం పన్ను, మూడు చక్రాల వాహనాలు ఏడాది లోపు రూ.250 నుంచి రూ.300కు, ఏడాది కన్నా ఎక్కువ ఉంటే రూ.300 నుంచి రూ.500 అదనపు ఛార్జీలను విధించారు.

ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు రెండేళ్ల లోపు రూ.100 నుంచి రూ.200, రెండేళ్ల పైన రూ.200 నుంచి రూ.300 వరకు పెంచారు. వాహన పర్మిట్ ఛార్జీలను గతంలో ఉన్న ఛార్జీలకన్నా రూ.100 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు.

'రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ సేవా రుసుం గత నెలలో పెంచింది. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులకు సంబంధించిన రుసుములను వాహనదారులు చెల్లించి సేవలను పొందవచ్చు.'

వాకదాని వెంకటరమణ, జిల్లా రవాణా శాఖ ఇన్‌ఛార్జి అధికారి

# పరిహారంపై స్పష్టతేదీ?

కారేపల్లి ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాలను కలుపుకొని మంజూరైన రైల్వే రెండోలైనుకు సంబంధించిన భూములు కోల్పోతున్న రైతులు నేడు ఆందోళన చెందుతున్నారు. రైల్వేలైను తెరమీదకు వచ్చి ఏడాది దాటుతున్నా పరిహారంపై రైల్వే, రెవెన్యూ శాఖలు లెక్కలు తేల్చకపోవడంతో అన్నదాతల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొలత పనులు పూర్తి..

విస్తరణకు సంబంధించి మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి మొదలుకొని ఖమ్మం జిల్లాలో కారేపల్లి, చీమలపాడు మీదుగా భద్రాద్రి కొత్తగూడెం వరకు రెండోలైను నిర్మించనున్నారు. రైల్వేశాఖ అధికారులు ఇప్పటికే అన్ని రకాల పనులు పూర్తి చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

పొడవు: 54 కి.మీ.

తొలివిడత: ఖమ్మం జిల్లా కారేపల్లి, భద్రాద్రి జిల్లా తడికలపుడి వరకు 23 కి.మీ

రైల్వేశాఖ పనులకు మంజూరు చేసిన నిధులు.. రూ.250 కోట్లు

అన్నదాతలు ఆగలేక..

సాగు పనులు ప్రారంభం కాకముందే రెండు శాఖలు సంయుక్తంగా సర్వేలు నిర్వహించి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల వివరాలు సేకరించారు. బాధిత రైతులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి వివరించారు. ఎకరానికి ఎంత నష్టపరిహారం చెల్లిస్తారనే విషయాన్ని ఇంత వరకు ప్రకటించలేదు. బీడు భూములుగా వదిలేయలేక సాగు సీజన్ మొదలవడంతో ప్రస్తుతం ఆ భూముల్లో దుక్కులు దున్ని సేద్యం చేస్తున్నారు. లెక్కతేల్చిన తర్వాతే భూములు అప్పగించవచ్చనే ధోరణిలో రైతులు ఉన్నారు.

లెక్కలు తేల్చితేనే హద్దులు

ఏ ప్రాంతాల్లో ఎంత భూమి కోల్పోతున్నారనే విషయంపై రెవెన్యూ శాఖ లెక్కలు తేల్చింది. రైతులకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే హద్దులు నిర్ణయించుకునే విధంగా చర్యలు చేపట్టనున్నారు. కాగా రైల్వేశాఖ పరిధిలో ఉన్న భూముల్లో ప్రస్తుతం పనులు చేపట్టే అవకాశం ఉంది.

కొద్ది రోజుల్లో రైతుల పేర్లు, భూముల వివరాలపై పబ్లిక్ పేపర్ నోటిఫికేషన్ వేస్తాం. తర్వాత పూర్తి నివేదికను గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు పంపిస్తాం. రైతుల నుంచి ఎక్కువ మొత్తంలో అభ్యంతరాలు రావడంతో సమయం ఎక్కువ ఇచ్చాం. త్వరలో మరోసారి గ్రామసభ ఏర్పాటుచేసి అందులో భూమి ధరను నిర్ణయిస్తాం. రైతులు ఒప్పుకున్న తర్వాతే వారి నుంచి భూమి రైల్వేకు అప్పగిస్తున్నట్లు కాగితం రాయించుకుంటాం.

శ్రీకాంత్, జేఈ, రైల్వే

# కర్షకులపై కమీషన్ కత్తి

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు మార్కెట్లో వేరుసెనగ రైతులను ఏజెంట్లు నిలువునా ముంచుతున్నారు. కమీషన్ పేరుతో అ'ధనం'గా తీసుకొంటున్నారు. ఈసారి ముందస్తు వేరుసెనగ మురిపించింది.. ఎకరాకు 30 సంచుల దిగుబడి వచ్చింది. పశ్చిమ ప్రాంతంలోని పలు మండలాలు, సరిహద్దున ఉన్న అనంతపురం, గద్వాల జిల్లా నుంచి రైతులు సరకు తీసుకొస్తున్నారు. గత 20 రోజుల నుంచి క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. రైతుకు, వ్యాపారికి మధ్యవర్తిగా కమీషన్ ఏజెంట్లు ఉంటారు. అందుకు రైతుల నుంచి రూ.వందకు 2 శాతం కమీషన్ తీసుకుంటారు. మరో 2 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు లక్ష వేరుసెనగ సంచులు విక్రయించారు. ఒక సంచి 30 కిలోల చొప్పున లెక్కించినా 30వేల క్వింటాళ్ల వ్యాపారం జరిగింది. రూ.30 లక్షలు అదనపు కమీషన్ పేరుతో దోచుకొన్నారు. పంచేసుకొంటున్నారు



మార్కెట్‌లో 91 మంది కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. ఇందులో సీజన్‌లో రెగ్యులర్‌గా 40 నుంచి 50 మంది కమీషన్ ఏజెంట్ల దుకాణాలకు మాత్రమే రైతులు దిగుబడులు తెస్తారు. రైతులను ఒప్పించి వీరి దుకాణాల వద్దకు తెచ్చినందుకు ఆటో వాళ్లకు బస్తాకు రూ.10 నుంచి రూ.20 చొప్పున కమీషన్ ఇస్తారు. కొందరికి లైసెన్స్ ఉన్నా దుకాణానికి దిగుబడులు రావు.లక్ష్యానికి మించి దిగుబడులు కొనుగోలు చేసిన ఏజెంట్లు.. గిరాకీ లేని ఏజెంట్ల ద్వారా అమ్మకాలు జరిగినట్లు చూపిస్తారు. వీరి దుకాణాల ద్వారా రూ.లక్షల నుంచి రూ.కోట్ల విలువైన పంట ఉత్పత్తులు కొన్నట్లు చూపిస్తారు. దిగుబడులు కొన్న దుకాణదారు.. బిల్లులు చూపించిన ఏజెంటు కలిసి రైతుల నుంచి 4 శాతం కమీషన్ తీసుకొని పంచుకుం టున్నారు. "నిబంధనల మేరకు రైతుల నుంచి 2 శాతం కమీషన్ వసూలు చేయాలి. అదనపు కమీషన్ వసూలుపై రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని" మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి పేర్కొన్నారు.

# చి'వరి'కి మిగిలేది కన్నీరే..!

చీపురుపల్లి : వరుణుడు కరుణించడం లేదు.. ఆదుకుంటుందని ఆశించిన తోటపల్లి జలాశయం నీరు శివారుకు అందక రైతును కన్నీరు పెట్టిస్తోంది. ఖరీఫ్‌లో నాట్లు వేసుకోలేక.. ఇప్పటికే వేసిన నాట్లకు నీరందక అన్నదాత తల్లడిల్లిపోతున్నాడు. తోటపల్లి జలాశయం కుడి ప్రధాన కాలువ ద్వారా విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో 95 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో 80 వేల ఎకరాలు రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ప్రాజెక్టుకు శివారున ఉంది. ఏటా శివారుకు నీరందక రైతులు నష్టపోతున్నారు.



**చౌర్యమే కారణం..**

రోజుకు 1,200 క్యూసెక్కుల నీటిని తరలించే విధంగా ప్రధాన కుడి కాలువను రూపొందించారు. ప్రస్తుతం 800 నుంచి 850 క్యూసెక్కుల వరకే నీటిని విడిచిపెడుతున్నా.. సామర్థ్యం సరిపోక కాలువ మొదట్లో గట్లుపైకి వెళ్తోంది. వదులుతున్న నీరు కాలువ 52 కి.మీ దాటేసరికి 260 క్యూసెక్కులు కూడా మిగలడం లేదు. పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాల పరిధిలో కొందరు కాలువ గర్భంలో మోటార్లు, ఇంజిన్లు పెట్టి తోడేస్తున్నారు. చెరువులు, క్వారీ గుంతలకు నింపేస్తున్నారు. దీంతో శివారుకు రావడం లేదు.

# సిక్కోలు తీరాన.. ఉద్యమాల ఉప్పెన..!

శ్రీకాకుళం : బ్రిటిష్ పాలకులను ఎదిరించి 'మాకొద్దీ తెల్ల దొరతనమంటూ..' నినదించిన గరిమెళ్ల..జముకుల పాటతో జనాన్ని ఉద్యమం వైపు నడిపించిన సుబ్బారావు పాణిగ్రహి..జమీందార్ల పాలనలో అటవీ హక్కుల కోసం పోరాడి ప్రాణాలు విడిచిన వీర గున్నమ్మ..సాయుధ పోరాట పటిమ చూపించిన శ్రీకాకుళం గిరిజన ప్రాంత రైతులు..బీల భూముల పరిరక్షణకు ఉద్యమించిన సోంపేట, కాకరాపల్లి ప్రాంతీయులు.....అన్యాయం జరిగిన ప్రతిచోటా గొంతెత్తి పోరాడటం సిక్కోలు వాసుల స్వభావం. నమ్ముకున్న నేల కోసం.. హక్కుల కోసం అనేక సందర్భాల్లో రైతులు కదం తొక్కారు. అందుకే 'ఎరుపెక్కిన సూర్యుడిని చూడాలంటే తూర్పు కనుమల వైపు చూడు' అని శ్రీశ్రీ తన కవితల్లోనూ ప్రస్తావించారు. జిల్లా ఆవిర్భవించి 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శ్రీకాకుళం పోరాట స్ఫూర్తి నెమరేసుకుందాం.. ఆ స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

ఆరంభం ఇలా..తెల్లదొరలను ఎదిరించి చేపట్టిన ఉద్యమాల్లో శ్రీకాకుళం వాసులు కీలకపాత్ర పోషించారు. మద్రాస్ ఎస్టేట్‌లో బ్రిటిష్ పాలన సాగుతున్న రోజులవి.. శ్రీకాకుళం అప్పట్లో విశాఖ జిల్లాలో అంతర్భాగంగా ఉండేది. మందస జమీందారు జగన్నాథ రాజమణి దేవ్ ప్రజల నుంచి పెద్ద ఎత్తున కప్పం వసూలు చేసేవారు. 1930లో అందుకు వ్యతిరేకంగా తొలిసారి ఈ ప్రాంతంలో ఉద్యమాలు మొదలయ్యాయి. నాటి జమీందారీ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమం చాపకింద నీరులా సాగింది.

**పోరాటం ఫలించింది.. ఐటీడీఏ వచ్చింది**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గిరిజనుల హక్కుల సాధన, భూస్వాములు, పెట్టుబడిదారులు అకృత్యాలు, ఉద్దానంలో వ్యాపారుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా 1960లో తిరిగి ఉద్యమాలు ఊపందుకున్నాయి. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి వంటి వారు నాయకత్వం వహించారు. ఆ ఉద్యమాల ప్రభావంతో అనేక మంది చైతన్యవంతులై ప్రశ్నించడాన్ని అలవర్చుకున్నారు. అనంతరం గిరిజన, రైతు సంఘాలు ఏర్పాటయ్యాయి.

1961లో మొండెంఖల్లులో గిరిజన సంఘం తొలి సభ జరిగింది.

1967 అక్టోబరు 31 నాటికి సాయుధ పోరాటంగా రూపు మార్చుకుంది. బత్తిలి గ్రామంలో గిరిజనులు పెత్తందార్లను ఎదురించి పోరాడగా.. చాలా మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు.శ్రీకాకుళం సాయుధ పోరాటంలో 1967 అక్టోబరు 31న జరిగిన ఎన్‌కౌంటరులో అజ్ఞాతవాసంలోకి వెళ్లిన ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యం తదితరులు మృతి చెందారు.1967-70 మధ్య సాగిన పోరాటాల్లోనూ వందల మంది ఉద్యమకారులు, నాయకత్వ బాధ్యతల్లో ఉన్నవారు ఎన్‌కౌంటర్లలో నేలకొరిగారు.1972లో ఆరికె రాములు, రాజారామిరెడ్డి ఎన్‌కౌంటర్ తర్వాత పోలీసు నిర్బంధాలతో ఉద్యమం నీరు గారింది. అయితే ఈ ఉద్యమాలే గిరిజనుల అభ్యున్నతికి సీతంపేటలో ఐటీడీఏ ఏర్పాటైంది.

**దేశానికే దారి చూపాయిలా..**

సోంపేట, కాకరాపల్లి ప్రాంతాల్లో థర్మల్ విద్యుత్తు కేంద్రాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేసిన పోరాటాలుదేశంలో ఇతర ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచాయి.బీల ప్రాంతంలో బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు 2007లో అప్పటి వైఎస్ ప్రభుత్వం అనుమతులిచ్చింది. 33 గ్రామాల మధ్యలోని బీల భూములను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించారు. మానవ హక్కుల నేత బాలగోపాల్ నేతృత్వంలో స్థానికులు బీలను రక్షించుకునేందుకు 2008 నుంచి ఉద్యమించగా.. 2010 జులై 14 నాటికి తీవ్రరూపం దాల్చింది.

# 'హరితా' వారి.. బొంగు చికెన్.. రాగిసంగటి




విశాఖపట్నం: బొంగు చికెన్ పేరు..వినగానే మాంసాహార ప్రియులకు నోరూరాల్సిందే. వెదురు బొంగులో అన్ని రకాల మసాల దినుసులు, మాంసం ముక్కలు వేసి దాన్ని నిప్పుల్లో కాల్చుతారు. అది బాగా ఉడుకుతున్నప్పుడు లోపలి నుంచి వచ్చే ఆవిరితో మిళితమై ప్రత్యేక రుచిని తీసుకొస్తుంది. విశాఖకు వచ్చే పర్యాటకులు బాగా ఇష్టపడే వంటకం ఇది. రుచి చూసేందుకు ప్రత్యేకంగా అరకు, అనంతగిరి వెళ్తారు. ఆ సంప్రదాయ రుచులను నగరంలోనే అందించేందుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రణాళిక చేస్తోంది. స్థానికంగా లభించే వంటకాలను సందర్శకులకు సరసమైన ధరల్లో అందించనుంది. అప్పుఘర్‌లోని హరితా రిసార్టు (యాత్రి నివాస్) ఇందుకు వేదికగా నిలివనుంది.

**మెనూ అలా...**

యాత్రి నివాస్ రిసార్టులో భిన్న రుచులందించేలా కిచెన్‌ను నవీకరించారు. వారాంతాల్లో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకుల డిమాండు ఆధారంగా వివిధ రకాల వంటకాలు అందించనున్నారు. ముఖ్యంగా విశాఖకు పశ్చిమబెంగాల్ నుంచి అధిక సంఖ్యలో వస్తారు. వారి ఆహారపు అలవాట్లకు తగ్గట్లు మెనూ తయారు చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే చిరుధాన్యాలతో చేసిన వంటకాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. వీటితో బిర్యానీలు, చిరుతిళ్లు అందించనున్నారు. వారాంతాల్లో ప్రత్యేకంగా రాగిసంగటి, కోడి కూర, మాంసాహారంలో పలు రకాల ఇగురు కూరలు వండనున్నారు. వారాంతాలు, పండగ రోజుల్లో ఎక్కువగా ఇలా చేయాలనుకుంటున్నారు.

ఆవకాయ పప్పన్నం, చిట్టి ముత్యాల బియ్యంతో పలు రకాల బిర్యానీలు, చిరుధాన్యాలతో చేసిన వడలతోపాటు.. పర్యాటకుల ఆసక్తి ఆధారంగా విదేశీ రుచులు అందించనున్నారు.

**అధిక సంఖ్యలో:** తీర ప్రాంత అందాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు నగరానికి వస్తుంటారు. ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా ఒడిశా, ఝార?ండ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఎక్కువగా ఉంటున్నారు. విదేశీయులు తరచూ సందర్శిస్తున్నారు. వచ్చే వారిలో ఎక్కువమంది భిన్నమైన ఆహార రుచులను ఆస్వాదించాలనుకోవడంతో పర్యాటకశాఖ వినూత్నబాట పడుతోంది.

**సిద్ధమైన రిసార్టు:** 'ఆధునికీకరణ తర్వాత అప్పుఘర్‌లోని హరితా రిసార్టు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం బుకింగ్స్ తీసుకుంటున్నాం. మొత్తం 41 గదులతో డీలక్స్, లగ్జరీ గదులను సందర్శకులకు సిద్ధం చేశాం. అన్ని గదులు విలాసవంత సౌకర్యాలు, పర్యాటక సంస్కృతి ఉట్టిపడేలా ఉన్నాయి. ఏసీ సూట్ గదులకు రూ.4,200, వారాంతాల్లో రూ.4,620, ఏసీ డీలక్స్ కింగ్ గదులకు రూ.5,180, వారాంతాల్లో రూ.5,600, ఏసీ డీలక్స్ రూ.3,920, వారాంతాల్లో రూ.4,200, ఏసీ ఎగ్జిక్యూటివ్‌కు రూ.3,500, వారాంతాల్లో రూ.3,920 చెల్లించాలి. 200 మందికి సరిపోయే సమావేశ మందిరం ఉంది. ఇందులో కార్యశాలలు, పుట్టినరోజు వేడుకలు, సమావేశాలు నిర్వహించుకోవచ్చు. వంద మందికి సరిపోయే రెస్టారెంట్‌ను ఆధునిక ఫర్నిచర్‌తో సిద్ధం చేశాం. వారాంతాల్లో ప్రత్యేకంగా ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తాం' అని ఏపీటీడీసీ డీవీఎం, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు గేదెల జగదీష్ పేర్కొన్నారు.

# వంతెన.. ఇంతేనా?



అనకాపల్లి : జిల్లాలోని ప్రధాన రహదారులపై కొన్ని వంతెనల నిర్మాణం ఎంతకూ పూర్తవడం లేదు. పనులు ప్రారంభమైనా సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. ఆవలి ఒడ్డు నుంచి ఇవతలి ఒడ్డుకు రావడానికి ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. నిధుల కొరత, భూసేకరణ సమస్యలతో నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రహదారులు, భవనాల శాఖ చేపట్టిన పలు వంతెనల నిర్మాణపనులు తుదిదశకు వచ్చి నిలిచిపోయాయి. మరికొన్ని పాడుబడ్డాయి.దేవరాపల్లి నుంచి పినకోట, పెదకోట వెళ్లే మార్గంలోని శారదానదిపై ఐదేళ్ల కిందట నిర్మించిన వంతెన ఇది. దీనికి అప్రోచ్ రోడ్డు వేయకుండా వదిలేశారు. అప్పట్లో మంత్రి బూడి ముత్యాలనాయుడు ఐటీడీఏ నిధులతో దేవరాపల్లి దగ్గర తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు నిర్మించారు. పెద్ద వాహనాలు ఈ వంతెనపై వెళ్లే అవకాశం లేదు. ఇక్కడ కొద్దిపాటి నిధులు ఇచ్చి.. రైతులతో మాట్లాడి భూసేకరణ చేస్తే ఈ వంతెన ద్వారా వందలాది గ్రామాలకు మేలు జరుగుతుంది. వడ్డాది వద్ద పెద్దేరుపై వంతెన ఇది. అధిక లోడుతో క్వారీ వాహనాలు విచ్చలవిడిగా తిరగడంతో రెండేళ్ల క్రితం కూలిపోయింది. గత ప్రభుత్వ హయాంలో దీనిని నిర్మించాలంటూ.. స్థానికులు ఎన్నోసార్లు మొర పెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదు. ఈ మార్గం గుండా వంద గ్రామాలకు పైగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో వంతెన పక్కన వేసిన మట్టిరోడ్డుపై నుంచి వరద వెళ్తుంది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నర్సీపట్నం, రోలుగుంట మండలాల మధ్య ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన వంతెన ఇది. అప్పట్లో స్తంభాలు వేసి వదిశారు. దీనిని నిర్మించేందుకు రూ.90 లక్షలు అవసరం అని అధికారులు తాజాగా అంచనావేశారు. వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు, రెండు మండలాల మధ్య రాకపోకలకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుంది.


దేవరాపల్లి మండలం కలిగొట్ల దగ్గర 15 ఏళ్ల క్రితం రూ. 5 కోట్ల వ్యయంతో శారదా నదిపై వంతెన నిర్మించారు. బ్రిడ్జ నిర్మాణం పూర్తయినా.. అప్రోచ్ రోడ్డు నిర్మించక పోవడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. ఇప్పుడు దీనికి రూ.5 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. భూసేకరణ చేసి అప్రోచ్ రోడ్డు వేస్తే.. పాడేరు నుంచి విశాఖ జిల్లాలకు తక్కువ వ్యవధిలోనే రాకపోకలు సాగించవచ్చు.

**వంతెనలన్నీ వినియోగంలోకి తెస్తాం..**

నిధుల సమస్య కారణంగా కొన్ని బ్రిడ్జిల నిర్మాణాలు నిలిచాయి. వాటి పరిస్థితిపై ప్రభుత్వానికి తెలియజేశాం. ఇటీవలే ఇలాంటి వంతెనల పనులకు అంచనాలు వేశాం. త్వరలో ఇవన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

సాంబశివరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, అనకాపల్లి

# గాజులపల్లి కాదు.. కొలువులపల్లి!



అనంతపురం : గ్రామంలో ప్రభుత్వం ఉద్యోగం ఒకరు సాధిస్తేనే ఎంతో గొప్పగా చెప్పుకొంటారు. అలాంటిది చిన్న మారుమూల గ్రామంలో పదుల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే ఆశ్చర్యం కలగకమానదు. గుత్తిమండలంలోని ఇసుకరాళ్లపల్లి పంచాయతీలోని గాజులపల్లి గ్రామం ఈ ఘనకీర్తిని సాధించింది. గ్రామంలో 80 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇంటికో ఉద్యోగి ఉండటం విశేషం. ఓ ఉమ్మడి కుటుంబంలో ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు, మరో ముగ్గురు ప్రభుత్వ కొలువుల్లో ఉన్నారు. ఆయా కుటుంబాలన్నీ తమ పిల్లల్ని వ్యవసాయం, కూలీ పనులు చేస్తూనే పిల్లల్ని ఉన్నంతంగా చదివిస్తున్నారు. గ్రామంలో 1985లో రామాంజినేయులు అనే వ్యక్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. అప్పటి నుంచి ఈ పరంపర కొనసాగుతుండటం విశేషం.

**వివిధ స్థాయిల్లో...**

ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివిధ స్థాయిలో చాలా మంది స్థిరపడ్డారు. చిన్న గ్రామం నుంచే 13 మంది కానిస్టేబుళ్లు 13, ఉపాధ్యాయులు 12, ప్రభుత్వ వైద్యులు 4, తహసీల్దార్, ఏపీఆర్‌జేస్మీ ప్రిన్సిపల్, రైల్వే, పాలిటెక్నిక్ అధ్యాపకుడు, ఐటీ, ఎస్సై, నేవీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు 3, సాఫ్ట్‌వేరు ఇంజినీర్లుగా నలుగురు ఇలా వివిధ ఉద్యోగాలు సాధించారు. ఆగస్టు 1వ తేదీన విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి కానిస్టేబుల్‌గా ఎంపికకావడం విశేషం. గత నెల రోజుల కిందట దాదాపు 10 మందికి పైగా డీఎస్సీ పరీక్షలు రాశారు. కొత్తగా మరో పదిమంది ప్రైవేటు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

# పరివర్తకం... ప్రహసనం!

గిద్దలూరు : జిల్లా పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ పరివర్తకం దెబ్బతింటే మరమ్మతులు చేయించడం తలకు మించిన భారమవుతోంది. సిబ్బంది స్పందన అంతంత మాత్రంగా ఉండడంతో... బోరు ఆధారంగా వేసిన పంటలు చేతికి అందని పరిస్థితి ఉంటోంది.

**పట్టని నిబంధనలు...**

నిబంధనల ప్రకారం రైతుల పొలాల్లోని పరివర్తకాలు మరమ్మతులకు గురైతే... ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా మార్చాలి. అన్నదాతలే నేరుగా కాల్‌సెంటర్ నం.1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయమై అవగాహన లేక రైతులు విద్యుత్తు సిబ్బందిపైనే ఆధారపడుతున్నారు. కాగా... ఎస్‌పీఎంలో నిల్వలు ఉంటేనే ఫిర్యాదు చేయాలని కొందరు అధికారులు సిబ్బందిని మౌఖికంగా ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కర్షకులు సమస్య తెలియజేసినా సిబ్బంది పైకి విషయం తెలియజేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గిద్దలూరు, కంభం పరిధిలో నెల రోజుల వరకు పరివర్తకాలు మార్చని పరిస్థితి ఉండడంతో... వాటి పరిధిలో సాగు చేస్తున్న పైర్లు ఎండుముఖం పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

**ఫిర్యాదు చేసినా అంతే...**

గిద్దలూరు మండలం ఎల్లుపల్లె గ్రామానికి చెందిన రైతు యేరువ వెంకటరామిరెడ్డి గత నెల 10న పరివర్తకం దెబ్బతిందని ఫిర్యాదు చేసినా సోమవారం వరకు కాల్‌సెంటర్‌లో నమోదు కాకపోవడం గమనార్హం. ఎల్లుపల్లెకు చెందిన మరో రైతు బుడతా మద్దులేటిదీ ఇదే పరిస్థితి. ముండ్లపాడు విద్యుత్తు సెక్షన్ పరిధిలో ఇలాంటి కేసులు పది వరకు ఉన్నాయి. రాచర్ల, కొమరోలు, అర్ధవీడు, బేస్తవారపేట, కంభం పరిధిలోనూ రోజుల తరబడి పరివర్తకాలు మార్చని పరిస్థితి నెలకొంది. విషయాన్ని ఎస్‌ఈ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా... ఎస్‌పీఎంలో నిల్వలు ఉంటేనే ఫిర్యాదు చేయాలని సిబ్బందికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు. స్థానికంగా పరివర్తకాలు లేని పక్షంలో... రైతులకు ఇబ్బంది లేకుండా మరో కేంద్రం నుంచి తెప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# వంశ'ధార' తగ్గుతోంది..!

హిరమండలం : వానాకాలంలో జలాలతో కళకళలాడాల్సిన వంశధార నదిలో ఆ కళ తప్పుతోంది. క్రమేపీ నీటి ప్రవాహం తగ్గుతోంది. ఫలితంగా గొట్టాబ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో తగ్గి శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. నదీ పరివాహక ప్రాంతం ఒడిశాలో వర్షాలు లేకపోవడమే ఇందుకు కారణం. 3 వేల క్యూసెక్కులకు పైగా ఉన్న ప్రవాహం 2 వేల వద్దకు చేరుతోంది. పంటలకు నీటి సరఫరా చేయాలంటే కనీసం 3 నుంచి 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోకు తగ్గకూడదు. దీని ప్రభావం కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటి సరఫరా పరిమాణం క్రమేపీ తగ్గుతోంది.

**రెండు రోజులకోసారి సరఫరా..**

కొద్దిరోజుల నుంచి స్పిల్‌వే గేట్లన్నీ మూసేసి కాలువలకు నీరు విడిచిపెడుతున్నా శివారు భూములకు నీరందే పరిస్థితి లేదు. ఇప్పటికే ఎడమ కాలువ పరిధిలో ఎత్తిపోతల పథకాలకు వారాబంధీ పద్ధతి విధించారు. కిట్టాలపాడు కాశీవిశ్వేశ్వర ఎత్తిపోతల పథకానికి రెండు



రోజులకోసారి విద్యుత్తు సరఫరా చేస్తామని ఏపీఎస్ఐడీసీ ఇంజినీర్లు ప్రకటించారు. ఎడమ కాలువ పరిధిలో 1.48 లక్షలు, కుడి కాలువ పరిధిలో 62 వేల ఎకరాలు సాగవుతోంది. ఎడమ కాలువ పరిధిలో దాదాపు వెయ్యికి పైగా ఇంజిన్లు అక్కడక్కడా పెట్టుకుని నీరు తోడాల్సిన దుస్థితి. కుడి కాలువ పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**పొదుపుగా వాడుకోవాలి..**

బ్యారేజీ వద్ద అన్నిగేట్లు మూసివేసి నీటిని నిల్వ చేసినప్పటికీ కాలువలకు పూర్తి స్థాయిలో నీరు వెళ్లడం లేదు. శివారు భూములకు నీరందడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలి. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో సమస్య నెలకొంది.కేవీఎన్ స్వర్ణకుమార్, వంశధార సర్కిల్ కార్యాలయం, ఎస్‌ఈ, శ్రీకాకుళం

గొట్టా బ్యారేజీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం: 38.10 మీటర్లు (0.6619 టీఎంసీలు)

ప్రస్తుతం నదిలోకి నీటి ప్రవాహం విడిచిపెట్టడం లేదు

ఎడమ కాలువలోకి.. 1,771 క్యూసెక్కులు

కుడి కాలువలోకి.. 468

గతేడాది ఇదే సమయం నదిలోకి నీటి ప్రవాహం 722 క్యూసెక్కులు

ఎడమ కాలువకు.. 1,818

కుడి కాలువకు.. 507

# పరిగి బస్టాండ్‌లో ఆక్రమణల తొలగింపు

హిందూపురం : 'ప్రయాణికుల ప్రాంగణం.. ఆక్రమణలే అధికం'.. 'నాటి వైకాపా పాపం.. నేటికీ వీడని శాపం' అంటూ లో 20 రోజుల క్రితం వచ్చిన కథనానికి పుర అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. పట్టణంలో రూ.33 కోట్లతో నిర్మించిన మార్కెట్‌కు అడ్డుగా పరిగి బస్టాండ్‌లోని ఖాళీ స్థలంలో దుకాణాలు నిర్మించుకోవడానికి టోకు కూరగాయల వ్యాపారులకు వైకాపా హయాంలో 2023లో అనుమతించారు. ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా, వేలం పాటలు లేకుండా, కేవలం కౌన్సిల్ తీర్మానంతో దుకాణాలు వెలిశాయి. దీంతో పట్టణంలోని పరిగి బస్టాండ్ కుచించుకుపోయింది. మరో వైపున నూతన మార్కెట్‌కు అడ్డంగా ఉండటంతో అక్కడి గదులను అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. మరో వైపున తమ అక్రమ నిర్మాణాలను తొలగించకుండా కొందరు టోకు వ్యాపారులు కోర్టుకు వెళ్లారు. వీటన్నింటినీ ప్రశ్నిస్తూ 'ఈనాడు' కథనాన్ని ప్రచురించింది. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున చొరవ చూసి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు కొట్టేసేలా అన్ని వివరాలు సమర్పించారు. కోర్టు సైతం మున్సిపాలిటీకి అనుకూలంగా తీర్పు రావడంతో, వెంటనే నోటీసులు ఇచ్చి సోమవారం తొలగించారు. ఆక్రమణలు తొలగిపోవడంతో నూతన మార్కెట్‌కు రాకపోకలకు మార్గం సుగమం అయింది. బస్టాండ్ విశాలం అయింది.

# ఇసుక దోపిడీ



పుట్టపర్తి : జిల్లాలో చిత్రావతి, పెన్నా, పాపాగ్ని, సోమావతి తదితర నదులు, ఇతర వాగులు, వంకలు అక్రమార్కులకు వరంగా మారాయి. ఇక్కడి ఇసుక నాణ్యతగా ఉండటంతో డిమాండ్ ఎక్కువ. ఇదే అదునుగా కొందరు అక్రమార్కులు అనుమతి లేనిచోట యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించాలి. రాత్రింబవళ్లు అక్రమ రవాణా సాగుతోంది. ముదిగుబ్బ మండలంలోని పీసీ రేవు, తాడిమర్రి మండలంలోని సీసీరేవులో మాత్రమే తవ్వేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. బత్తలపల్లి మండలం గర్శినపల్లి, చిత్రావతి బ్రిడ్జి వద్ద రాత్రివేళల్లో ఇసుక తోడేసి బెంగళూరుకు తరలిస్తున్నారు. కొందరు స్థానిక ప్రజాప్రతినిధుల అండతో బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల నుంచి రోజుకి 60 టిప్పర్ల వరకు బెంగళూరు ప్రాంతానికి వెళ్తున్నట్లు సమాచారం. టిప్పరు ఇసుక రూ.40 వేల వరకు ధర పలుకుతోంది. ధర్మవరం చుట్టుపక్కల అధికంగా ట్రాక్టర్లలో రవాణా సాగిస్తున్నారు.

**ఉచితం పేరుతో..**

వైకాపా ప్రభుత్వ హయాంలో ఇసుకకు భారీ డిమాండ్ ఉండేది. నాయకులు ఎక్కడికక్కడ తోడేసి స్థానికంగానేకాక ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుకను ఉచితం చేసింది. ఇళ్లు నిర్మించుకునేవారు పరిసర ప్రాంతాల్లోని వాగులు, వంకలు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఎద్దులబండ్లు, కొన్నిచోట్ల ట్రాక్టర్లతో తీసుకెళ్లవచ్చని పేర్కొంది. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది.

**రైతుల ఆవేదన..**

రొద్దం మండలంలోని చెరుకూరు, పీరుప్పల, నారెనాగేపల్లి. ఎం.కొత్తపల్లి కర్ణాటక సరిహద్దు గ్రామాలు. వీటి పరిధిలో పెన్నాలోని ఇసుకను పగలు కంటే రాత్రి ఎక్కువగా తోడేస్తున్నారు. ఇక్కడ నుంచి పిరమణి, పావగడ పట్టణాలకు తరలిపోతోంది. పావగడలో నిల్వ చేసి అక్కడి నుంచి బెంగళూరుకు తరలిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ట్రాక్టర్లు నదిలోకి రాకుండా రైతులే స్వయంగా పలుచోట్ల గుంతలు తవ్వడం గమనార్హం.

చిత్రావతి నది నుంచి ముదిగుబ్బ మీదుగా కదిరి ప్రాంతానికి, బత్తలపల్లి మీదుగా అనంతపురం, రాప్తాడు కేంద్రాలకు నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. మామూళ్లకు అలవాటు పడిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కదిరి నుంచి ముదిగుబ్బ వరకు ఉండే మద్దిలేరు వాగు, తనకల్లు, నంబులపూలకుంట మండలాల పరిధిలోని పాపాగ్ని నది, తనకల్లు మండలం పరిధిలోని సీజే ప్రాజెక్టు, కదిరి మండలంలోని ముత్యాలచెరువు వాగు, పుట్టపర్తి నియోజకవర్గం ఓబుళదేవరచెరువు మండలంలో సోమావతి నది, తలుపుల మండలంలోని చెరువులు, వాగుల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో అక్రమ రవాణా సాగుతోంది.

**తనిఖీలు చేస్తున్నాం.. –** ఓబుళరెడ్డి, మైనింగ్‌శాఖ ఇన్‌ఛార్జి ఏడీ

జిల్లాలో ఎక్కడైనా ఇసుక అక్రమంగా తరలిపోతున్నట్లు సమాచారం వచ్చినా.. వెంటనే స్పందించి దాడులు చేస్తున్నాం. రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులతో కలిసి అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

## నిధులు.. వ్యయం కాక మిగులు

చిత్తూరు : ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపంతో గ్రామ పంచాయతీ, జిల్లా, మండల పరిషత్ ఖాతాల్లోని 15వ ఆర్థిక సంఘం నిధులు మూలుగుతున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి రూ.38.27 కోట్లు ఇంకా మిగిలాయి. పనుల ఎంపికలో ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరక పలు చోట్ల అభివృద్ధి పనులకు ముందడుగు పడటం లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండో విడత నిధులు ఉమ్మడి జిల్లాకు రూ.100 కోట్లు త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది. మిగులు నిధులతో కలిపి రూ.138 కోట్లు ఖర్చు చేయాలి. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులకు 2020-21 లో మొదలైన 15వ ఆర్థిక సంఘం నుంచి ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థలకు ఇప్పటివరకూ రూ.274 కోట్లు కేంద్రం విడుదల చేసింది. వీటిలో నుంచి రూ.235.73 కోట్లు పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్తుల్లో ఖర్చు చేశారు. 2020-21లో మొదలైన



15వ ఆర్థిక సంఘం 2025-26లో ముగియనుంది. పంచాయతీలకు కేటాయిస్తున్న నిధులతో గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యంతో పాటు, రోడ్లు, కాలువల్లాంటి అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు, సర్పంచుల మధ్య సమన్వయం కొరవడటం అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. దీంతో ఉమ్మడి జిల్లాలో 450 పంచాయతీల ఖాతాల్లో నిధులు అలాగే ఉన్నాయి. కొన్ని పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉన్నా ఫలితం లేకుండా పోయింది.

**రూ.16 కోట్లు ఉన్నాయి**

ఉమ్మడి జిల్లాలోని జిల్లా, మండల పరిషత్‌ల పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 కోట్లు ఉన్నాయి. అభివృద్ధి పనులు చేపట్టి వీటిని ఖర్చు చేస్తాం.

రవికుమార్‌నాయుడు, జడ్పీ సీఈవో

**కొన్ని పంచాయతీల్లోనే నిధులు**

ఆర్థిక సంఘం నిధులు జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీల ఖాతాల్లో రూ.10 కోట్ల వరకూ ఉన్నాయి. వాటిని సకాలంలో అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని ఆదేశాలు ఇస్తున్నాం. నిధుల వ్యయానికి గల అడ్డంకుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సుధాకర్‌రావు, డీపీవో

## ఇంటి ముంగిటకు సేవలెన్నడో..!

చిత్తూరు : విద్యుత్తు పరికరాలు, ప్లంబరింగ్ వస్తువుల మరమ్మతుకు గుర్రైతే వృత్తిదారులను ఇంటి వద్దకే తీసుకురావడానికి మెప్మా నిర్దేశించిన 'హెూం ట్రయాంగిల్' యాప్ అధికారుల చిత్తశుద్ధి, పర్యవేక్షణ లోపం కారణంగా అమలులో జాప్యం నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రాజెక్టు జనవరిలో ప్రారంభమైనా.. చిత్తూరు జిల్లాలో మాత్రం వెనుకబడింది. సర్వీస్ ప్రొవైడర్స్ పేరుతో వృత్తిదారులకు శిక్షణ ఇచ్చి వారి వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. ఒక్క ఫోన్‌కాల్‌తో టెక్నీషియన్లను ఇంటి వద్దకే పంపించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. యాప్ ద్వారా వృత్తిదారులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు తగ్గకుండా ఆదాయం కల్పించమే లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు చిత్తూరు నగరంలో 500 మంది, కుప్పం, నగరి, పలమనేరు, పుంగనూరు పట్టణాల్లో వంద మంది చొప్పున మొత్తం... 900 మంది వృత్తిదారులను ఎంపిక చేశారు. చిత్తూరు, పలమనేరులో మాత్రమే 345 మంది వృత్తిదారులకు శిక్షణ ఇచ్చారు. అత్యధికంగా చిత్తూరులో 500 మందిని గుర్తించడమే లక్ష్యంగా



నిర్ణయించుకున్నా.. 250 మందికి శిక్షణ ఇచ్చారు. ఇక పలమనేరులో 95 మందికి శిక్షణ ఇచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ రెండు పట్టణాల్లో 345 మందిని యాప్‌లో నమోదు చేయగా ఇప్పటివరకు ఒక్క ఫోన్ కాల్ సైతం రాకపోవడం గమనార్హం.

**లక్ష్యం దెబ్బతిందిలా..**

పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ తరహా సేవలను పట్టణాలకూ విస్తరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వృత్తి నిపుణులను గుర్తించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చారు. ఎన్‌ఎస్‌డీసీ, ఎస్‌డీసీ, ఎన్‌ఏసీ శిక్షణ సంస్థల ద్వారా అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు సైతం అందజేశారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన 'హెూం ట్రయాంగిల్' సంస్థ ద్వారా ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టారు. అయితే యాప్‌పై ప్రజల్లో ప్రచారం చేపట్టకపోవడంతో.. ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింది. ఉన్న చోట నుంచే వృత్తిదారులను ఆన్‌లైన్ విధానంలో ఎంపిక చేసుకునే విధానంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**అవగాహన కల్పిస్తాం**

చేతి వృత్తిదారుల సేవల కోసం ఏర్పాటు చేసిన 'హెూం ట్రయాంగిల్' యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు చేపడతాం.

పద్మావతి, చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి పీడీ, మెప్మా

## సహకార స్టోర్ లెక్కలేవీ?



అనంతపురం : అనంతపురం సహకార సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్....ఈ పేరు జిల్లా వాసులకు సుపరిచితమే. దశాబ్దాల పాటు వివిధ సేవలు అందించి.. నేడు కనుమరుగయ్యే స్థితికి చేరింది. ఈ స్టోర్స్‌కు కోట్ల రూపాయల ఆస్తులున్నప్పటికీ చక్కదిద్దేవారు కరవయ్యారు. అనంత నగరంలో సహకార శాఖకు అనుబంధంగా సెంట్రల్ స్టోర్స్ 1969లోనే ఏర్పాటు చేశారు. రెండు దశాబ్దాల నుంచి పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. స్టోర్స్ ద్వారా గతంలో నాణ్యమైన నిత్యావసరాలు తక్కువ ధరకు విక్రయించేవారు. కార్డుదారులకు చౌకబియ్యం అందించి అప్పట్లో ప్రజల విశ్వాసం చూరగొంది. అనంత రైల్వేస్టేషన్‌కు అతిసమీపంలో దాదాపు అర ఎకరాకు పైగా స్థలం ఉంది. సదరు స్థలంలో ఉన్న గోదామును ప్రైవేటు ఐటీఐకి అద్దెకు ఇచ్చారు. ఖాళీ స్థలంలో స్టీల్ విక్రయశాల, ఒక భవనంలో పీఎఫ్ కార్యాలయం ఉన్నాయి. వీటి ద్వారా అద్దె సుమారు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. సహకార శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారిని నిబంధనలకు విరుద్ధంగా మేనేజరుగా నియమించారు. అటెండరు, స్వీపరు పనిచేస్తున్నారు. నెలకు వారి జీతాలకు గాను రూ. 25వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఆడిట్ జరిపిన పాపాన పోలేదు.

**పర్సన్ ఇన్‌ఛార్జిని నియమించినా..**

సెంట్రల్ స్టోర్స్ లావాదేవీలను పర్యవేక్షించడానికి పర్సన్ ఇన్‌ఛార్జిని ఆరు నెలల క్రితమే నియమించారు. సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గంగాధర్‌ను పీఐసీగా ఉన్నారు. సదరు అధికారికి ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు. గతంలో డీఎల్‌సీఓగా పనిచేసి మూడు నెలల క్రితం పదవీ విరమణ పొందిన ఓ అధికారి నిబంధనలకు విరుద్ధంగా మేనేజరును నియమించారు. ఈ స్టోర్స్‌లో జరిగిన అక్రమాలను లోగుట్టుగానే ఉంచారన్న అపవాదు అతనిపై ఉంది. **రికార్డులు అందుబాటులో లేవు –**గంగాధర్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్

ఎప్పుడు వెళ్లినా మేనేజరు అందుబాటులో ఉండరు. సొసైటీకి సంబంధించిన రికార్డులు ఇప్పటి వరకు అప్పగించలేదు. ఎంత దుర్వినియోగం జరిగిందో రికార్డులు పరిశీలిస్తేనే తేలనుంది.

## కాసులిస్తే.. అడ్డదారిలో అడవిలోకి



పుత్తూరు : ఏర్పేడు మండలాల పరిధిలోని సదాశివకోనకు మూడు వైపుల నుంచి దారులు ఉన్నాయి. పుత్తూరు మండలం తడుకు పంచాయతీ నాగిలేరు, వడమాలపేట నుంచి, ఏర్పేడు మండలం పాపానాయుడుపేట మీదుగా సదాశివకోనకు వెళ్లొచ్చు. పాపానాయుడుపేట వద్ద మాత్రమే చెక్‌పోస్టు ఉంది. సదాశివకోన జలపాతం, అటవీ అందాలు చూస్తూ అక్కడ రాత్రి సమయాల్లో ఉండేందుకు కొందరు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇటీవల తిరుపతికి చెందిన ఓ వ్యక్తి అలా వెళ్లి అటవీ అందాలు తన కెమెరాలో బంధించారు. అటవీశాఖ అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని.. అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి వెళ్లనని లేఖ రాయించుకుని వదిలిపెట్టడం గమనార్హం.

శేషాచల అడవుల్లో ఎన్నో జలపాతాలు, సుందర ప్రదేశాలు ఉన్నాయి. వీటిని కొందరు యూట్యూబర్లు కెమెరాల్లో బంధించి అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికి ఆకర్షితులైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కొందరు వారిని సంప్రదిస్తున్నారు. దీంతో ఒక్కొక్కరి నుంచి రూ.3 –5 వేలు తీసుకుని ఆ ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు అటవీశాఖ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పురుషులతో పాటు మహిళలు వెళ్తుండటం గమనార్హం. శుక్రవారం రాత్రి ఆ ప్రాంతానికి వెళ్తే శనివారం, ఆదివారం సాయంత్రం ట్రెక్కింగ్, రాత్రుల్లో ఫైర్ క్యాంపులు, ఫొటోషూట్‌లు చేసి అక్కడే గడిపి వస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎటుచూసినా ఎత్తయిన కొండలు, కోనలు ఉన్నాయి.. ఇవన్నీ అటవీశాఖ పరిధిలోకి వస్తాయి. పశ్చిమ మండలాల్లో భాకరాపేట వద్ద తలకోన, బైరెడ్డిపల్లె మండలంలో కైగల్ జలపాతం ఉన్నాయి.. తూర్పు మండలాల్లో మూలకోన, కైలాసకోన, సద్దికూటి మడుగు, ఉబ్బలమడుగు, ఆరె జలపాతం, సదాశివకోన ఉన్నాయి. తిరుపతి శేషాచల అడవుల్లో జలపాతాలకు తోడు సుందరమైన ప్రాంతాలు కొలువుదీరాయి.. ఇప్పటికే కైలాసకోన, ఉబ్బలమడుగు, తలకోన, మూలకోన, ఆరె తదితర ప్రాంతాల్లో అటవీశాఖ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది.. మిగిలిన ప్రాంతాల్లో ఇవి లేవు. దీంతో ట్రెక్కింగ్, ఫైర్ క్యాంపుల పేరుతో పర్యాటకులను యూట్యూబర్లు ఆకర్షించి సొమ్ము చేసుకుంటున్నారు.. అందులో అటవీశాఖ సిబ్బంది సైతం సూత్రధారులుగా ఉండటం గమనార్హం.

**ఇంటి దొంగలను అదుపు చేస్తేనే..**

అటవీశాఖలో కింది స్థాయి సిబ్బంది ప్రమేయం లేకుండా అడవుల్లోకి ప్రవేశించడం అసాధ్యం. దీనిపై ఉన్నతాధికారులు ఓ కన్నేసి ఉంచాలి. వాస్తవానికి అటవీశాఖ అనుమతి లేనిదే అటవీ ప్రాంతాలను సందర్శించడం నిషిద్ధం. అలాంటిది అంత ధైర్యంగా యూట్యూబర్లు ఫొటోషూట్ చేసి అప్‌లోడ్ చేసి పర్యాటకులను ఆకర్షిస్తున్నారంటే.. ఇది ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచి బాధ్యులపై చర్యలు చేపడితే తప్ప అడ్డుకట్ట పడదు.

**అనుమతి విధిగా తీసుకోవాలి..**

అటవీ ప్రాంతాలను సందర్శించాలంటే విధిగా అటవీశాఖ అనుమతులు తీసుకోవాలి. ట్రెక్కింగ్‌కు ఎలాంటి అనుమతుల్లేవు. ఫొటోషూట్ కూడా చేయకూడదు. అనుమతులు లేకుండా ఎవరు ప్రవేశించినా అటవీశాఖ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.మాధవి, అటవీ క్షేత్రాధికారి, పుత్తూరు

## తారు పూసి.. నిధులు మేసి

ఆస్పరి : ఆదోని నుంచి పత్తికొండకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. రూ.15 లక్షలు వెచ్చించి గతేడాది 20 కి.మీ. మేర మరమ్మతులు చేశారు. దారి పొడవునా మళ్లీ గుంతలు పడ్డాయి. ఈ రహదారిపై నిత్యం 15 వేల వరకు వాహనాలు తిరుగుతుంటాయి. రహదారుల నిర్వహణకు గత ప్రభుత్వం తిలోదకాలిచ్చింది.. కనీసం గుంతలు పూడ్చేందుకు చిల్లిగవ్వ ఇవ్వలేదు.. ఫలితంగా పలువురు ప్రమాదాలబారిన పడి ప్రాణాలు సైతం కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌అండ్‌బీ రహదారులపై దృష్టి సారించింది. ముందుగా మరమ్మతులకు నిధులు కేటాయించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రహదారులపై ప్యాచింగ్ పనులు చేశారు. నాణ్యత లేకపోవడంతో రోడ్డు పరిస్థితి 'తారు'మారైంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి.

**244 పనులు.. రూ.30 కోట్లు**

రహదారుల మరమ్మతులు, గుంతల పూడ్చివేత, జంగిల్ క్లియరెన్స్‌కు గతేడాది రూ.30 కోట్లు మంజూరు చేశారు. ఇందులో కర్నూలు జిల్లాలో 143 పనులకు రూ.19.53 కోట్లు, నంద్యాలలో 101 పనులకు రూ.10.72 కోట్లు వెచ్చించారు.

నిబంధనల ప్రకారం తారు లేచిపోయిన చోట చతురస్రాకారంలో



తవ్వాలి.. ఆ ప్రాంతంలో దుమ్ము లేకుండా శుభ్రం చేసి దానిపై తారు వేయాలి. అనంతరం తారు కంకర కలిపి సరైన ఉష్ణోగ్రతతో వేడిచేసిన మిశ్రమాన్ని వేయాలి. దానిపై తెల్ల పౌడర్ చల్లాలి. కానీ ఎక్కడా ఇలా చేపట్టలేదు. తారు, కంకర వేసి మట్టి చల్లేసి మమ అనిపించారు.

**రహదారుణాలిలా** పత్తికొండ నియోజకవర్గ పరిధిలో 102 పనులు చేశారు. ఆదోని నియోజకవర్గంలో 9 కి.మీ, ఎమ్మిగనూరు 7, ఆలూరు 8, కోడుమూరు నియోజకవర్గ పరిధిలో 12 కి.మీల పొడవునా పనులు జరిగాయి. ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలోని చాలా ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో చేసిన పనుల్లోనూ నాణ్యత కరవైంది. చాలాచోట్ల ప్యాచింగ్ దెబ్బతింది. ఆయా మార్గాల్లో వాహనాలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తుండటంతో గుంతలు పెద్దవిగా మారుతు న్నాయి.

**మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం**

నంద్యాల జిల్లాలో 250 కి.మీ., కర్నూలు జిల్లాలో 380 కి.మీ. పొడవునా రహదారులు దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాల్లో కొత్తగా రహదారులు నిర్మించాల్సి ఉంది. ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల పరిధిలో రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. దెబ్బతిన్న రహదారులకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

## అవినీతి 'ఆట'

కర్నూలు : 'ఆడుదాం.. ఆంధ్రా' అంటూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.2 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు విజిలెన్సు అధికారులు తేల్చారు. పోటీల నిర్వహణకు ప్రతి సచివాలయానికి రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించారు. దీంతోపాటు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారు. గ్రామస్థాయిలో క్రీడలకు రూ.10 వేలు కేటాయించి.. మరో రూ.10 వేలు జేబులో వేసుకొన్నట్లు తేలింది. క్రీడా పోటీలకు అవసరమైన కోర్టులు ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేశారు. పోరంబోకు భూముల్లో ముళ్లపొదలు తొలగించి భూమిని చదును చేసి ముగ్గుతో మార్కింగులు వేసి మమ అనిపించారు. చాలా చోట్ల ఆటలే నిర్వహించలేదు.

**అ'ధనం'గా దోచారు**

8 కొన్ని గ్రామాలు, పురపాలక సంఘాల పరిధిలోని సచివాలయాలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులు క్రీడా పోటీల నిర్వహణకు సరిపోవని, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అదనంగా నిధులు వినియోగించారు. కొన్నిచోట్ల పోటీల పేరుతో రూ.లక్షల్లో అదనపు




నిధులను వెచ్చించినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఇది వందశాతం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని విజిలెన్స్ అధికారుల విచారణలో నిగ్గుతేలింది. రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నామని, క్రీడాకారులకు భోజనాలు, అల్పాహారాల పేరుతో భారీగా నిధులను మింగేసినట్లు అధికారుల విచారణలో తేలింది.

**కనిపించని కిట్లు**

పోటీలకు అవసరమైన కిట్లు జిల్లాలకు పంపించారు. ఎన్ని పంపించారు ? ఏ ఆటకు ఎన్ని ఇచ్చారో అధికారుల వద్ద లెక్కలే లేవు. చాలా మండలాలకు పూర్తిస్థాయిలో పంపించలేదు. దస్త్రంలో మాత్రం పంపిణీ చేసినట్లు రాసుకొన్నారు. పోటీల అనంతరం ఆ కిట్లు స్థానిక క్రీడాకారులకు ఉపయోగపడాలి. ప్రస్తుతం వాటి జాడే లేదు. ఇచ్చినవీ అత్యంత నాసిరకంగా ఉన్నాయి.. క్రికెట్ బ్యాట్లు, వికెట్లు తొలిరోజే విరిగిపోయాయి.

**పోటీలు పెట్టలేదు**

కొన్ని సచివాలయాల పరిధిలో అసలు పోటీలు పెట్టనేలేదు. దస్త్రంలో మాత్రం పోటీలు పెట్టినట్లు, కొందరు విజేతలుగా నిలిచినట్లు చూపించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఆయా నగదు ప్రోత్సాహకాలను కొందరు విజేతలకు నేటికీ పంపిణీ చేయలేదు.

క్రీడా పోటీల్లో పాల్గొనేవారికి టీషర్టులు ఇవ్వాలి. చాలా మందికి ఇవ్వకుండానే ఇచ్చినట్లు దస్త్రాల్లో నమోదు చేశారు.

## ఎవరెవరు.. ఎక్కడున్నారో...?

అనకాపల్లి : కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా 26 నుంచి వృద్ధులు, దివ్యాంగులకు మరుసటి నెల రేషన్ సరకులను ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నారు. జిల్లా పరిధిలో నివాసం ఉంటున్న వృద్ధులు, దివ్యాంగుల చిరునామాలు దొరక్క రేషన్ డీలర్లు అవస్థలు పడుతున్నారు. వృద్ధాప్యం, వైకల్యంతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది సొంత చిరునామాల్లో కాకుండా బంధువుల ఇళ్లలో ఉంటున్నారు.

**ఇళ్ల చుట్టూ తిరుగుతున్నా..!**

రేషన్‌కార్డుల్లో పేర్కొన్న చిరునామాలకు డీలర్లు సరకులు తీసుకెళ్లి, అక్కడ లబ్ధిదారులు లేకపోవడంతో మళ్లీ వెనక్కి తీసుకురావాల్సి వస్తోంది. ఇలా ఒకటికి రెండుసార్లు తిరగడంతో సరకుల పంపిణీ పుంజుకోవడం లేదు.జిల్లా వ్యాప్తంగా 33,666 మంది దివ్యాంగులు, వృద్ధులు ఉన్నారు. వారికి జులై నెల సరకుల్ని జూన్ 26 నుంచే



పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 27,340 మందికి సరకులు చేరాయి. మిలిగిన 6326 మందికి చేరాల్సి ఉంది.

**ఇదీ పరిస్థితి..!**

పౌర సరఫరాల శాఖ సర్కిల్-1, సర్కిల్-2, సర్కిల్-3 పరిధిలో ఎక్కువ మంది చిరునామాలు దొరకడం లేదు. ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల పరిధిలో 90 శాతం మందికిపైగా సరకులు ఇచ్చారు.అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు కార్డుల్లో పేర్కొన్న చిరునామాల్లో ఉంటే.. డీలర్లు సరకులు తీసుకొచ్చి, వేలిముద్రల ఆధారంగా పంపిణీ చేస్తారని డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు తెలిపారు.

సరకుల పంపిణీకి గడువు ముగుస్తున్న నేపథ్యంలో... జిల్లాలో మిగిలి ఉన్న రేషన్ కార్డుదారులు ఈనెల 17వ తేదీ సాయంత్రంలోపు డిపోలకు వెళ్లి సరకులు తీసుకోవాలని డీసీఎస్ఓ సూచించారు.

## విద్యాసంస్థల్లో దాహం కేకలు..!

అనకాపల్లి : విద్యాలయాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండాలి. ముఖ్యంగా సురక్షిత మంచినీరు తప్పనిసరి. కానీ, పలు విద్యాసంస్థల్లో ఆ సౌకర్యం కనిపించడం లేదు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో రక్షిత మంచినీటి ప్లాంట్ల (ఆర్ఓ)ను దాతలు విరాళంగా ఇచ్చినా వినియోగంలోకి తీసుకురాలేక నిరుపయోగంగా ఉంచారు.

**రూ.2.36 కోట్లతో:** దివీస్ లేబొరేటరీ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.2.36 కోట్లతో 71ఆర్వో ప్లాంట్లను ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వితరణగా ఇచ్చింది. వీటిని గతేడాది డిసెంబరులో అందజేయగా ఇప్పటి వరకు విభాగాల్లో పూర్తి స్థాయిలో అమర్చలేదు. కొన్ని అలాగే



ఉంచేశారు. అమర్చిన తర్వాత ఏడాదిపాటు టాటా కంపెనీ నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. ఒక్కో ప్లాంటు ఏర్పాటుకు రూ.5వేల నుంచి రూ.10వేలు ఖర్చు అవుతుంది. ఈ మాత్రం భరించలేని స్థితిలో ఏయూ ఉందా అనే విమర్శలు వస్తున్నాయి.

ప్రస్తుతం అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహాలు, ఇతర వసతిగృహాలు, సైన్స్, కామర్స్, మహిళా ఇంజినీరింగ్ కళాశాల విభాగాల్లో ఆర్వోప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాల, గ్రంథాలయం, సెక్యూరిటీ విభాగం, ఏయూ వైద్య ఆరోగ్యశాలల్లో అమర్చాల్సి ఉంది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఆయా పనులు జరుగుతున్నాయి.

వేసవి సెలవుల అనంతరం ఈనెల 1న ఏయూ పునఃప్రారంభమైంది. ఇప్పటికే విద్యార్థులు వసతిగృహాలు, తరగతులకు హాజరవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ పెట్టి ఆర్వో ప్లాంట్లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

## పరిహారం.. పక్కా నాటకం

కోట కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా భారతమాల పరియోజన కింద నాయుడుపేట నుంచి తూర్పు కనుపూర్ వరకు 34.88 కిలోమీటర్లుకు ఆరు వరుసల సాగరమాల రోడ్డు పనులు రూ.961.20కోట్లతో రెండేళ్లుగా కొనసాగుతునే ఉన్నాయి. కోట మండలం రుద్రవరం, ఊనుగుంటపాళెం, చెందోడు, గూడలి, నెల్లూరుపల్లి, కొత్తపాళెం, సిద్ధవరం గ్రామాల మీదుగా చిల్లకూరు మండలం తూర్పుకనుపూర్ వరకు 16.5 కిలోమీటర్ల వరకు పనులు జరుగుతున్నాయి. 34.88కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి 1,300 మంది రైతులకు చెందిన 730 ఎకరాలు భూములు సేకరించారు. అందులో 630 ఎకరాలకు పరిహారం అందజేశారు. ఇంక వంద ఎకరాలకు పరిహారం అందాల్సి ఉంది.

**పనులు అడ్డుకున్నా..**

కోట మండలంలోని ఊనుగుంటపాళెం, చెందోడు, నెల్లూరుపల్లి, వీపీఅగ్రహారం గ్రామాల్లో 40 మంది రైతులకు పైగా పరిహారం అందాలి. నెలలు తరబడి తిరుగుతున్నా రాలేదు. దీంతో ఆగ్రహంతో రైతులు పలు పర్యాయాలు పనులు అడ్డుకున్నారు. ధర్నాలు, ఆందోళనలు, బైఠాయింపులు, నిరసనలు చేశారు. దీంతో జేసీ, సబ్‌కలెక్టర్, తహసీల్దారు జయజయరావు, రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించి అవసరమైన పత్రాలు లేక పరిహారంలో జాప్యం జరుగుతుందని విచారించి అందజేస్తామని సర్దుబాటు చేసి పనులు జరిగేలా చూశారు. కానీ నేటికీ పరిహారం అందలేదు.

కోట మండలం నెల్లూరుపల్లి పంచాయతీ పరిధిలోని వీపీ అగ్రహారంలో రామయ్యకు 82 సెంట్లు పట్టాభూమి ఉంది. సాగరమాల రోడ్డు నిర్మాణానికి ఈభూమిని సేకరించారు. సరైన పత్రాలు లేవనే కారణంతో ఇంత వరకు పరిహారం ఇవ్వలేదు. భూమి కోల్పోయి జీవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. వీపీ అగ్రహారానికి చెందిన మౌలమ్మకు చెందిన 42 సెంట్ల భూమిని సాగరమాల రోడ్డు నిర్మాణానికి సేకరించారు. పరిహారం ఇంత వరకు అందలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతుంది.

**అర్హులందరికీ అందజేస్తాం**

వీరికి భూములకు సంబంధించిన పత్రాలు లేవు. గ్రామసభలు నిర్వహించి పంచనామా చేసి రైతులను ఎంపిక చేశాం. త్వరలోనే అర్హులందరికీ పరిహారం అందుతుంది. రోడ్డు పనులు అడ్డుకోవడం చట్టరీత్యా నేరం.
జయజయరావు, తహసీల్దారు, కోట

## కొండల్ని కరిగిస్తారు.. మట్టిని తోడేస్తారు!



తాడిపత్రి : గత వైకాపా పాలనలో సహజ వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టిన అక్రమార్కులు మళ్లీ అదే తంతును కొనసాగిస్తున్నారు. తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు మండలాల్లో కొండలను తవ్వి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా పట్టపగలే సాగుతున్నా ఎవరికీ పట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాడిపత్రిలోని యర్రగుంటపల్లి, ఆవుల తిప్పాయపల్లి, ఆలూరు, గదరగుట్టపల్లి గ్రామాల్లో వందల ఎకరాల్లో కొండలు విస్తరించి ఉన్నాయి. వీటిల్లో కొన్ని చోట్ల జాతీయ రహదారి నిర్మాణ కోసం కొండల్లో మట్టిని తవ్వారు. అదే చోట అక్రమ వ్యాపారులు మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. రోజూ సుమారు 40 టిప్పర్ల మట్టిని అమ్ముకుంటున్నారు.ప్రధానంగా వెంచర్లకు, రైతులకు ఈ మట్టిని ఎక్కువ ధరకు విక్రయిస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. టిప్పర్ మట్టి రూ.6 నుంచి రూ.8వేల వరకు అమ్ముకుంటున్నారు. ఈ మట్టిని తాడిపత్రి పట్టణం, కడప, నంద్యాల జిల్లాలోని సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. రోజూ పట్టణంలో నుంచి ఇతర ప్రాంతాలకు తరలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**ఇసుక తీసుకెళ్లి.. మట్టిని తెస్తూ..**

యల్లనూరులోని చిత్రావతి నుంచి ఇసుకను యాడికి మండలంలోని పలు గ్రామాలకు తరలిస్తారు. అక్కడి నుంచి తిరిగి వచ్చేటప్పుడు చెరువు మట్టిని తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. ఈ అక్రమ రవాణా రోజూ ఉదయం సమయంలో తాడిపత్రి పట్టణం మీదుగానే సాగుతోంది. రోజూ సుమారు 20 టిప్పర్లు పైగానే ఇసుకను తీసుకెళ్లి, అక్రమంగా మట్టిని తెస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా భారీ వాహనాలు తిరగడంతో పట్టణంలోని యల్లనూరు రోడ్డు దెబ్బతింటోంది. అతివేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంచుతాం: సోమశేఖర్, తహసీల్దార్, తాడిపత్రి**

తాడిపత్రిలోని యర్రగుంటపల్లి, ఆవులతిప్పాయపల్లి గ్రామాల పరిధిలో ఉన్న కొండల వద్ద సిబ్బందితో పరిశీలించి నిఘా ఉంచుతాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే అటువంటి వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా ఎక్కడైనా చెరువులు, వంకల్లో మట్టిని తోడినా మైనింగ్ అధికారులకు తెలియజేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం.

## ఉపాధిలో ఆమే మేటి!



నక్కపల్లి : వలసల నివారణే లక్ష్యంగా ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదింటి గడపల్లో వెలుగులు నింపుతోంది. ముఖ్యంగా మహిళలకు ఈ పథకం వరప్రదాయినిగా మారింది. అందుబాటులోనే పని.. ఆశించిన స్థాయిలో కూలి లభిస్తుండటం శ్రామికులందరినీ మట్టిపనివైపు అడుగులు వేయిస్తోంది. ఫలితంగా జిల్లాలో ఏటా ఉపాధి పొందే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది.

పుష్కరకాలం క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ అందరికీ చేరువయ్యేలా చూస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రామికులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. అంతకుముందు స్థానికంగా పనులు అందుబాటులో లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. ఈ పథకం వచ్చిన తర్వాత మార్పు మొదలైంది. కాగా గతంతో పోల్చితే.. ప్రస్తుతం పనిలోకి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఏడాదికి ఓ జాబ్‌కార్డు ద్వారా వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమం అమలవుతుండగా, దీన్ని చాలామంది వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో చదువుకునే యువత సైతం పనిలోకి వస్తుండటం విశేషం. ప్రాంతాలవారీగా అనేక రకాల పనులు చేస్తున్నారు. ఇందులో సాగునీటి వనరుల అభివృద్ధి, నీటి నిల్వలు పెంచడం, పండ్ల తోటల పెంపకం, పూడిక తీతలు, పుంత రహదారుల అభివృద్ధి తదితర పనులు ఉన్నాయి. ఈ క్రమంలో గడచిన నాలుగేళ్లలో కూలీల సంఖ్య అంతకంతకు పెరిగింది. ఈ ఏడాది రెండు నెలల్లోనే రెండున్నర లక్షల మందికిపైగా పనుల్లో పాలుపంచుకున్నారు.

**మూడొంతులు మహిళలే**

జిల్లా ప్రస్తుతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. మగవారు బయటి పనులకు వెళ్లి సాయంత్రానికి తిరిగి వస్తుండగా, కుటుంబానికి చేదోడుగా మహిళలు ఉపాధి హామీని వినియోగించుకుంటున్నారు. ఈ కారణంగా మగవారికంటే ఆడవారే అధికంగా పనులకు వస్తున్నారు. ప్రతిచోటా మూడొంతులకు పైగా వీరే ఉంటున్నారు. దీనికి తోడు తక్కువ సమయంలో నిర్దేశించిన పనిని కూలీలంతా కలిసి చేస్తుండటం వారికి బాగా లాభిస్తోంది. గతంతో పోల్చితే ప్రస్తుతం వేతనాలు బాగా పెరిగాయి. ప్రస్తుతం రోజుకు రూ. 307 ఇస్తుండగా, చాలామంది రూ. 300 వరకు పొందుతున్నారు. తద్వారా నెలకు రూ. 7 వేల వరకు సంపాదిస్తున్నారు.

**ఆర్థికాభివృద్ధికోసం**గతంతో పోల్చితే ఇప్పుడు ఉపాధి పనికి వచ్చే వారి సంఖ్య పెరిగిందనడంలో సందేహంలేదు. యువత చదువుకుంటూనే అవకాశం ఉన్న సమయాల్లో పనిలోకి వస్తున్నారు. ఈ వేతనంతో వీరి చదువు అవసరాలను తీర్చుకుంటున్నారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద ఉండే మహిళలు పనిలోకి రావడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తద్వారా కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తున్నారు.
డీవీ యరకయ్య, ఏపీడీ, ఇన్‌ఛార్జి

## పోలవరం మట్టి.. దర్జాగా కొల్లగొట్టి..

ఏలేశ్వరం : ఇన్నాళ్లు కొండలు, గుట్టలను నేలమట్టం చేస్తూ సొమ్ము చేసుకున్న ప్రబుద్ధులు ఇప్పుడు తమ స్వార్థానికి ఏకంగా జాతీయ ప్రాజెక్ట్ పోలవరాన్నే ఎన్నుకోవడం గమనార్హం. గుట్టచప్పుడు కాకుండా పోలవరం మట్టిని కొల్లగొడుతున్నారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి మీదుగా వెళుతున్న పోలవరం కాలువ గట్టును అక్రమార్కులు మాయం చేస్తున్నారు. అనధికారికంగా రేయింబవళ్లు తవ్వకాలు జరుగుతున్నా.. రాజకీయ ఒత్తిడితో అధికారులు ఆ దిశగా కన్నెత్తి చూడడంలేదు. ఈ వైఖరే కొందరికి ఆడింది ఆటగా మారింది. అడ్డూఅదుపు లేకుండా యంత్రాలతో తవ్వేస్తూ వాహనాల్లో తరలించేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలవరం, రెవెన్యూ తదితర శాఖలు పట్టనట్టే ఉంటున్నాయి.



**రూ.లక్షల్లో వ్యాపారం**

గతంలో పోలవరం కాలువ నిర్మాణ సమయంలో వచ్చిన మట్టిని సమీపానే వేసి గట్టుగా రూపొందించారు. ఈ మట్టి కృత్రిమ కొండలను తలపిస్తుంది. మట్టిపై కన్నుపడిన కొందరు ఏ విధమైన అనుమతులు లేకుండా అమ్ముకుంటూ రూ. లక్షలు గడిస్తున్నారు. మట్టిని ఇటుక బట్టీలు, లేఔట్లు, ఇళ్ల పునాదుల్లో నింపేందుకు విక్రయిస్తున్నారు. పొలం మట్టి గృహ నిర్మాణాల్లో పునాదుల్లో వేస్తే చెడ పడుతుంది. ఈ సమస్యతో పోలవరం మట్టికి గిరాకీ పెరిగింది. పోలవరం మట్టి నాణ్యమైంది కావడంతో ధరకు రెక్కలు వచ్చాయి. భారీ టిప్పర్ మట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఉంది. రోజూ పెద్ద సంఖ్యలో టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు మన్నును రవాణా చేస్తూ రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు.

**భవిష్యత్తుకు నష్టాలు**

పోలవరం కాలువలకు చెంతనే ఉన్న గట్లు రక్షణ కవచంలా ఉంటాయి. నిర్మాణ సమయంలో వచ్చిన మట్టిని గట్టుగా అక్కడే నిల్వ చేశారు. ఏళ్ల కిందట మట్టిని వేయడంతో కొండలుగా దర్శమిస్తున్నాయి. ఈ గట్టే పోలవరం కాలువకు శ్రీరామరక్ష. భవిష్యత్తులో నీరు ప్రవహించే సందర్భాల్లో ఈ గట్టు ఉంటేనే కాలువ పటిష్టంగా ఉంటుంది. లేని పక్షంలో గండ్లు పడే ప్రమాదం ఉంటుంది. మట్టి తవ్వేస్తుండడంతో సమీప ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వారికి రక్షణ ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న పోలవరంలోని ప్రతీ విభాగాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు.. ఇలా యథేచ్ఛగా బరితెగించి కబ్జా చేస్తున్నా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా రెవెన్యూ, పోలవరం అధికారులు అక్రమ తరలింపు, తవ్వకా లను నిరోధించాల్సిన అవసరం ఉంది. భారీ వాహనాల తాకిడితో రహదారులు ధ్వంసమవుతున్నాయి. అధికారులు ఇకనైనా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అడ్డగోలుగా తవ్వేశారు..!

రాజమహేంద్రవరం: వైకాపా జమానాలో దోచుకోవడమే లక్ష్యంగా విధివిధానాలు, నిబంధనలు పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేశారు. తమకు నచ్చిన సంస్థలను గుత్తేదార్లుగా నియమించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ జమానాలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వ అయిదేళ్ల కాలంలో జేపీ వేంచర్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు చేయగా, జిల్లా పరిధిలోని 14 ప్రాంతాల్లో 30 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వినట్లు నిర్ధారించారు. ఈ మేరకు ఏపీ స్టేట్ అప్లికేషన్ సెంటర్ (ఏపీసాక్) నివేదిక ఇచ్చింది. ప్రధానంగా కడియం, సీతానగరం, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల్లో తవ్వకాలు చేసినట్లు నిర్ధారించారు. దీనికి సంబంధించి ఇప్పటికే సంబంధిత సంస్థకు భూగర్భ గనుల శాఖ నోటీసులు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**కదలని యంత్రాంగం**



ఇసుక తవ్వకాల విషయంలో ఓ అధికారిణి పెద్ద ఎత్తున లబ్ధి పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. జలవనరుల శాఖ అధికారులు అయితే కళ్లెదుటే డ్రెడ్జింగ్ చేసి ఇసుక తరలిస్తున్నా..అనుమతులున్నాయని అడ్డగోలుగా బుకాయించి అక్రమార్కులకు వత్తాసు పలికారు. భూగర్భ గనుల శాఖ అధికారులు సైతం తవ్వకాలతో మాకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించారు.

**చర్యలకు రంగం సిద్ధం..**

గత ప్రభుత్వ హయాంలో నదీ పరివాహక, ఎన్‌జీటీ, పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కి ఇసుక తవ్వకాలు చేసిన సంస్థతోపాటు, అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైనంపై కూటమి ప్రభుత్వం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా భూగర్భగనుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## జలం.. ప్రత్యామ్నాయమే శరణ్యం

శ్రీకాళహస్తి : శ్రీజ్ఞానప్రసూనాంబికతో పాటు శ్రీకాళహస్తీశ్వరునికి నిత్యం అభిషేక నిర్వహణకు సూర్యపుష్కరిణి జలాన్ని మాత్రమే వినియోగిస్తుంటారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం ఏళ్ల తరబడి అలాగే నిర్వహిస్తూ వచ్చారు. ఎంతటి దుర్భిక్ష పరిస్థితులు ఎదురైనప్పటికీ ఇక్కడి బావిలో నీరు మాత్రం అందుబాటులో ఉంటూ వచ్చింది. ప్రస్తుతం నీటి నిల్వలు అందని కారణంగా చంద్రపుష్కరిణి నీటితో అభిషేకాలు చేపట్టాల్సి వస్తోంది.

**ప్రాశస్త్యం.. ఎంతో వైభవం..:** ముక్కంటి ఆలయానికి సంబంధించి కైంకర్యాలు, అభిషేకాల నిర్వహణ ఇక్కడి ఆలయ సంప్రదాయాల ప్రకారం నిర్వహిస్తూ వస్తున్నారు. సన్నిధివీధిలోని శ్రీసూర్యనారాయణ మూర్తి ఆలయాన్ని ఆనుకుని ఉన్న సూర్యపుష్కరిణి జలాలను అభిషేక



సేవలకు వినియోగిస్తుంటారు. ఇక ప్రసాదాల తయారీ కోసం ఈ బావికి ఎదురుగా ఉన్న చంద్ర పుష్కరిణి నీటిని వాడుతుంటారు. ఇవి రెండు అందుబాటులో లేని పక్షంలో ముక్కంటి ఆలయంలోని సరస్వతీ బావి నుంచి నీటిని అభిషేకాలకు వినియోగించేలా అప్పట్లోనే ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయితే ప్రస్తుతం దీర్ఘకాలంగా చంద్ర పుష్కరిణి నీటితో అభిషేకాలు జరుపుతున్నారు.

**సూర్యపుష్కరిణిపై అశ్రద్ధ..**

ముక్కంటి ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు నిత్య అభిషేక జలాల కోసం ఏర్పాటు చేసిన సూర్య పుష్కరిణి విషయంలో అశ్రద్ధ స్పష్టంగా కన్పిస్తోంది. పుష్కరిణిలో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టని కారణంగా నీటి ఊట తగ్గిపోయింది. పాతిక అడుగుల దూరంలో ఉన్న సువర్ణముఖి నదికి నిండుగా నీటి ప్రవాహం వచ్చినా ఇక్కడి పుష్కరిణిలోకి నీళ్లు చేరకపోవడం గమనార్హం. మళ్లీ ఊట నిల్వలు సమృద్ధిగా చేరే విధంగా ఇక్కడి పుష్కరిణిని అభివృద్ధి పరిచి నిత్యం ఇక్కడి జలాలతో అభిషేకాలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

## 'గుట్ట'క్కుమంటున్నా గప్‌చుప్!

తిరుపతి: వైకాపా హయాంలో ప్రకృతి వనరులను కొల్లగొట్టిన అక్రమార్కులు కూటమి పాలనలోనూ చెలరేగుతున్నారు. కొన్నిచోట్ల ఫ్యాను పార్టీ నుంచి వలస వచ్చిన నేతలు దందాకు పాల్పడుతుండగా మరికొన్నిచోట్ల అధికార బలంతో స్థానిక నాయకులే రంగంలోకి దిగారు. తిరుపతి జిల్లాలో ప్రధానంగా రేణిగుంట మండలంలో, చిత్తూరు జిల్లా పాలసముద్రంలో కనిపించిన చెరువులు, కొండలు, గుట్టలను కొల్లగొట్టి మట్టిని అమ్ముకుంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా హయాంలో ఓ నాయకుడు రేణిగుంటను కేంద్రంగా చేసుకుని మట్టి అక్రమ రవాణాకు దిగాడు. మల్లెమడుగు సమీపంలో ఓ కొండనే గుటుక్కుమనిపించాడు. ఎన్నికలకు ముందు తెదేపాలో చేరిన ఈయన కీలక ప్రజాప్రతినిధి అనధికారిక పీఏతో జత కట్టి సహజ సంపద కొల్లగొడుతున్నారు.

**రోడ్డు వేసి.. వాహనాల రాకపోకలు**

రేణిగుంట మండలంలోని మల్లెమడుగు వెనుక భాగంలోని కొండను వైకాపా హయాంలో ఛిద్రం చేసి గ్రావెల్ తవ్వించిన నేత.. ఇప్పుడు రెండో కొండపై పడ్డారు. టిప్పర్లు వెళ్లేందుకు వీలుగా జలాశయంలోకి నీరు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా రోడ్డు వేశారు. రాత్రంతా వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. ఇలా ఒక్కపూటే దాదాపు 100 టిప్పర్ల గ్రావెల్.. చెన్నై, తిరుపతి నగరంలోని వెంచర్లకు తరలుతోంది. ఒక్క ట్రిప్పునకు రూ.30వేలు వసూలు చేస్తున్నారు. ఒక్క రాత్రి సంపాదనే రూ.30 లక్షలు ఉందంటే ఏవిధంగా అక్రమ రవాణా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇందులో కీలక ప్రజాప్రతినిధికీ వాటాలు అందుతున్నాయి.

## తగ్గిన వరద.. తొలగని వెత

పి.గన్నవరం: లంక భూముల్లో కూరగాయలు, ఇతర పంటలు విస్తారంగా పండే రోజులివి. ఇదే సమయంలో గోదావరికి వరదలు వస్తుండటంతో ఏటా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కోనసీమతో పాటు సరిహద్దులోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన లంకభూముల్లో విస్తారంగా కూరగాయలు పండిస్తారు. గోదావరి వరదల సమయంలో ఈ ఉత్పత్తులను బయటకు తీసుకురావడానికి వ్యయప్రయాసకు గురవుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4 వేలు, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆనగార్లంక, పెదమల్లంక, అయోధ్యలంక, మర్రిమూల, పెదలంక, కనకాయలంక, పుచ్చల్లంక, రావిలంక, నక్కిడిలంక తదితర గ్రామాల్లో మరో మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలతో పాటు తమలపాకు సాగు చేస్తుంటారు.

**ముంపుబారిన తోటలు**

కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యేకించి లంకభూముల్లో సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు ఉత్పత్తి అవుతాయి. సరిహద్దులోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన లంకభూముల్లో సుమారు 45 వేల మెట్రిక్‌టన్నుల కూరగాయలు పండిస్తారు. గోదావరి వరద ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి రెండో ప్రమాద హెచ్చరికకు చేరుకుంటే ఈ భూముల్లో తోటలు పూర్తిగా ముంపుబారిన పడతాయి. ఈ నెల 13న బ్యారేజీ నుంచి అత్యధికంగా



6,56,341 క్యూసెక్కులు సముద్రంలోకి విడిచిపెట్టారు. దీంతో పలుచోట్ల నదీపాయలకు అనుబంధంగా ఉన్న పాయల్లోకి నీరుచేరి బాటలు తెగిపోయాయి. ప్రస్తుతం మరపడవల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. లంకరైతులు పండించిన వివిధ ఉత్పత్తులను రేవుల వరకు మోసుకొచ్చి అక్కడ పడవల్లో ఎక్కించి తిరిగి ప్రధాన రహదారుల చెంతకు చేర్చి అక్కడి నుంచి పి.గన్నవరం, రాజోలు, రావులపాలెం, అమలాపురం, పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతం తదితర మార్కెట్లకు తరలించేందుకు నానాయాతన పడుతున్నారు. ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి.

**నదీపాయల్లో తగ్గిన ఉధృతి**

ప్రస్తుతం వరద గణనీయంగా తగ్గింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 1,59,747 క్యూసెక్కులు సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ దిగువన ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయల్లో ఉరవడి తగ్గింది. కొన్నిచోట్ల ఇసుకతిన్నెలు బయటకు కనిపిస్తున్నాయి. ఖరీఫ్ సాగు, తాగునీటి అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5 వేలు, మధ్యడెల్టాకు 2,600, పశ్చిమడెల్టాకు 6,800 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నారు.

## ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు!

రాజమహేంద్రవరం : మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు.. వ్యసనాలు తదితర కారణాలతో ఉమ్మడి జిల్లాల్లో క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీనిని త్వరగా గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా జీవితాలను నిలబెట్టొచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నా అవగాహన లేమి, ఖర్చుతో కూడుకున్న పని అనుకుని ముందస్తు పరీక్షలకు ఎవరూ చొరవ చూపడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఎన్‌సీడీ 3.0(అసంక్రమిత వ్యాధులు) సర్వే చేపడుతోంది. వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్నారు.

**70 శాతానికి పైగా మహిళల్లోనే..**

తూర్పుగోదావరి జిల్లాలో 931 క్యాన్సర్ కేసులు ఉన్నాయంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. 70 శాతానికి పైగా మహిళలే క్యాన్సర్ బాధితులు



కావడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్‌సీడీ సర్వేలో కొత్తగా 189 మందికి క్యాన్సర్ లక్షణాలున్న సిబ్బంది గుర్తించి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్‌కు రిఫర్ చేశారు. వీరిలో 92 మంది మాత్రమే ఆసుపత్రికి రాగా మిగిలిన వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినట్లు సమాచారం.

**అందుబాటులో వైద్యం**

ఉమ్మడి జిల్లాలో నోటి, గొంతు, రొమ్ము, థైరాయిడ్, సంబంధిత క్యాన్సర్ కేసులు అధికంగా వస్తున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ జీజీహెచ్‌ల్లో క్యాన్సర్ చికిత్స అందుబాటులో ఉంది. శస్త్రచికిత్సలు సైతం జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ వైద్యులున్నారు. ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ నడుస్తోంది. క్యాన్సర్ ఓపీ నెలకు 300 వరకు ఉంటోంది. ఇందులో 100 వరకు కొత్త కేసులే ఉంటుండడం గమనార్హం. ఈ విభాగం ఇటీవలే ప్రారంభమైనా ఇప్పటికే 80 వరకు శస్త్రచికిత్సలు జరిగాయి. మ్యామోగ్రఫీ స్కాన్ సైతం పొరుగుసేవల ప్రాతిపదికన జరుగుతోంది.

**జిల్లాలో కేసులు:**

నోటి క్యాన్సర్: 174

రొమ్ము: 452

సర్వైకల్: 305

ఈ లక్షణాలు గమనించాలి..

శరీరంపై కాయ మాదిరి వస్తే గమనించుకోవాలి.

ఏదైనా మింగలేకపోవడం, దగ్గు తగ్గకపోవడం ఉంటే పరీక్షలు చేయించుకోవాలి.

తీవ్ర రక్తహీనత, ఒకేసారి బరువు తగ్గినా, చర్మం రంగు మారినా పరిశీలన చేసుకోవాలి.

'ఉమ్మడి జిల్లాలో మూడు రకాల క్యాన్సర్ లక్షణాలున్న కేసులు పెరుగుతున్నాయి. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలున్న వారు ఎక్కువగా ఓపీకి వస్తున్నారు. చాలా మంది వ్యాధి ముదిరిన తరువాతే ఆసుపత్రికి వస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కొన్ని క్యాన్సర్ చికిత్సలకు ప్రభుత్వం ఉచితంగా సేవలందిస్తుంది.' అని రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆంకాలజిస్టు సమీరజా అన్నారు.

## కాలుష్యం చిమ్ముతున్న డంపింగ్ యార్డు



అనంతపురం : నగరపాలక సంస్థ డంపింగ్ యార్డు నిత్యాగ్ని హోత్రంలా మండుతూ కాలుష్య కుంపటిగా మారింది. గుట్టలుగా పేరుకుపోయిన చెత్త నిత్యం తగలబడుతుండటంతో దట్టమైన పొగ చుట్టుపక్కల కాలనీలను కమ్మేస్తోంది. లెక్చరర్స్ కాలనీ, రాజీవ్‌కాలనీ, రీక్లమేషన్ కాలనీ, చర్చికాలనీ, హెచ్చెల్సీకాలనీ, ఎర్రనేలకొట్టాల, మార్కెట్ యార్డు, గుత్తిరోడ్డు ప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 20 వేల మంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

డంపింగ్ యార్డు సమీపంలో పలు విద్యాసంస్థలు ఉండటంతో విద్యార్థులు చదువుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు.

అనంతపురం–గుత్తి మార్గాన్ని పొగ కమ్మేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలులు ఎక్కువగా ఉన్న సమయంలో యార్డు నుంచి వెలువడే పొగ తీవ్రత అధికంగా ఉంటోంది. కొన్నిసార్లు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. స్థానికులు, వాహనదారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నగరపాలిక అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నాలుగు దశాబ్దాల కిందటిదే..**

గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డును సుమారు 40 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. అప్పట్లో జనావాసాలు లేకపోవడంతో ఇబ్బంది ఉండేది కాదు. నగర జనాభా రోజురోజుకు పెరిగిపోవడంతో 120 నుంచి 140 మెట్రిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుతం డంపింగ్ యార్డులో 1.68 లక్షల టన్నుల చెత్త ఉన్నట్లు అధికారులు తేల్చారు. బయోమైనింగ్ ద్వారా తొలగించాల్సి ఉన్నా పనులు ముందుకు సాగడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో అరకొరగా చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారు ఇంకా పనులు మొదలుపెట్టలేదు.

**అనర్థాలు అనేకం..**

యార్డులోని ప్లాస్టిక్ వ్యర్థాలు మండటం వల్ల విషపూరిత రసాయనాలు గాల్లో కలిసిపోయి వాయు కాలుష్యానికి దారి తీస్తోంది. మరోవైపు శ్వాసకోశ, చర్మ సంబంధ వ్యాధులు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హానికర వాయువులు పీల్చితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

**తలుపులు, కిటికీలు తెరిచే పరిస్థితి లేదు: జి. కిష్టప్ప, విశ్రాంత ఆర్‌ఐ, లెక్చరర్స్ కాలనీ**

డంపింగ్ యార్డు కారణంగా వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. ఉదయాన్నే పొగంతా ఇళ్లలోకి వస్తోంది. కిటికీలు, తలుపులు పూర్తిగా బంధించుకోవాల్సి వస్తోంది. 17 సంవత్సరాలుగా ఇబ్బంది పడుతునే ఉన్నాం. ప్రస్తుతం నగరం విస్తరించిన తరుణంలో డంపింగ్ యార్డును తరలిస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

## బడి భళా.. భవితకు భరోసా!




పెనుకొండ : పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేవి పాఠశాలలు. విజ్ఞానం పెంపొందించుకోవడానికి వేసే తొలి అడుగు ఇక్కడే ఆరంభమవుతుంది. అలాంటి బడుల్లో సకల సౌకర్యాలు, భద్రత ఉంటేనే విద్యార్థులకు మనుగడ ఉంటుంది. ఇప్పటికీ పలు పాఠశాలలు సమస్యల వలయంలోనే ఉన్నాయి. కొన్ని మాత్రం అన్ని విధాలా అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలుస్తున్నాయి. నేడు పాఠశాల భద్రత, ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొన్ని ప్రభుత్వ బడులపై స్ఫూర్తిదాయక కథనం.

**ప్రత్యేక నిఘా, వైద్యసేవలు**

మండలంలోని గుట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాల భద్రతకు దాతల సహకారంతో హెచ్ఎం నాగార్జునుడు ఏడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. కిచెన్‌షెడ్ నిర్మించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ప్రతి గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ద్వారా విద్యార్థులకు పరీక్షలు చేయిస్తున్నారు. బాలికలకు అవసరమైన రుతు రుమాళ్లు అందుబాటులో ఉంచారు. ఇక్కడ 221 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

**రాయలుకు తగ్గట్లుగా ఏఎస్సీ..**

అనంత జిల్లా కేంద్రంలోని ఏఎస్సీ పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోంది. అరవిందనగర్‌లో శ్రీకృష్ణదేవరాయ నగరపాలకోన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ 738 మంది విద్యార్థులున్నారు. పెద్ద ప్రహరీతోపాటు పది తరగతి గదులున్నాయి. నాణ్యమైన భోజనం, శుద్ధజలాలు కోసం వాటర్‌ప్లాంట్ ఉంది. 19 మంది ఉపాధ్యాయులు, ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. 10 డిజిటల్ తరగతులు, ఒక వర్చువల్‌గది ఉంది. ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

**బుళ్లసముద్రం.. ఆదర్శం**

మడకశిర మండలం బుళ్లసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. 330 మంది అభ్యసిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ సొంత నిధులతో గ్రిల్స్‌తో భోజనశాల, విద్యార్థులకు ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేశారు. ఎక్కడా లేని విధంగా బాలికలకు విశ్రాంతి గది ఉంది. ప్రతి తరగతి గది ముందు తాగునీటి క్యాన్లు ఉంచారు. బడి చుట్టూ ప్రహరీ ఉంది. గోడలపై ఉన్న జాతీయ నాయకుల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

**రుచికర భోజనం.. అందుబాటులో ఔషధాలు**


రవకొండలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థినులు ఉన్నారు. బడి చుట్టూ ప్రహరీ ఉంది. భద్రతాపరంగా సమస్యలు లేవు. ప్రాంగణంలో పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. విధిగా మెనూ పాటిస్తూ నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ప్రాథమిక వైద్యానికి సంబంధించిన మందులను అందుబాటులో ఉంచారు. విద్యార్థినుల సంఖ్యను అనుగుణంగా మరుగుదొడ్లు ఉన్నాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు.

## 'కురవని వానలు'.. కదలని ఖరీఫ్

అనకాపల్లి : మేలో ఎండలు మండిపోతాయి. అటువంటిది ఈ ఏడాది ఆ నెలలో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లగా సాగిపోయింది. వేసవి వేడి అంతగాలేదని సంబరపడిన జిల్లావాసులకు మూడు రోజులుగా కాస్తున్న ఎండలు దారితెస్తున్నాయి. సాధారణంగా జిల్లాలో జులై రెండోవారంలో వర్షాలు ప్రారంభమవుతాయి. వాతావరణం చల్లబడుతుంది. అటువంటిది ఈసారి అటు ఇటు అయిందని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో ఖరీఫ్ పనులు ముందుకు సాగడం లేదు.

జిల్లాలో ఏటా 85,857 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తారు. దీనిలో వరి ఒక్కటే 54,493 హెక్టార్లు. జిల్లాలో అధికశాతం భూములు వర్షాధారంగానే సాగవుతుంటాయి. మేలో కురిసిన వర్షాలకు చాలామంది రైతులు వేసవి దుక్కులు చేసుకుని భూమి సిద్ధం చేసుకున్నారు. వరి పండించేవారంతా దాదాపుగా విత్తనాలు కొనుగోలు చేసి అనువైన పరిస్థితుల కోసం వేచి చూస్తున్నారు. కొందరు బోర్లు, బావులు ఉన్న ప్రాంతాల్లో నారు పోశారు. కానీ ఎండవేడికి నారు దెబ్బతింటోందని రైతులు తెలిపారు. జిల్లా మొత్తంమీద వరి సాధారణ విస్తీర్ణంలో కేవలం 15 శాతం మాత్రమే ఇంతవరకు నాట్లు పడినట్లు అంచనా.

ఇటీవల నాటిన చెరకు తోటలు నీరు లేక ఎండిపోతున్నాయి. కుంద్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, గొబ్బూరు, అమీన్‌సాహెబ్‌పేట, నర్సింగబిల్లి, నాగవరం ప్రాంతాల్లోని 350 ఎకరాల్లో చెరకు తోటలు ఎండిపోయాయి. అనకాపల్లి, తీడ, సుందరయ్యపేట, నాగులపల్లి, మూలపేట గ్రామాల్లో కూరగాయలు ఎక్కువగా సాగు చేస్తారు. కూరగాయలకు మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నా నీటి తడులు ఇవ్వకపోవడంతో వంగ, బీర, దొండ పంటలు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గిపోయాయని రైతులు తెలిపారు. సరుగుడు మొక్కలు తోటలు ఎండవేడిని తట్టుకోలేక మొక్కలు చనిపోతున్నాయి. కష్టపడి తడులిద్దామన్నా నూతుల్లో నీరు అడుగంటింది.



చెరువులు, కాలువలు జలం జాడలేక వెలవెల బోతున్నాయి. బోర్ల నుంచి తక్కువ నీరు వస్తోందని అనకాపల్లికి చెందిన రైతులు రామకృష్ణ, మునినాయుడు తెలిపారు.

**ఆందోళన వద్దు :** రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈవారంలో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని పరిశోధన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త గౌరి తెలిపారు. రుతుపవనాలు త్వరగా వచ్చాయన్నారు.

**వేసవిని తలపిస్తున్న ఎండలు**

జులై నెలలో సాధారణ ఉష్ణోగ్రతలు 34 నుంచి 35 సెల్సియస్ డిగ్రీలు ఉండాలి. ప్రస్తుతం 37 నుంచి 38 డిగ్రీల వరకు నమోదవుతోంది. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సోమవారం 37.8, 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికంగా ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మే నెలలో సాధారణ వర్షపాతం కంటే 45 శాతం ఎక్కువగా పడింది. జూన్‌కు వచ్చే సరికి సాధారణం 130 మిల్లీమీటర్లు కాగా 127 మి.మీ. కురిసింది. ఈనెలలో సాధారణ వర్ష పాతం 170 మిల్లీమీటర్లు కాగా... ఇంతవరకు కేవలం 23 మిల్లీమీటర్లు నమోదైంది.

## మిషన్ అన్వేషణ్!

ఒంగోలు : భూగర్భంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిక్షేపాలు న్యాయన్న ఉద్దేశంతో ఓఎన్‌జీసీ ఆదేశాల మేరకు జిల్లాలోని సముద్ర తీర మండలాల్లో 'మిషన్ అన్వేషణ్' పేరుతో క్షేత్రస్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టారు. సర్వే విజయవాడ నుంచి తిరుపతి జిల్లా సూళ్లూరుపేట వరకు చేపట్టేవిధంగా ప్రణాళిక రూపొందించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తొలి విడతగా ఈ ఏడాది ఫిబ్రవరిలో కొరిశపాడు మండలం పమిడిపాడులో ప్రారంభం కాగా అనంతరం అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని వ్యవసాయ భూముల్లో పరీక్షల నిర్వహణ పూర్తి చేశారు. తాజాగా ఒంగోలు మండలంలోని గ్రామాల్లో పరీక్షలకు శ్రీకారం చుట్టారు. మండలానికి రెండు, మూడు చొప్పున గ్యాస్ నిక్షేపాలున్నా సమీప అవసరాలకు వినియోగించవచ్చునన్నదే ఓఎన్‌జీసీ ఉద్దేశం. తద్వారా వినియోగదారులపై ఆర్థిక భారం తగ్గనుంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో మట్టి పరీక్షల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. శాటిలైట్ ఆధారంగా 2డీ సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా 80 అడుగుల లోతున డ్రిల్లింగ్ చేసి భూమిలోని మట్టిని సేకరిస్తున్నారు. నమూనాలను ఢిల్లీలోని ఓఎన్‌జీసీ పరిశోధన కేంద్రానికి పంపిస్తున్నారు. అక్కడ ప్రాథమికంగా నిర్ధారణ పూర్తికాగానే 3డీ పరీక్షలు నిర్వహించనున్నారు. తద్వారా భూగర్భంలోని నిక్షేపాలను వెలికి తీసి స్థానిక అవసరాలకు వినియోగించనున్నారు.



**పరీక్షలు పునఃప్రారంభం**

గ్యాస్, పెట్రోల్, డీజిల్, క్రూడాయిల్ నిక్షేపాల పేరుతో ఒంగోలు మండలం చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో ఈ నెల 12న డ్రిల్లింగ్ సాయంతో ప్రత్యేక బృందాలు పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అందుకు అవసరమైన విస్తీర్ణంలో ముందస్తుగా జెండాలు పాతారు. భూముల్లో డ్రిల్లింగ్ నిమిత్తం పరికరాలతోపాటు ట్రాక్టర్లను తరలించారు. సమాచారం తెలుసుకున్న ఆయా గ్రామాల రైతులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పరీక్షలను అడ్డుకున్నారు. దీంతో ఓఎన్‌జీసీ అధికారులు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నను కలిసి అనుమతి పత్రాలు చూపడంతో పరీక్షలకు అనుమతి ఇచ్చారు. ఇందుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూశాఖాధికారులు సహకరించేవిధంగా ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఓఎన్‌జీసీ అధికారులు సర్వేను పునఃప్రారంభించారు. ఒంగోలు మండలంలో సర్వే పూర్తయిన అనంతరం టంగుటూరు, జరుగుమల్లి, పొన్నలూరు, సింగరాయ కొండ మండలాల్లోనూ పరీక్షలు నిర్వహించేవిధంగా ప్రణాళికలు రూపొందించినట్లు ఓఎన్‌జీసీ అధికారులు తెలిపారు.

## గురి తప్పిన డ్రా'గన్'

కనిగిరి : ఎన్నో పోషక విలువలున్న డ్రాగన్‌ఫ్రూట్ సాగు నష్టాల బాట పట్టింది. ఏటా లాభాలందించే పంట ప్రస్తుతం ధరలేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏ పంటకు నష్టం వాటిల్లినా డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేసి రైతులు ఆదాయం పొందేవారు. అలాంటిది ఎన్నడూ లేనివిధంగా బహిరంగ విపణిలో ధరలేక, కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రాక చెట్లపైనే మగ్గిపోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలోని కనిగిరి, హనుమంతునిపాడు, పొన్నలూరు, గిద్దలూరు, దర్శి, తదితర ప్రాంతాల్లో సుమారు వంద ఎకరాలకుపైగా డ్రాగన్ ఫ్రూట్ సాగవుతోంది. ఒక్క ఎకరా సాగు చేయాలంటే సుమారు రూ. 4 లక్షల వరకు ఖర్చవుతుంది. జూన్



నుంచి నవంబరు వరకు కాపు కాసే ఈ పంట ఎన్నడూ లేనివిధంగా ఎకరాకు 10 టన్నుల వరకు తైవాన్ పింక్ రకం దిగుబడి వచ్చింది, ప్రస్తుత సీజన్‌లో కిలో ధర రూ.150 నుంచి రూ.200 వరకు పలకాల్సి ఉండగా రూ. 50కు పడిపోయింది. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ముందుగానే వ్యాపారులు కొనుగోలు చేసేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేకుండాపోయింది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి డ్రాగన్ ఫ్రూట్ రావడంతో జిల్లా దిగుబడులకు గిరాకీ లేకుండాపోయింది. కనీసం మన మార్కెట్లో కూడా ధర లేక కొనుగోలు చేసేవారు కనిపించక ఏం చేయాలో అర్థంకాక పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఉద్యానవనశాఖ ఏడీ గోపీచంద్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి దిగుబడులు రావడంతో స్థానిక దిగుబడుల ధర తగ్గిందని, రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నారు.

## వైద్యసేవల్లో లోపం... వేదనలో కార్మిక లోకం!

ఒంగోలు : ఈఎస్ఐ పరిధిలోని కార్మికులకు వైద్యసేవలు నామమాత్రంగా మారాయి. ప్రతినెలా వేతనంలో ఈఎస్ఐ వాటా చెల్లిస్తున్నా జరుగుతున్న వైద్యసేవలకు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లక తప్పడం లేదు. కార్మికుల సంఖ్య పెరుగుతున్నా వారికి వైద్యసదుపాయాలు విస్తరించడంలేదు. కేవలం జిల్లాలో మూడు డిస్పెన్సరీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గతంలో ఒంగోలు, మార్కాపురం, చీమకుర్తిలో ఈఎస్ఐ క్లినిక్‌లు ఉండగా, ప్రస్తుతం ఒంగోలులో మాత్రమే కొనసాగుతోంది. మిగిలినవి ఆరేళ్ల కిందటే మూతపడ్డాయి. ఒంగోలు నగరంలో ఉన్న డిస్పెన్సరీ ఆన్‌లైన్ క్లెయిమ్‌లు, మెటర్నిటీ లీవు సర్టిఫికెట్లు ఇవ్వడానికే ఉపయోగపడుతోందే తప్ప అనారోగ్య సమస్యలకు సాంత్వన కలిగించడంలేదు. పూర్తిస్థాయిలో మందులు ఉండక వెళ్లినవారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. జిల్లాలో సుమారు 40 వేల మంది ఈఎస్ఐ కార్డుదారులుండగా, వారిలో 13 వేల మంది ఒంగోలు నగరంలోనే ఉంటున్నారు. రూ.10 వేల నుంచి 24 వేలు వేతనం పొందే వారు చాలా మంది పనిచేస్తున్నారు. ఎక్కువ మంది చిరుద్యోగులే ఉన్నారు. తమ వేతనంలో నెలకు రూ.75లు చొప్పున చెల్లిస్తుండగా, వారు పనిచేసే యాజమాన్యసంస్థ కొంత వాటా కలిపి ఈఎస్ఐకి జమచేస్తుంది. ఈ విధంగా నెలకు రూ.కోట్లలో చెల్లిస్తున్నారు.

## ఓవర్ నైట్ స్టార్‌డం.. ఈమె కొత్త నేషనల్ క్రష్

ఒకప్పుడు సినిమాలు హిట్ అయితే హీరోయిన్స్‌కి సోషల్ మీడియాలో పాపులారిటీ దక్కేది. కానీ ఇప్పుడు సోషల్ మీడియాలో పాపులారిటీ దక్కించుకున్న తర్వాత హీరోయిన్స్ అవుతున్నారు. సినిమాలు హిట్ అయ్యి ఓవర్ నైట్‌లో స్టార్స్ అయిన హీరోలు, హీరోయిన్స్ చాలా తక్కువ మంది ఈమధ్య కనిపిస్తున్నారు. హీరోలు, హీరోయిన్స్ స్టార్‌డం దక్కించుకోవడంకు చాలా కష్టపడాల్సి వస్తుంది. కానీ తాజాగా అహన్ పాండే, అనీత్ పడా లు ఓవర్ నైట్‌లో స్టార్‌డం దక్కించుకున్నారు. వీరు నటించిన 'సయ్యారా' సినిమా గత శుక్రవారం విడుదల అయింది. ఒక్క శుక్రవారం వీరి జాతకాన్ని మార్చేసింది. మొన్న శుక్రవారం నుంచి వీరి గురించి జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. చుంకీ పాండే ఫ్యామిలీ హీరో అయిన అహాన్ పాండే నటుడిగా భలే ఎంట్రీ దక్కించుకున్నాడు. ఇకపై అతడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ లవ్ ఫిల్మ్ యంగ్ హీరో కావడం ఖాయం. లవ్ సినిమాలు అంటే ఇక మీదట అహాన్ పాండే గుర్తుకు రావాల్సిందే. సినిమాలో అతడి లుక్‌తో పాటు, నటన కూడా బాగుంది. అందుకే అతడు ఓవర్ నైట్ స్టార్ అయ్యాడు. ఇక హీరోయిన్ అనీత్ పడా సైతం ఓవర్ నైట్ స్టార్ అయింది. ప్రస్తుతం హిందీ ప్రేక్షకులు మాత్రమే కాకుండా అన్ని భాషల సినీ ప్రేక్షకులు, ఫిల్మ్ మేకర్స్ అనీత్ గురించి



మాట్లాడుకుంటున్నారు. దాంతో ఈమె ఓవర్ నైట్‌లో స్టార్‌డం దక్కించుకోవడం మాత్రమే కాకుండా కొత్త నేషనల్ క్రష్‌గానూ మారింది. 22 ఏళ్ల అనీత్ పడ్డా ఇండస్ట్రీలో సయ్యారా సినిమాతో అడుగు పెట్టిందని చాలా మంది అనుకుంటున్నారు. కానీ సయ్యారా కంటే ముందు అనీత్ పడ్డా సలాం వెంకీ సినిమాలో నటించింది. ఆ సినిమాలో పెద్దగా ఆకట్టుకోలేక పోయింది. అంతే కాకుండా బిగ్ గర్ల్స్ డోంట్ క్రై అనే వెబ్ సిరీస్‌లో నటించింది. అది కూడా అనీత్ కి నటిగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. దాంతో ఆఫర్లు పెద్దగా రాలేదు. లక్కీగా వచ్చిన సయ్యారా సినిమాలో ఆమె తనను తాను నిరూపించుకుంది. వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకున్న అనీత్ పడ్డా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా నిలదొక్కుకున్నట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సయ్యారా సినిమా ప్రస్తుతం బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ వసూళ్లను రాబడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. సయ్యారా విడుదలకు ముందు నుంచే పాజిటివ్ బజ్ ను క్రియేట్ చేసింది. ఈమధ్య కాలంలో ఏ కొత్త హీరో హీరోయిన్ సినిమాలు దక్కించుకోని భారీ ఓపెనింగ్స్‌ను దక్కించుకుంది. అంతే కాకుండా విడుదల తర్వాత వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో మొదటి రోజు ఏకంగా 20 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం అందుతోంది. ఇప్పటికే సినిమా రూ.50 కోట్ల వసూళ్లు పూర్తి చేసింది. వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి ఈ వసూళ్ల నెంబర్ ఎంత వరకు చేరుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమాకు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ నేపథ్యంలో మొదటి వారం రోజుల్లో దాదాపుగా రూ.100 కోట్ల వసూళ్లు సాధించినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. దాంతో అనీత్ పడ్డా బాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల సినిమాల్లోనూ వరుస ఆఫర్లను సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. మరి అనీత్ పడ్డా ఈ క్రేజ్‌ను, స్టార్‌డంను ఎలా కాపాడుకుంటూ సినిమాలు చేస్తుందో చూడాలి.

## రష్మిక జీవితంలో కొత్త మలుపు

రష్మిక జీవితంలో ఊహించని మలుపును చూడబోతున్నాం. త్వరలోనే ఈ భామ ఎంటర్ ప్రెన్యూర్ కాబోతోంది. బాలీవుడ్ టాలీవుడ్ లో ఇప్పటికే చాలా మంది కథానాయికలు ఎంటర్ ప్రెన్యూర్లుగా ఎదుగుతున్నారు. ఇప్పుడు వారి బాటలోనే రష్మిక కూడా అనూహ్యమైన స్టెప్ తీసుకుంటోంది. రష్మిక త్వరలోనే వ్యాపార రంగంలో అడుగుపెట్టబోతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునేందుకు ఈ కూర్గ్ (కన్నడ) బ్యూటీ ప్రయత్నాలు ప్రారంభించిందని తెలుస్తోంది. అయితే రష్మిక ప్రారంభించబోయే వ్యాపారం ఏమై ఉంటుంది? అంటే దానికి ఇంకా ఎలాంటి సమాధానం లేదు. చాలా మంది అగ్ర కథానాయకలు వస్త్ర వ్యాపారంలో ఉన్నారు. రకరకాల ఫ్యాషన్ లేబుల్స్ ప్రారంభించి భారీగా లాభాలార్జిస్తున్నారు. దీపిక పదుకొనే, సోనమ్ కపూర్, ఆలియా భట్ వంటి ప్రముఖులు ఫ్యాషన్ రంగంలో



రాణిస్తున్నారు. ఇప్పుడు రష్మిక కూడా అదే బాటను అనుసరిస్తోందా? లేక ఏదైనా ఇతర రంగాల్లో అడుగుపెడుతుందా? అన్నది వేచి చూడాలి. రష్మిక తన జీవితంలో కొత్త మలుపు గురించి ప్రస్థావిస్తూ.... తాను త్వరలో కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వెల్లడించింది. ఈ రోజు నేను చాలా చాలా ముఖ్యమైన దాని కోసం షూటింగ్ చేయబోతున్నాను.. నువ్వు చెప్పినట్టే నేను ప్రారంభించబోయే వ్యాపారానికి సంబంధించిన షూట్ చేసాను! అని తన మామ్ కి రష్మిక వెల్లడించింది. ఈ సందర్భంగా తన తల్లి గురించి ప్రస్థావించిన రష్మిక.. అమ్మ ఎప్పుడూ ముందుగా తెలుసుకుంటుంది.. అని చెప్పింది. తన మనసులో ఆలోచనలను తన మాతృమూర్తి ముందే తెలుసుకున్న విషయాన్ని పేర్కొంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... రష్మిక తదుపరి పుష్ప 3లో నటించాల్సి ఉంటుంది. అంతకంటే ముందే రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ది గర్ల్ ఫ్రెండ్ అనే లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో కనిపించనుంది. అటు బాలీవుడ్ లోను పలు చిత్రాల్లో నటిస్తోంది.




## వారెవ్వా.. చరణ్ మాములుగా లేడుగా!



టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్.. ఇప్పుడు పెద్ది మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. భారీ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమాకు ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. మేకర్స్ ఫుల్ జోష్ లో షెడ్యూల్స్ ను కంప్లీట్ చేస్తున్నారని చెప్పాలి. రీసెంట్ గా నైట్ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేసినట్లు సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. సెట్స్ లో చరణ్ నిప్పులు చెరుగుతున్నారని చెబుతూ అంచనాలు పెంచారు. అంతకుముందు భారీ ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేశారు మేకర్స్. హైదరాబాద్ లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్ లో తీసిన ఆ సన్నివేశాల్లో చరణ్ జీవించేశారని అంతా అన్నారు. అలా పెద్ది సినిమాకు గాను రామ్ చరణ్ పూర్తిగా లీనమై, పాత్రకు ప్రాణం పోయడానికి తన శాయశక్తులా కృషి చేస్తున్నారని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు అది నిజమనేలా.. సోషల్ మీడియా పోస్ట్ క్లియర్ గా చెబుతుంది. తాజాగా వర్కౌట్స్ చేస్తున్న వేరే లెవెల్ ఫోటోను రామ్ చరణ్ ఇన్ స్టాలో పోస్ట్ చేశారు. పెద్ది మూవీ కోసం చేంజ్ ఓవర్ స్టార్ట్ అయిందని రాసుకొచ్చారు. అందులో చరణ్ అయితే నెవ్వర్ బిఫోర్ అనేలా ఉన్నారు. లాంగ్ హెయిర్, గుబురు గడ్డం, కండలు తిరిగిన దేహంతో అదిరిపోయారు. సినిమా కోసం ఆయన ఎంతలా కష్టపడుతున్నారో పిక్ ద్వారా తెలుస్తోంది. దీంతో ఆ పిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. సినిమా కోసం ఎంతో వెయిట్ చేస్తున్నట్లు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అది బాడీ కాదురా.. బాక్సాఫీస్ అంటూ ఫ్యాన్స్ రచ్చ రచ్చ చేస్తున్నారు.

సోషల్ మీడియా బ్లాస్ట్ అంటున్నారు. కమ్ బ్యాక్ తో బాక్సాఫీస్ ను షేక్ చేసేయ్ అన్న అంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. మొత్తానికి చరణ్ పిక్ ను వైరల్ చేస్తూ ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. అయితే ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్, పోస్టర్స్ కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. అందులో చరణ్ లుక్ కు అంతా ఫిదా అయ్యారు. సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. చరణ్ ఖాతాలో మరో బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ఫిక్స్ అయ్యారు. నెవ్వర్ బిఫోర్ అనే విధంగా చరణ్ సందడి చేయనున్నారని డిసైడ్ అయిపోయారు. ఇక మూవీ విషయానికొస్తే.. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీశ్ కిలారు భారీ బడ్జెట్ తో నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటీనటులు యాక్ట్ చేస్తున్నారు. 2026 మార్చి 27న చరణ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ రిలీజ్ అవ్వనుంది.

## 'బార్బరిక్' ట్రైలర్.. ఎలా ఉందంటే?




కంటెంట్ ఉండడంతోపాటు స్పెషల్ కాన్సెప్ట్ ఉండే సినిమాల ను మూవీ లవర్స్ కచ్చితంగా ఆదరిస్తారన్న విషయం తెలిసిందే. కొత్త పాయింట్ ను తీసుకుని.. సరికొత్తగా రూపొందించే సినిమాలను ఇప్పుడు అంతా ఇష్టపడుతున్నారు. ఇప్పుడు ఆ కోవకు చెందుతుంది త్రిబాణధారి బార్బరిక్ చిత్రం. మరికొద్ది రోజుల్లో గ్రాండ్ గా థియేటర్స్ లో రిలీజ్ కానుంది. భీముడు మనవడు, ఘటోత్కచుడు కుమారుడు బార్బరిక్ (బార్బరికుడు) పాత్ర ఆధారంగా రూపొందుతోంది త్రిబాణ ధారి బార్బరిక్ మూవీ. మోహన్ శ్రీవత్స దర్శకత్వం ఆ సినిమాను స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పిస్తున్నారు. వానర సెల్యూలాయిడ్ బ్యానర్ పై విజయపాల్ రెడ్డి అడిదల రిచ్ వాల్యూస్ తో నిర్మిస్తున్నారు. సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహ, సాంచి రాయ్, ఉదయ భాను, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, వీటీవీ గణేష్ సహా పలువురు నటీనటులు సినిమాలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇన్ఫ్యూజన్ బ్యాండ్ సంగీతాన్ని అందిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తవ్వగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుతున్నారు మేకర్స్. అదే సమయంలో ఇప్పటికే మూవీపై మంచి బజ్ క్రియేట్ చేశారు. పోస్టర్లు, మోషన్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ సహా ప్రమోషనల్ కంటెంట్ తో ఇంట్రెస్ట్ క్రియేట్ చేశారు. సత్య రాజ్, వశిష్ట, సత్యం రాజేష్ ఇలా ప్రతి ఒక్కరి పాత్రలకు ఎంత ప్రాముఖ్యత ఉందో క్లియర్ గా రివీల్ చేశారు. సత్యరాజ్ కనిపించిన తీరు మూవీకి హైలెట్ గా నిలిచేలా ఉంది. విజువల్స్, ఆర్ఆర్, మేకింగ్ స్టాండర్డ్స్ అన్నీ కూడా నెక్స్ట్ లెవెల్ క్వాలిటీతో సినిమాను మేకర్స్ తీస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. దీంతో సినిమా కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. బుధవారం సాయంత్రం ట్రైలర్ ను రిలీజ్ చేశారు. మూవీ విడుదల తేదీని మాత్రం ఇంకా అనౌన్స్ చేయలేదు. చూడు బార్బరికా.. ఈ యుద్ధం నీది.. ధర్మధ్వజం రెపరెపలాడాలంటే.. ఆ ధర్మం చేసేవారికి దండన లభించాలి.. అంటూ శ్రీకృష్ణుడు ఉపదేశిస్తున్న సీన్ తో ట్రైలర్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత అప్పుడే ఓ యువతి నిద్రలో ఒక్కసారిగా భయపడి మేల్కొంటోంది. అనగనగా పూల తోట.. అందులో.. అంటూ లవ్ స్టోరీని రివీల్ చేశారు మేకర్స్. నేను చెప్పిన కథలో తోటమాలి సామాన్యుడు అనుకుంటే పొరపాటే అంటూ బ్యాక్ గ్రౌండ్ లో డైలాగ్ రాగా.. సత్యరాజ్, తన మనవరాలు ఓ సమాధి వద్ద కనిపిస్తారు. పోలీస్ ఆఫీసర్ గా వీటీవీ గణేష్.. మన కళ్ల ముందు పెరిగిన పిల్లలు చిన్నవాళ్లేలా కనిపిస్తారు. కానీ పెద్దవాళ్ళు అయ్యారని కొన్ని ఘటనలు గుర్తుచేస్తాయని చెబుతారు. సత్యరాజ్ మనవరాలు మిస్ అవుతుంది. పేపర్స్ లో కూడా యాడ్స్ వేస్తారు. ఆమె కోసం వశిష్ట వెతుకుతారు. అప్పుడే నేను పాలల్లో నీరే కలుపుతా.. విషం కలప అంటూ ఉదయభాను పవర్ ఫుల్ గా ఎంట్రీ ఇస్తారు. ఆ తర్వాత మిగతా పాత్రలను పరిచయం చేశారు. అయితే సత్యరాజ్ తన కుమార్తె కోసం బార్బరికుడుగా మారుతారు. తన మనవరాలిని కాపాడుకుంటారు. ఆ సమయంలో ఏం జరిగిందనేది కథగా తెలుస్తోంది. ఓవరాల్ గా ట్రైలర్ అయితే అద్భుతంగా ఉంది. సత్యరాజ్ తన పాత్రలో జీవించినట్లు కనిపిస్తున్నారు. ప్రతి ఫ్రేమ్ లో ఆయన టాలెంట్ క్లియర్ గా కనిపిస్తోంది. నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్ లో ఉదయభాను అదరగొట్టేసిందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. వీటీవీ గణేష్, సత్యం రాజేష్ సహా ప్రతి ఒక్కరూ తమ పాత్రలో ఒదిగిపోయి కనిపించారు. స్టోరీ చాలా ఎఫెక్టివ్ గా ఉండనున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ విలువలు అయితే వావ్ అనేలా ఉన్నాయి. ఎక్కడా కాంప్రమైజ్ అయినట్లు కనిపించలేదు. కుశేందర్ రమేష్ రెడ్డి కెమెరా వర్క్, మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇన్ఫ్యూజన్ బ్యాండ్ ఇచ్చిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అయితే వేరే లెవెల్. ప్రళయ మృత్యు భీకరం.. విలయ తాండవం అంటూ బ్యాక్ గ్రౌండ్ లో వచ్చిన పాట పవర్ ఫుల్ గా ఉండి ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ట్రైలర్ చూస్తే హార్ట్ అండ్ సోల్ పెట్టి డైరెక్టర్ మోహన్ శ్రీవత్స సినిమా తీసినట్లు ఉందని చెప్పడంలో అసలు ఆలోచించక్కర్లేదు. ఇలాంటి సినిమాలు వచ్చి చాలా కాలమైందని చెప్పాలి. దీంతో బార్బరిక్ మూవీ కచ్చితంగా ఆకట్టుకుంటుందని అంతా ఫిక్స్ అయ్యారు. ఇప్పుడు ట్రైలర్.. సినిమాపై ఉన్న అంచనాలను ఆకాశాన్ని తాకేలా చేసింది. ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. మరి త్రిబాణధారి బార్బరిక్ చిత్రం ఎంతటి విజయం సాధిస్తుందో అంతా వేచి చూడాలి.

## అందాల బేబమ్మ రొమాంటిక్ ఫోజ్

'ఉప్పెన' సినిమాతో చిన్న వయసులోనే హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి శెట్టి. హీరోయిన్‌గా మొదటి సినిమాతోనే సూపర్ హిట్ దక్కడంతో ఇండస్ట్రీలో ఈమె పేరు మారుమ్రోగింది. అంతకు ముందు బాల నటిగా చేసినా, కమర్షియల్ యాడ్స్‌లో చేసినా కూడా రాని గుర్తింపు ఉప్పెన సినిమాతో కృతి శెట్టి దక్కించుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ కృతి శెట్టి సొంతం అంటూ చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉండేవారు. మొదటి సినిమాలో పద్ధతైన లంగా ఓనీ, చుడీదార్‌లో కనిపించిన శృతి శెట్టి ఆ తర్వాత కూడా అదే తరహా పాత్రలను దక్కించుకుంది. మెల్ల మెల్లగా స్కిన్ షో చేస్తూ అందాల ఆరబోత చేస్తూ వచ్చింది. కృతి శెట్టి ఇండస్ట్రీలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంది. ఉప్పెన హిట్ కారణంగా కృతికి అర డజను సినిమాల్లో ఆఫర్లు దక్కాయి. మొదట్లో వరుసగా సినిమాలు హిట్ అయ్యాయి. కానీ తెలుగులో మాచర్ల నియోజకవర్గం నుంచి మొదలుకుని వరుసగా ఫ్లాప్స్ చవిచూస్తూ వచ్చింది. దాంతో కృతి శెట్టికి తెలుగులో ఆఫర్లు తగ్గాయి. ఆమెకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉంది, అంతే కాకుండా ఆమెకు సోషల్ మీడియాలో తెలుగు వారి నుంచి మంచి ఫాలోయింగ్ ఉంది. కానీ అందాల బేబమ్మకు టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ నుంచి ఆఫర్లు కనుమరుగు అయ్యాయి. కస్టడీ తర్వాత కృతి శెట్టి ఆఫర్లు తగ్గాయి.



గత ఏడాది మనమే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. టాలీవుడ్ లో ఆఫర్లు తక్కువ కావడంతో కృతి శెట్టి లక్కీగా తమిళ్, మలయాళ సినిమాల నుంచి ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ఆ మధ్య వచ్చిన మలయాళ మూవీ ఏఆర్ఎం తో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈమె చేతిలో ఏకంగా మూడు తమిళ సినిమాలు ఉన్నాయి. వాటిల్లో ఖచ్చితంగా రెండు మంచి విజయాన్ని సొంతం చేసుకుంటాయి అనే విశ్వాసంను వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కృతి శెట్టి రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన రెడ్ టాప్, బ్లూ జీన్స్ ఔట్ ఫిట్ కృతి శెట్టి మరింతగా మెరిసేలా చేస్తుంది అనడంలో సందేహం లేదు. క్యూట్ బ్యూటీ కాస్త ఈ రొమాంటిక్ ఫోజ్‌లో చూపు తిప్పనివ్వడం లేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈమె చేస్తున్న వా వాతియర్ సినిమా విడుదలకు ముస్తాబు అవుతోంది. ఇక ఈమె ప్రదీప్ రంగనాథన్ తో చేస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తమిళ్‌తో పాటు తెలుగులోనూ ఈ సినిమా విడుదల కాబోతుంది. ఈ ఏడాదిలోనే విడుదల కాబోతున్న ఈ సినిమాతో కృతి శెట్టికి మరోసారి తెలుగులో మంచి పేరు వస్తుందని, తద్వారా తెలుగు సినిమా ఆఫర్లు సైతం వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు జీనీ అనే తమిళ మూవీలోనూ కృతి శెట్టి నటిస్తోంది. ఇంతకు ముందు పెద్దగా అందాల ఆరబోత చేయని కృతి శెట్టి ఇప్పుడు స్కిన్ షోకి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న నేపథ్యంలో వరుస ఆఫర్లు, ముఖ్యంగా కమర్షియల్ పాత్రలు చేసే అవకాశాలు రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## తెలుగు నటి యూరప్‌లో రచ్చ రచ్చ

దక్ష నగర్‌కర్ పరిచయం అవసరం లేదు. టాలీవుడ్ లో హుషారు అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తొలి ప్రయత్నం సక్సెసైంది. తనదైన అందం హుషారైన నటనతో యువతరంలో మంచి ఫాలోయింగ్ సంపాదించింది. అటుపై జాంబీరెడ్డి తో మరో పెద్ద సక్సెస్ ని ఖాతాలా వేసుకుంది. ఆ తర్వాత బంగార్రాజులో స్పెషల్ అప్పీరియన్స్ తో ఆకట్టుకుంది. నాగచైతన్య-నాగార్జునలతో కలిసి ఓ పాటలో కనిపించింది. దక్ష ప్రస్తుతం తెలుగు పరిశ్రమ సహా ఇరుగు పొరుగునా బిజీ నటిగా మారుతోంది. ఇక సోషల్ మీడియాలో దక్ష స్పీడ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు టెంప్టింగ్ ఫోటోలతో ఇన్ స్టాని హీటెక్కించడం ఈ భామ ప్రత్యేకత. ఇంతకుముందు జిమ్,



ఫిట్నెస్ కి సంబంధించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేసిన దక్ష ఇటీవల గ్లామర్ ఎలివేషన్ కి సంబంధించిన ఫోటోషూట్లపైనా ఫోకస్ చేస్తోంది. దక్ష ప్రస్తుతం యూరప్ ట్రిప్‌లో ఫుల్‌గా చిల్ చేస్తోంది. బుడాపెస్ట్ నుంచి ఇంతకుముందే ఒక వీడియోని, కొన్ని ఫోటోలను కూడా దక్ష షేర్ చేసింది. ఈ హాలి బ్యూటీ పాక్షికంగా అందాలను హైలైట్ చేసే బ్లాక్ అండ్ బ్లాక్ లుక్ తో యువతరం హృదయాలను మరిగిస్తోంది. డార్క్ థీమ్డ్ ఫోటోషూట్ తో దక్ష అందం పదింతలైంది. యూరప్ లో దక్ష బోలెడంత రచ్చ చేయబోతోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536